సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64



నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



జూన్ డేస్ తిరుగుబాటు
ఫోన్ ట్యాపింగ్ పేరు
'ఆపరేషన్ ఆర్ ఆర్'!
రువాండా – కాంగో మధ్య
చరిత్రాత్మక శాంతి ఒప్పందం
లోపలి పేజీల్లో



సంపుటి 28, సంచిక: 01 | శుక్రవారం | 20-06-2025 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00


## డబ్బు బయటపడటం నిజమే



- జస్టిస్ యశ్వంత్‌వర్మ నివాసంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు
- నిర్ధారించిన ముగ్గురు న్యాయమూర్తుల ప్యానెల్
- జడ్జి యశ్వంత్‌వర్మ తొలగింపును ప్రతిపాదించిన సుప్రీంకోర్టు విచారణ కమిటీ
- 10 రోజుల సమయం, 55మంది సాక్షుల విచారణ, 64పేజీల నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికారిక నివాసంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి చర్చనీయాంశమైన కాలిన డబ్బునోట్ల కట్టల వివాదాన్ని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు నియమించిన కమిటీ తన నివేదికలో నిగ్గుతేల్చింది. హైకోర్టు జడ్జి యశ్వంత్‌వర్మ, ఆయన కుటుంబ సభ్యులు స్టోర్ రూమ్‌పై 'రహస్య లేదా క్రియాశీలత నియంత్రణ' కలిగి ఉన్నారని, అక్కడ సగం కాలిపోయిన నగదు భారీగా దొరకడం ఆయన దుష్ప్రవర్తనను రుజువు చేస్తున్నదని, ఇది ఆయనను తొలగించాలని కోరేంత తీవ్రమైనదని ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్న సుప్రీంకోర్టు నియమించిన విచారణ సంఘం నివేదిక తెలియజేసింది.పంజాబ్, హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శీల్ నాగు నేతృత్వం వహించిన ముగ్గురు జడ్జిల కమిటి 10 రోజుల పాటు విచారణ జరిపింది.మార్చి 14న దాదాపు ఉదయం 1135గంటల సమయంలో అప్పటి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి, ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ యశ్వంత్‌వర్మ తరువాయి 2లో

## గోదావరి – బనకచర్ల ప్రాజెక్టుపై
# ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు తిరస్కరించండి

- ఎపి ప్రభుత్వం రాష్ట్ర పునర్విభజన చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తోంది
- బనకచర్ల అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థికశాఖ, పర్యావరణ శాఖ తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు
- కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

> ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియలో సత్వరం స్పందిస్తూ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శించడం తగదు. ఈ వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య పలు అపోహలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతో పాటు అన్ని రకాల అనుమతులు వెంటనే మంజూరు చేయాలి.
>
> – పాటిల్‌తో సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్.పాటిల్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్–1980 (జిడబ్ల్యూడిటి), ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టం–2014 లకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రికి వారు తెలియజేశారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గురువారం సమావేశమయ్యారు. బనకచర్ల ప్రాజెక్టు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ, పర్యావరణ శాఖ వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయని కేంద్ర మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదిస్తున్నామని ఎపి చెబుతోందని, జిడబ్ల్యూడిటి1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదన్నారు. 2014 ఎపి పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్టు నిర్మించాలనుకుంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూసి), జలశక్తి మంత్రి అధ్యక్షతన రాష్ట్రాల తరువాయి 2లో

## వ్యవసాయ రంగంలో ఎఐ వినియోగంపై
# ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
- సచివాలయంలో నెదర్లాండ్ ఎఆర్ఐక్యూటి కంపెనీ ప్రతినిధులతో సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యవసాయ రంగంలో ఎఐ వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో నెదర్లాండ్‌కు చెందిన ఎఆర్ఐక్యూటి కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న సాంకేతికత, ప్రత్యేకించి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వృద్ధిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయరంగాన్ని ఆధునీకీకరించేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నదని ఎఆర్క్యూటి కంపెనీల ప్రతినిధులకు వివరించారు. అంతకు ముందు కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా రైతులకు ఒకేసారి సమాచారాన్ని అందించడం, రైతుల ఫిర్యాదులకు ఏఐ ఆధారంగా తక్షణ సూచనలు ఇవ్వడంలాంటి సౌకర్యాలు కల్పించగలమన్నారు.. అంతేకాకుండా పంటలపై వచ్చే చీడ పీడలను మొబైల్ ఫోన్ కెమెరా ద్వారా స్కాన్ చేసి గుర్తించే తరువాయి 2లో



# మెట్రో ఫేజ్– 2కు అనుమతులివ్వండి

కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సిఎం విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో ఫేజ్–2కు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌తో ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. అత్యంత తరువాయి 2లో

# రికార్డు వేగంతో రైతు భరోసా

నాలుగు రోజుల్లోనే రూ.6405 కోట్లు
62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ

ప్రజాపక్షం / హైదరాబాద్

వానాకాలం పంటల పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతు భరోసాను రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా రికార్డు వేగంతో పంపిణీ చేస్తోంది. తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించిన మేరకు ఆర్థిక శాఖ ఏ రోజుకారోజు నిధులను విడుదల చేస్తుంది. ఈ నెల 16వ తేదీన రైతు నేస్తం వేదికగా రైతు భరోసా చెల్లింపులను సిఎం ప్రారంభించారు. నాలుగు రోజుల్లోనే రికార్డు వేగంతో రూ. 6,405 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. గురువారం సాయంత్రం వరకు రాష్ట్రంలో ఐదు ఎకరాల్లోపు భూములున్న రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమయ్యాయి. ఇప్పటివరకు మొత్తం 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ అయినట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. మొత్తం 1.06 కోట్ల ఎకరాల భూములకు పెట్టుబడి సాయం అందింది. ఎకరంలోపు 24.22 లక్షల మంది రైతులు, రెండెకరాల లోపు 17.02 లక్షల మంది, మూడు ఎకరాల లోపు 10.45 లక్షల మంది, 4 ఎకరాల లోపు 6.33 లక్షల మంది, 5 ఎకరాల లోపు 4.43 లక్షల మంది ఇప్పటివరకు రైతు భరోసా పథకం ద్వారా లబ్ధి పొందారు.

# రైతులకు బేడీలేమిటి!

గద్వాల ఎస్‌పికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఫోన్

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులకు బేడీలు వేయడం పట్ల రైతు కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండరెడ్డి పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జైలు నుండి కోర్టుకు తీసుకొచ్చే క్రమంలో రైతులకు పోలీసులు బేడీలు వేసి తీసుకురావడం పట్ల చైర్మన్ కోదంరెడ్డి మనస్తాపానికి గురైయ్యారు. వెంటనే జోగులాంబ గద్వాల్ జిల్లా ఎస్‌పి శ్రీనివాస్ రావుకు ఫోన్ చేసిన చైర్మన్ కోదండరెడ్డి పోలీసులతీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రైతులకు బేడీలు వేసి తీసుకువచ్చిన ముగ్గురు పోలీస్ అధికారులను సస్పెండ్ చేసినట్లు చైర్మన్ కోదండరెడ్డికి ఎస్‌పి వివరణ ఇచ్చారు.



భారత్–పాక్ యుద్ధ నివారణలో
## నా ప్రమేయం లేదు

ఎట్టకేలకు ఒప్పుకున్న డోనాల్డ్ ట్రంప్
విలేకరుల సమావేశంలో పాక్ సర్వసైన్యాధికారి ఆసిఫ్ మునీర్‌పై ప్రశంసలు

**వాషింగ్టన్ :** భారత్–పాకిస్థాన్ దేశాలు యుద్ధాన్ని విరమించడంలో తన ప్రమేయం లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎట్టకేలకు అంగీకరించారు. పాకిస్థాన్ సర్వసైన్యాధికారి, ఆసిఫ్ మునీర్‌కు బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు (భారత్ కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 10.30 గంటలు) వైట్‌హౌస్ క్యాబినెట్ రూములో విందు ఇచ్చారు. విందుకు ముందు, విందు తర్వాత ట్రంప్ పాత్రికేయులతో భారత్–పాకిస్థాన్ యుద్ధ విరమణపై రెండు రకాలుగా మాట్లాడారు. విందు ముందు యుద్ధాన్ని ఆపిన ఘనత తనదే తరువాయి 2లో

# అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాదం నశించాలి

- గాజాపై ఇజ్రాయెల్ అమానుష దాడి సరైందికాదు
- వామపక్ష నాయకుల ఉద్ఘాటన
- రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

**హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం వద్ద నేతల అరెస్టు**



ప్రజాపక్షం/ రంగారెడ్డి ప్రతినిధి /గండిపేట

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. హైదరాబాద్ లోని గౌలిదొడ్డి ఏరియాలో ఉన్న అమెరికన్ కాన్సులేట్ కార్యాలయం ముందు జరిగిన నిరసన ప్రదర్శనలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇటి నర్సింహ పాల్గొనగా, భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. కాగా, అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాదం నశించాలని హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వద్ద గురువారం తరువాయి 2లో

ఇజ్రాయెల్‌పై ఇరాన్
# భీకర దాడి



- భారీగా హైపర్ సోనిక్ క్షిపణులు ప్రయోగం
- సొరోకో ఆసుపత్రి ధ్వంసం
- 40 మంది రోగులకు గాయాలు

**టెహ్రాన్ :** దక్షిణ ఇజ్రాయెల్ ప్రాంతాలపై హైపర్ సోనిక్ క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడింది. గురువారంనాడు ఏడోరోజు యుద్ధంలో ఇజ్రాయెల్‌లోని అతిపెద్ద సొరోకో ఆసుపత్రి భవనాన్ని ధ్వంసం చేసింది. పక్కనే ఉన్న అణు స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నామని, ఆసుపత్రిపై దాడిచేసే ఉద్దేశం తమకు లేదని ఇరాన్ పేర్కొంది. ఆసుపత్రిపై జరిగిన దాడిలో 40 మంది రోగులు గాయపడినట్లు వైద్యులు చెప్పారు. దీంతోపాటు ఇజ్రాయెల్‌వ్యాప్తంగా అనేక నగరాలలో కూడా ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. ఇరాన్ క్షిపణి దాడుల్లో ఇజ్రాయెల్ భారీనష్టాన్ని చవిచూసింది. అతిఎత్తైన, బహుళ అంతస్తుల భవనాలపై ఇరాన్ క్షిపణులు దాడులు చేశాయి. రాజధాని టెల్‌అవీవ్ సమీపంలో నివాసిత భవనాలపైకి క్షిపణులు దూసుకెళ్ళాయి. భారీసంఖ్యలో మృతులు లేరు. అదేసమయంలో ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌లోని అరాక్ భారజల రియాక్టర్‌ను ధ్వంసం చేసింది. గడచిన ఏడు రోజులుగా ఇరాన్‌లోని అణుసంబంధ వ్యవస్థలు, సీనియర్ అధికారులు, అణు శాస్త్రవేత్తలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తున్నది. ఇరాన్‌లో దాదాపు 639 మంది మరణించారు. వీరిలో 263 మంది పౌరులు ఉన్నారు. 1300 మంది గాయపడ్డారు. శాటిలైట్ సహాయంతో అమెరికా ఇస్తున్న సమాచారం ఆధారంగా ఇజ్రాయెల్ దాడులు తరువాయి 2లో

# ఆకాశంలో క్షిపణులు చూశాం...

- బాంబుల మోతలు విన్నాం
- ఇరాన్‌లో భయానక పరిస్థితిపై ఎంబిబిఎస్ విద్యార్థులు మీడియాకు వెల్లడి
- తొలి తరలింపు విమానంలో బాధితులు ఢిల్లీ విమానాశ్రయం చేరిక

**న్యూఢిల్లీ :** ఇరాన్‌ఇజ్రాయెల్ దేశా ల మధ్య భీకర యుద్ధం నేపథ్యంలో ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులను భారత్‌కు తీసుకువచ్చేందుకు ప్రారంభించిన 'ఆపరేషన్ సింధు' మా ప్రాణాలను రక్షించిందని ఢిల్లీకి చేరుకున్న బాధితులు ఊపిరి పీల్చుకున్నారు. మీడియాతో మాట్లాడుతూ ఇరాన్ దేశంలో వారు ఎదుర్కొన్న భయానక చేదు జ్ఞాపకాలను వివరించారు. 'మేం ఆకాశంలో క్షిపణులను చూశాం. మా పరిసరాలలో బాంబుల తరువాయి 12లో



# సొంతింటికల నెరవేర్చడం ప్రభుత్వ ఆశయం

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి
- వాసాలమర్రి గ్రామంలో 277 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు జారీ

ప్రజాపక్షం/తుర్కపల్లి

పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చాలనే ఆశయంతో అర్హులైన పేదవారికి ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు పంపిణీ జరిగిందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం యాదాద్రి జిల్లా, ఆలేరు నియోజకవర్గం, తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి గ్రామంలో అర్హులైన పేదవారికి ఇందిరమ్మ ఇండ్ల తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## బంగ్లాదేశ్‌లో ఇక ఆగస్టు 5న ప్రభుత్వ సెలవు



**ఢాకా :** ఆగస్టు ఐదోతేదీని ప్రభుత్వ సెలవుదినంగా బంగ్లాదేశ్ ప్రకటించనున్నది. గత ఏడాది ఆగస్టునెల ఐదో తేదీన బంగ్లాదేశ్‌లో లక్షలాదిమంది విద్యార్థులు షేక్ హసీనా ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు తేదీని పబ్లిక్ హాలిడేగా బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇకమీదట పాటించనున్నది. దీనిని 'పబ్లిక్ అప్‌రైజింగ్ యానివర్సరీ'గా ఇకమీదట పాటించనున్నట్లు బంగ్లాదేశ్ సాంస్కృతికవిభాగం సలహాదారు మొస్తాఫా సర్వార్ ఫారూఖీ ప్రకటించారు. ఇకమీదట ఆగస్టు 5వ తేదీన ప్రభుత్వంపై విద్యార్థులు మార్పుకోసం తిరుగుబాటుచేసిన దినోత్సవంగా ప్రతిసంవత్సరం పాటిస్తామన్నారు. ఢాకాలోని ఫారిన్ సర్వీస్ అకాడమీలో గురువారంనాడు పత్రికాగోష్ఠిలో ఆయన ఈ విషయం చెప్పారు. విద్యార్థుల తిరుగుబాటు కారణంగా అవామీలీగ్‌పార్టీకి చెందిన ప్రధాన మంత్రి షేక్ హసీనా దేశం వదిలివెళ్ళిపోయారు. ఆమె భారత్‌లో తలదాచుకున్నారు.

## జెలెన్‌స్కీతో ముఖాముఖీకి పుతిన్ సంసిద్ధత



**సెయింట్ పీటర్స్‌బర్గ్ :** ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ముఖాముఖీ చర్చలకు సిద్ధంగా ఉన్నానని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. వివిధ దేశాల వార్తాసంస్థల అధిపతులతో టాస్ వార్తా సంస్థ నిర్వహించిన ఒక సమావేశంలో గురువారంనాడు అనేక విషయాలపై పుతిన్ మాట్లాడారు. శాంతి చర్చల్లో ఎవరు పాల్గొన్నారనే విషయాన్ని తాను పట్టించుకోనని పుతిన్ చెప్పారు. శాంతి చర్చల తుదిదశలో జెలెన్‌స్కీతో ముఖాముఖీ సంప్రదింపులకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. శాంతి చర్చల ఒప్పందంపై సంతకం చేయడానికి జెలెన్‌స్కీకి ఉన్న అధికారం ఏమిటని పుతిన్ ప్రశ్నించారు. ఆయన పదవీకాలం ముగిసిందని, ఆయన అనధికారికంగా అధ్యక్షుడుగా కొనసాగుతున్నారని విమర్శించారు. సాంకేతికంగా చూస్తే జెలెన్‌స్కీ పదవీకాలం ముగిసిందని, ప్రస్తుతం మార్షల్ లా చట్టపరిధిలో ఉక్రేన్ పాలన కొనసాగుతోందన్నారు. మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధాన్ని ఏదో గుడ్డిగా విరమింపజేయడానికి ఎలాంటి ప్రాధాన్యతా లేదని, ఇలాంటి సమస్యలు, యుద్ధాలు భవిష్యత్‌లో మళ్ళీ రాకుండా శాశ్వత పరిష్కారం సాధించాల్సిన అవసరం ఉందని చెబుతూ, పుతిన్ ఒక షరతు విధించారు. ఈ చర్చల్లో ప్రతిపాదనలు దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేర్చేవిగా, సమస్యలను పరిష్కరించేవిగా ఉండాలన్నారు. సంప్రదింపులు ఒక కొలిక్కి వచ్చిన తర్వాత తుదిదశలో మాత్రమే తాను జెలెన్‌స్కీతో చర్చలకు సిద్ధపడతానన్నారు. ఐతే ఈ సంప్రదింపులు ఎప్పుడు జరుగుతాయి? ఎప్పుడు ప్రారంభం అవుతాయి? అనే విషయాన్ని ఆయన చెప్పలేదు. తుర్కియే (టర్కీ) చొరవతో రెండు విడతలుగా ఇస్తాంబుల్‌లో ఉక్రేన్–రష్యా ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. ఒకవైపు దాడులు కూడా కొనసాగాయి.

**ఉక్రేన్‌కు 6000 పైగా మృతదేహాలు అప్పగింత**



ఉక్రేన్‌కు 6000కు పైగా సైనికుల మృతదేహాలను రష్యా ప్రభుత్వం స్వాధీనం చేశామని పుతిన్ చెప్పారు. మరో 3000 మంది ఉక్రేన్ సైనికుల మృతదేహాలను స్వాధీనం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇస్తాంబుల్‌లో రెండో విడత జరిగిన చర్చల సందర్భంగా కుదిరిన ఒప్పందాన్ని గౌరవించి అందుకు అనుగుణంగా మూడు రోజు లు కాల్పుల విరమణ పాటించామని, మృతదేహాలను ఒకచోటచేర్చి వాటిని ఉక్రేన్‌కు స్వాధీనం చేశామని పుతిన్ చెప్పారు. రెండు దేశాలు సజీవంగా 1200 మంది సైనికుల వంతును ఇరువైపులా పరస్పరం ఇచ్చిపుచ్చుకోవాలని కూడా నిర్ణయించుకున్నామని, ఉక్రేన్ నుండి 1200 మంది రష్యా సైనికులను ఇచ్చిపుచ్చుకునే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు.ఇప్పటికే 500 మంది ఉక్రేన్ సైనికులను వారికి అప్పగించామని, 400 మంది రష్యా సైనికులను వెనక్కు తెచ్చుకున్నామని చెప్పారు. ఇంతకుముందు కూడా రెండుసార్లు మూడు రోజులపాటు రెండు దేశాలు పాతికేళ్ళలోపు వయసుగల సైనికులను సగౌరవంగా ఇచ్చిపుచ్చుకున్నాయి.

కాగా యూరోపియన్ దేశాలు తమతో సంబంధాలను రద్దుచేసుకున్నాయని, వారు కోరుకుంటే తిరిగి సహకారాన్ని పునరుద్ధరించడానికి రష్యా సిద్ధంగా ఉందని పుతిన్ అన్నారు. దాదాపు రెండేళ్ళక్రితం జర్మనీ మాజీ ఛాన్సలర్ ఓలాఫ్ షుల్జ్ సహా ఇతర యూరప్ నాయకులు తనతో నిత్యసంబంధాలు కలిగి ఉన్నారని, కానీ యుద్ధరంగంలో రష్యాను ఓడించేందుకు వ్యూహాత్మక కుట్రలు చేయడం ప్రారంభించిన తర్వాత వారు తనతో టచ్‌లో లేకుండాపోయారన్నారు. అదేవిధంగా యుద్ధ మండలంలో జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరపడం నేరం అవుతుందని పుతిన్ అన్నారు.

### రువాండా – కాంగో మధ్య
## చరిత్రాత్మక శాంతి ఒప్పందం

**దశాబ్దాలనాటి యుద్ధానికి ఇక తెర**



**వాషింగ్టన్ :** సెంట్రల్ ఆఫ్రికాలో ఇరుగుపొరుగు దేశాలైన డి.ఆర్.కాంగో, రువాండా మధ్య దశాబ్దాలుగా జరుగుతున్న యుద్ధానికి తెరపడేందుకు రంగం సిద్ధమైంది. ఈ రెండు దేశాలూ శాంతి ఒప్పందానికి సంబంధించి ఒక ముసాయిదా తీర్మానంపై పరస్పరం అంగీకారం తెలియజేశాయి. శుక్రవారంనాడు ఈ శాంతి ఒప్పందంపై సంతకాలు జరుగుతాయి. అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో సమక్షంలో ఈ శాంతి ఒప్పందంపై సంతకాలు జరుగుతాయి. అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ఈ రెండు దేశాలమధ్య రాజకీయ భద్రత, ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై గడచిన మూడు రోజులుగా నిర్మాణాత్మకమైన చర్చలు జరిగాయి. చర్చల అనంతరం ముసాయిదా ఒప్పందంపై అంగీకారం కుదిరింది. రెండు దేశాలకు చెందిన ఉన్నతస్థాయీ అధికారులు ఈ ముసాయిదా శాంతి ఒప్పందంపై అంగీకారం తెలియజేశారు. గతంలో రెండు దేశాలూ సంతకాలు చేసిన ఒక ఒప్పందం పునాదులపై ఈ కొత్త ఒప్పందం జరిగింది. ఈ ఏడాది ఆరంభంలో తూర్పు డి.ఆర్.కాంగోలో ఎం–23 తిరుగుబాటు దారులు ఖనివనరుల నిక్షేపాలు అత్యధికంగా ఉండే స్వాత్ ప్రాంతాలను ఆక్రమించాయి. దీంతో దారుణహింసాకాండ చెలరేగింది. ఎం–23 ఉగ్రవాదులు రువాండా ప్రభుత్వ సైన్యం అండదండలతోనే డి.ఆర్.కాంగోలోకి ప్రవేశించి దురాక్రమణకు పాల్పడి హింసాకాండ సృష్టించారు. ఈ హింసవల్ల ఇటీవలి నెలల్లో వేలాదిమంది మరణించారు. అనేకవేలమంది ఇళ్ళు వదిలిపారిపోయారు. నిరాశ్రయులయ్యారు. మరి ఇక స్వాత్స్ ప్రాంతాన్ని ఎం–23 తిరుగుబాటుదారులు ఖాళీచేసి వెళ్ళిపోతారా? తూర్పు కాంగో ప్రాంతం నుండి రువాండా గ్రూపు లు వెనక్కి వెళతాయా? రువాండా ప్రభుత్వం తన తప్పు ఒప్పుకుంటుందా? ఒప్పందం ప్రకారం ఎం–23 తిరుగుబాటు దారులు ఆయుధాలను వదిలేస్తారా? మానవతా సహాయాన్ని పంపిణీ చేయడానికి గోమా విమానాశ్రయాన్ని తిరిగి తెరుస్తారా?లేదా? అనే విషయాలన్నీ ఇప్పటికీ ప్రశ్నార్థకాలుగానే మిగిలిపోయాయి.

ఈ ఒప్పందం జరగడానికి అమెరికా, ఖతార్ దేశాలు మధ్యవర్తిత్వం చేశాయి. తూర్పు డి.ఆర్.కాంగోలో దశాబ్దాలుగా రువాండా, కాంగోలకు చెందిన సాయుధ గ్రూపులమధ్య యుద్ధం హింసాకాండ కొనసాగుతున్నది. ఈ హింసను విడనాడి, యుద్ధాన్ని విరమించేందుకు వీలుగా తగిన షరతులు, నిబంధనలు, ఆయుధాలను వదలిపెట్టి వెనక్కు తగ్గి ఉండేందుకు వీలైన షరతులను మధ్యవర్తిదేశాలైన అమెరికా, ఖతార్‌లు రూపొందించాయి. అమెరికా విదేశాంగ మంత్రిత్వశాఖ ఈ ముసాయిదా ఒప్పంద రూపకల్పనలో కీలకపాత్ర వహించింది. తదుపరి కాలంలో ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించి యుద్ధజ్వాలలు చెలరేగకుండా ఉండేందుకు ఒక ఉమ్మడి భద్రతా పర్యవేక్షణ యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేస్తారు. ఈ యంత్రాంగం ఈ పరిస్థితులను పర్యవేక్షిస్తూ ఉంటుంది. అపారమైన ఖనిజ వనరులకు నియంగా ఉన్న కాంగో, రువాండాలున్న సెంట్రల్ ఆఫ్రికాదేశాలలో అమెరికా సహా ఇతర అగ్రరాజ్యాలు వేల డాలర్లు పెట్టుబడులు సమకూర్చేందుకు కూడా ఒప్పందం కుదిరింది. ఐతే ఈ సంఘర్షణ ముగిసిపోవడానికి సంబంధించిన శాంతి ఒప్పందంపై ఇప్పటికీ ఇంకా అనేక ప్రశ్నలు మిగిలిపోయాయని నిపుణులు అంటున్నారు.

# రూపురేఖలు మారనున్న చర్లపల్లి చెరువు

**చెరువును సందర్శించిన ఉన్నతాధికారులు**
**అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్న హైడ్రా**
**చెరువు అభివృద్ధిపై జైళ్ల శాఖ, హైడ్రా అధికారుల భేటీ**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చర్లపల్లి చెరువు రూపురేఖలు మారనున్నాయి. మంచినీటి సరస్సుగా రూపొందించడమే కాకుండా, నయన మనోహరంగా దీనిని తీర్చిదిద్దనున్నారు. జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా ఆహ్వానం మేరకు హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ గురువారం చర్లపల్లి చెరువును సందర్శించారు. జైళ్ల శాఖ, హైడ్రాతో పాటు స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, జిహెచ్‌ఎంసి అధికారులు కూడా ఈ సందర్భనలో ఉన్నారు. చర్లపల్లి జైలు ప్రాంతంలో ఉన్న 58 ఎకరాల చర్లపల్లి చెరువును ఆధునికీకరించడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దడంపై ఇరువురు ఉన్నతాధికారులు చర్చించారు. చెరువు చుట్టూ తిరిగి, ఇన్‌లెట్, ఔట్‌లెట్‌లను పరిశీలించారు. ప్రస్తుతం చెరువులో కొద్దిమొత్తం నీరు ఉన్నా పరిశుభ్రంగా ఉండడంతో జీవవైవిద్యానికి అవకాశం లభించిందని, ఇంకా ఈ చెరువు నిండా నీరుంటే మరింత ఆహ్లాదంగా మారుతుందని భావించారు. ఈ క్రమంలో చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, పర్యాటక, విహార కేంద్రంగా తీర్చిదిద్దడంపై చర్చించారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు, కట్టను బలోపేతం చేసి పాత్వేను అభివృద్ధి చేయడం వెంటనే చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. సోలార్ లైటింగ్ సిస్టమ్‌తో పాటు సిసిటివి కెమేరా వ్యవస్థను ఏర్పాటు చేస్తే మరింత భద్రత ఉంటుందని నిర్ణయించారు. ఇలా చెరువులో మంచి నీరు నిలిచేందుకు చేపట్టాల్సిన చర్యలను చర్చించారు. ఇందుకు సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందించాలని హైడ్రా, నీటిపారుదల ఇంజనీరింగ్ విభాగానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు.

**ఆరేడు చెరువుల నుంచి నీరు..** హకీంపేట నుంచి నాగిరెడ్డి కుంట, కాప్రా చెరువు, మోతుకులకుంట, బైసన్‌కుంట గొలుసుకట్టు చెరువుల ద్వారా చర్లపల్లి చెరువుకు నీరందుతుంది. ఈ చెరువునకు మురుగు నీరు కలవకుండా డైవర్ట్ నాలా కూడా ఉంది. చెరువు చుట్టూ దాదాపు 3 కిలోమీటర్ల మేర నడక దారి అందుబాటులోకి వస్తుంది. చుట్టూ పాత్వే, మినీ పార్కులు, చెట్లు, సీటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు సిసిటివి కెమేరాలు ఏర్పాటు చేస్తే స్థానికులే కాకుండా విహార కేంద్రం అవుతుంది. చర్లపల్లి పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్) ద్వారా నిధులు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నారని సౌమ్య మిశ్రా తెలిపారు. ఒక్కో సెగ్మెంట్‌కు ఎంత ఖర్చు అవుతుందో సమగ్ర నివేదిక ఇస్తే ఆ క్రమంలో సిఎస్‌ఆర్ నిధులు అడగడానికి వీలౌతుందన్నారు. అంత కు ముందు చెరువునకు సంబంధించిన వీడియో చిత్రాలను, చెరువు అభివృద్ధికి ప్రణాళికలను జైళ్ల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చూపించారు. హైడ్రా అగ్నిమాపకశాఖ అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, జైళ్లశాఖ ఐజి మురళీబాబు, డిఐజిలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్, ఓపెన్ జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## భీకర దాడి
**(మొదటి పేజీ తరువాయి)**

చేస్తున్నది. బుషైర్ అణుకేంద్రాలపై గురువారం దాడిచేసినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. అందుకు ప్రతీకారంగా ఇరాన్ 400 క్షిపణులను ప్రయోగించింది. కాగా ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి మాట్లాడుతూ, శుక్రవారం నాడు జెనీవాలో యూరోపియన్ దేశాలతో ఒక సమావేశంలో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ సమావేశం ద్వారా సరికొత్త దౌత్యపరమైన మార్పులు సంభవిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**నేనేం చేస్తానో ఎవ్వరికీ తెలియదు : ట్రంప్**
ఇరాన్ విషయంలో తన సహనం చచ్చిపోయింని ట్రంప్ అన్నారు. తానేం చేస్తానో ఎవ్వరికీ తెలియదన్నారు. వాషింగ్టన్‌లో ఆయన మాట్లాడుతూ, ఇరాన్ చర్చలకు దూరంగా ఉండిపోయిందన్నారు. ఇజ్రాయెల్‌తో కలిసి దాడులు చేసే విషయంపై ఆయన ఒక నిర్ణయం తీసుకుంటున్నారని వార్తలు వెలువడిన తర్వాత ఆయన మళ్ళీ మాట్లాడుతూ, తాను ఈ విషయంలో అనుకున్నవిధంగా చెయ్యచ్చు, చెయ్యకపోవచ్చునని అన్నారు. ఇరాన్ అణుస్థావరాలపై దాడులు చేసేందుకు ఒక ప్రణాళికను మంగళవారంనాడు ట్రంప్ ఆమోదించారు. కానీ దానిని అమలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకుండా స్తంభింపజేశారని వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. బేషరతుగా ఖమేనీ లొంగిపోవాలన్న డిమాండ్‌ను ట్రంప్ పునరుద్ఘాటించారు. వచ్చే వారం ఇంతకంటే భారీస్థాయిలో దాడులు జరగవచ్చు లేదా తక్కువ దాడులు జరగవచ్చునని ట్రంప్ చెప్పినట్లు ఆ పత్రిక పేర్కొంది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై దాడులు చేసే విషయంపై రిపబ్లికన్‌పార్టీలో విభేదాలు ఏర్పడ్డాయి. పార్టీలో వ్యక్తమవుతున్న అనుకూల,ప్రతికూల భిన్నాభిప్రాయాలు ట్రంప్‌ను చికాకుపెడుతున్నాయి. ఇజ్రాయెల్ ఆసుపత్రిపై ఇరాన్ భారీదాడి చేసిన తర్వాత ఇజ్రాయెల్ రక్షణమంత్రి కట్జ్ స్పందిస్తూ, ఇక ఖమేనీ ఎంతోకాలం మనుగడ సాగించే అవకాశం లేదన్నారు. ఐతే ఆసుపత్రిపై దాడి చేసే ఉద్దేశం తమకు లేదని, ఆసుపత్రి పక్కనే ఉన్న అణుస్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని తమ క్షిపణులు దాడి చేశాయని ఇరాన్ వివరణ ఇచ్చింది.

## ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
**(మొదటి పేజీ తరువాయి)**

టెక్నాలజీని రాష్ట్ర భాగస్వామ్యంగా తీసుకురావడానికి ఆసక్తిని వ్యక్తం చేశారు.దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల మా 'ప్రతినిధుల సూచనలు పరిశీలిస్తామన్నారు. కంపెనీ ప్రతినిధులు వివరించిన సాంకేతికతను ముందుగా వెరిఫై చేసుకుని ఏపి ప్రభుత్వ పథకాలలో దీన్ని సమర్థవంతంగా వినియోగించవచ్చో అధ్యయనం చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు మంత్రి సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయ డైరెక్టర్ గోపి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అనుమతులివ్వండి
**(మొదటి పేజీ తరువాయి)**

వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్2 అవసరం ఎంతో ఉందని సిఎం తెలియజేశారు. రూ.24,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. మెట్రో ఫేజ్2 సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా సాగడంతో పాటు రహదారులపై రద్దీ తగ్గుతుందని, సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సిఎం తెలిపారు. పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డిపిఆర్ సమర్పించిన విషయాన్ని కేంద్ర మంత్రికి సిఎం గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్2 ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎంపిలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎ.పి.జితేందర్ రెడ్డి, మెట్రో ఎండి ఎన్.వి.ఎస్.రెడ్డి, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ వైద్యకళాశాలల్లో
## బోధనా సిబ్బందిని నియమించండి

**మంత్రి దామోదర రాజనర్సింహ్మాతో తెలంగాణ జుడా ప్రతినిధులు సమావేశం**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మరింత బోధన సిబ్బందిని నియమించి, బలోపేతం చేయాలని, తద్వారా నాణ్యమైన వైద్య విద్య అందుతుందని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (తెలంగాణ జుడా) ప్రతినిధులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో జుడా అధ్యక్షుడు డాక్టర్ ఇసాక్‌న్యూటన్, జనరల్ సెక్రెటరీ డాక్టర్ దుర్గం అజయ్ కుమార్ గౌడ్ , ఉపాధ్యక్షులు డాక్టర్ గిరి ప్రసాద్, డాక్టర్ సందీప్, అధికార ప్రతినిధి డాక్టర్ వినయ్ కుమార్, ఉస్మానియా జుడా అధ్యక్షుడు డాక్టర్ అవినాశ్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ కీర్తికా ప్రతినిధి బృందం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను గురువారం కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలతో పాటు వైద్య విద్య బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై వారు వినతిపత్రం అందజేశారు. స్టైఫెండ్‌ను పెంచాలని, వైద్య కళాశాలల్లో మౌలికసదుపాయాలను పెంచాలని, శిక్షణకు అవసరమైన మంచి వాతావరణం ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని జుడాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు.

ఇందుకు మంత్రి దామోదర రాజనర్సింహ స్పందిస్తూ సమస్యలను ఇది వరకే సిఎంతో చర్చించామని, ఈ నెల 24న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో పలు సిఫార్సులను తీసుకెళ్తామని మంత్రి తెలిపారు.

## ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టిన రోజు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఐసిసి అగ్రనాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. హైదరాబాద్‌లోని టిపిసిసి ప్రధాన కార్యాలయం గాంధీభవన్‌లో మంత్రులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఎంపి అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. వేడుకలలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మ ణ్, పెద్ద సంఖ్య లో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న తరానికి రాహుల్ గాంధీ దిక్సూచి అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కులగణనకు ఒప్పుకోవడానికి రాహుల్‌గాంధీ ఒత్తిడి మేరకేనని, అందుకే కేంద్రం కులగణనకు గెజిట్ విడుదల చేసిందన్నారు. దానికి రాహుల్ గాంధీ ఆలోచన మేరకే కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ కులగణన చేసిందన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ మాట్లాడుతూ దేశ ప్రజల కోసం కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారన్నారు. కాంగ్రెస్‌లో మాత్రమే బడుగు బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

బలహీనవర్గాలకు చెందిన మంత్రిగా పొన్నం ప్రభాకర్, దళిత మంత్రిగా తాను, టిపిసిసి అధ్యక్షులుగా మహేష్‌కుమార్ గౌడ్‌లు నిదర్శనమన్నారు. సామాజిక న్యాయం కేవలం కాంగ్రెస్ పార్టీలోనే జరుగుతుందన్నారు. ఎంపి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆలోచన మేరకే కాంగ్రెస్‌లో యువతకు పెద్ద పీట వేస్తున్నారన్నారు.

## డబ్బు బయటపడటం నిజమే
**(మొదటి పేజీ తరువాయి)**

అధికారిక నివాసంలోని అగ్నిప్రమాదం సంభవించిన ప్రదేశాన్ని సందర్శించింది. ఈ సంఘటనకు సంబంధించి మొత్తం 55మంది సాక్షులను విచారణ సంఘం విచారించింది. ఈ నివేదిక ఆధారంగా పూర్వ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి జడ్జి యశ్వంత్‌వర్మపై అభిశంసనకు సిఫారసు చేశారు. ఆ నగదు / డబ్బు జస్టిస్ వర్మ న్యూఢిల్లీలోని అధికారిక నివాసమైన 30 తుగ్లక్ క్రిసెంట్ స్టోర్‌రూమ్‌కు చెందినదే అని విచారణ సంఘం కనుగొన్నది. ఆ స్టోర్ రూమ్‌లోకి ప్రవేశించడం జస్టిస్ వర్మ, అతని కుటుంబసభ్యుల 'రహస్య లేదా నియంత్రణ'లో ఉందనడానికి గట్టి సాక్ష్యం ఉన్నదని తెలిపింది. 'అంతేకాకుండా బలమైన అనుమానిత ఆధారాల ప్రకారం 2025 మార్చి 15న తెల్లవారుజామున న్యూఢిల్లీలోని 30 తుగ్లక్ క్రిసెంట్ అధికారిక నివాసం స్టోర్ రూమ్ నుంచి తగులబడిపోయిన నగదు / డబ్బు తొలగించబడింది' అని సుప్రీంకోర్టుచే నియమించబడిన విచారణ సంఘం తన 64 పేజీల నివేదికలో తెలిపింది.'రికార్డులో ఉన్న ప్రత్యక్ష ఎలక్ట్రానిక్ సాక్ష్యం మార్చి 22న భారత ప్రధాన న్యాయమూర్తి రాసిన లేఖలో లేవనెత్తిన ఆరోపణల్లో తగినంత నిజం ఉందని, జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించేందుకు చర్యలు ప్రారంభించాలని డిమాండ్ చేసేంత దుష్ప్రవర్తన ఉన్నదని ఈ కమిటీ దృఢంగా విశ్వసిస్తోంది' అని నివేదిక కొనసాగింది. సాక్షుల వాంగ్మూలాలను కమిటీ పూర్తిగా విశ్లేశించింది. 1997లో సుప్రీం కోర్టు తన పూర్తి కోర్టు సమావేశంలో జోడించిన 'న్యాయ జీవిత విలువల పున:స్థాపనను' కమిటీ ప్రస్తావించింది. న్యాయమూర్తి నుంచి ఆశించే అన్ని సద్గుణాలు నిజాయితీ భావనపై ఆధారపడి ఉన్నాయని కమిటీ స్పష్టంగా చెప్పింది. ఒక న్యాయమూర్తి నిజాయితీని కొలవడానికి కొలమానం ఉంటుందని, ఇది సివిల్ పదవిలో ఉన్న వ్యక్తి నుంచి ఆశించే నిజాయితీ కంటే కఠినమైనదని, ఉన్నత న్యాయవ్యవస్థ కార్యాలయాలు ప్రశ్నార్థకంగా ఉన్నప్పుడు నిజాయితీ అనే అంశం 'ప్రధానమైన, అనివార్యమైన, సంబంధితమైనది'గా మారుతుంది అని కమిటీ పేర్కొంది. 'ఒక ఉన్నత న్యాయవ్యవస్థ సభ్యుడి నుంచి సాధారణ ప్రజల అంచనా చాలా అధికంగా ఉంటుంది. న్యాయపదవిలో ఉన్న వ్యక్తికి నిజాయితీ అత్యంత ముఖ్యమైన అనివార్యమైన లక్షణం. ఇది ప్రాథమిక అర్హత ప్రమాణం. ఏదైనా న్యాయస్థాన అధికారి జిల్లా లేదా ఉన్నత న్యాయవ్యవస్థ నుంచి ఆశించే కనీస అంశం కోర్టుగది వెలుపల నిష్కళంకమైన స్వభావం, ప్రవర్తన' అని కమిటీ వ్యాఖ్యానించింది. ఈ విషయంలో ఏదైనా లోపం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. దీనిని కఠినంగా పరిగణించాలని జస్టిస్ యశ్వంత్‌వర్మపై అభిశంసనను సిఫారసు చేస్తున్నట్లు విచారణ సంఘం స్పష్టం చేసింది.జస్టిస్ నాగుతో పాటు హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జిఎస్.సంధావాలియా, కర్నాటక హైకోర్టు జస్టిస్ అనుశివరామన్ ఈ విచారణ కమిటీకి ప్రాతినిధ్యం వహించారు. మార్చి 22న పూర్వ భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నియమించిన ఈ కమిటీ దేశ రాజధాని ఢిల్లీలో అప్పటి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికారిక నివాసం 30తుగ్లక్ క్రిసెంట్‌లో దాదాపు 1135గంటల రాత్రి సమయంలో సంభవించిన అగ్నిప్రమాద ఘటనపై విచారణ జరిపారు.ఒక సాధారణ అగ్నిప్రమాద సంఘటనగా ప్రారంభమైన ఈ ఘటన ఇప్పుడు న్యాయపరమైన దుష్ప్రవర్తన, ప్రజా విశ్వాసం ఉల్లంఘన వంటి తీవ్రమైన అభియోగాలను ఎదుర్కొన్నది.పలువురు సాక్షులు, అగ్నిప్రమాద నివారణ సిబ్బంది, పోలీస్ అధికారులు విచారణ కమిటీకి తెలిపిన ప్రకారం అక్కడి నేలపై రూ.500నోట్లకట్టలు కాలిపోయిన నిల్వలు ఉన్నాయని వెల్లడైంది.

## తిరస్కరించండి
**(మొదటి పేజీ తరువాయి)**

ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలని, బనకచర్ల విషయంలో ఎపి ప్రభుత్వం వీటన్నింటిని ఉల్లంఘిస్తోందని కేంద్ర మంత్రికి సిఎం తెలియజేశారు. బనకచర్ల విషయంలో ఆంధ్రప్రదేశ్ ఏ నిబంధనలు పాటించకుండా, వరద జలాల ఆధారంగా ప్రాజెక్టు చేపడుతున్నామని చెబుతుండడం తీవ్ర అభ్యంతరకరమని జలశక్తి మంత్రితో సిఎం పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జలశక్తి మంత్రిత్వ శాఖ తక్షణమే జోక్యం చేసుకుని బనకచర్ల ప్రాజెక్ట్ ముందుకెళ్లకుండా చూడాలని కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**పోలవరం డిజైన్లు మార్పు చేసిందని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు అన్యాయం**

సిడబ్ల్యూసి పరిధిలోని సాంకేతిక సలహామండలి నుంచి అనుమతులు పొందకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఎపి చేపట్టిందని కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలియజేశారు. జిడబ్ల్యూడిటి–1980 నిబంధనల ప్రకారం పోలవరం డిజైన్లు మార్పు చేసిందని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతోందని, తాము అభ్యంతరాలు లేవనెత్తినా పనులు మాత్రం కొనసాగిస్తూనే ఉందని కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం వివరించారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం విషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. గోదావరిలో వరద జలాలున్నాయని నిజంగా ఎపి భావిస్తుంటే పోలవరం–బనకచర్లకు బదులు కేంద్రం నిధులు ఇచ్చే ఇచ్చంపల్లి–నాగార్జున సాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్లు తీసుకెళ్లే విషయంలో చర్చకు తాము సిద్ధమని కేంద్ర మంత్రికి సిఎం, రాష్ట్ర మంత్రి తెలిపారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలని కేంద్ర మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో తాము ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడబోమని, అన్ని వేదికల ద్వారా సమస్యలు సామరస్యపూర్వకంగా పరిష్కారానికి ప్రయత్నిస్తామని సిఎం కేంద్ర మంత్రి పాటిల్‌కు తెలియజేశారు. కేంద్ర స్పందన అనుకూలంగా లేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని కేంద్ర మంత్రికి సిఎం స్పష్టం చేశారు.

**తెలంగాణ 1500 టిఎంసిలకు వాడుకునేలా అనుమతులు ఇవ్వండి**

తెలంగాణకు గోదావరి నదిలో 1000 టిఎంసిలు, కృష్ణా నదిలో 500 టిఎంసిలు మొత్తంగా 1500 టిఎంసిల నీటి వినియోగానికి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసి) జారీ చేయాలని, దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 1500 టిఎంసిల నీటితో కోటిన్నర ఎకరాలకు నీరు అందుతుందని, ఆ తర్వాత ఎపి చేపట్టే ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు.

**మూసీ పునరుజ్జీవనానికి నిధులు కేటాయించాలి**

గంగా, యమునా నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లే మూసీ పునరుజ్జీవనానికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. సుదీర్ఘంగా సాగిన సమావేశంలో తమ విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. బనకచర్లకు సంబంధించిన డిపిఆర్ తమకు అందలేదని కేంద్ర మంత్రి తెలిపారని, త్వరలోనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ తెలిపారు. సమావేశంలో ఎంపిలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎ.పి.జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదలశాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సిఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## విద్యార్థులకు భాషా పరిజ్ఞానం ఉండేలా ఉపాధ్యాయులు కృషి డా.చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాతృ భాషతో పాటు ఆంగ్ల,హిందీ భాషల్లో విద్యార్థులకు విద్యా బోధన, భాషా పరిజ్ఞానం ఉండాలని,అందుకు ఉపాధ్యాయులు పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి సూచించారు. విద్య ద్వారానే ఏదైనా సాధించవచ్చన్నారు. బడి బాట ముగింపు కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్‌లోని 'చిలకలగూడ ప్రభుత్వ ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం' స్కూల్‌లో గురువారం జరిగిన ఉత్సవంలో చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రైమరీ స్కూల్ చిన్నారులతో చిన్నారెడ్డి అక్షరాభ్యాసం చేయించారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు కూడా హాజరై చిన్నారులకు ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ సూర్య ప్రకాష్, డిప్యూటీ డిఇఒ శ్రీధర్, ఎంఇఒ మదన్ మోహన్‌రెడ్డి, అమ్మ కమిటీ అధ్యక్షులు ప్రేమదేవి తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడిదారులకు దేశ సంపదను
# దోచిపెట్టేందుకే ఎన్‌కౌంటర్లు
### పౌర హక్కుల సంఘం నేతలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ సంపద ప్రజలందరికీ దక్కడం కోసం సాయుధులై పోరాడుతున్న మావోయిస్టులను కిరాతకంగా కాల్చి చంపడం దుర్మార్గమని పౌర హక్కుల సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తుల అండతో గద్దెనెక్కిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అడవిలో నిక్షిప్తమై ఉన్న అపార సంపదను గుప్పెడు మంది పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు దమనకాండకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ బూటకమని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణ చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. పౌర హక్కుల సంఘం నాయకులు గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని దేశవ్యాప్తంగా డిమాండ్ వస్తున్న నేపథ్యంలో ఎన్‌కౌంటర్ల పేరుతో శాంతిని కోరుకుంటున్నవారిని చంపివేయడం దారుణమన్నారు. సాయుధులైన ఉద్యమకారులే స్వయంగా శాంతి చర్చలు కోరుకుంటున్న నేపథ్యంలో కేంద్రం ఇందుకు సంతోషంగా ఒప్పుకోవాల్సిందిపోయి మావోయిస్టులను మట్టుపెడుతాం. ఏరివేస్తామంటూ బహిరంగ ప్రకటనలు చేయడం ప్రజాస్వామ్యానికే విఘాతం అన్నారు. ఇప్పటికైనా కేంద్రం తక్షణమే మావోస్టులతో చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ మారెడ్‌మిల్లిలో బూటకపు ఎన్‌కౌంటర్‌తో ప్రభుత్వం ముగ్గురిని దారుణంగా హత్య చేసిందని ఆరోపించారు. కేంద్ర కమిటీ సభ్యులైన గాజర్ల రవి ఎన్‌కౌంటర్‌లో చనిపోవడమంటే ఇది నమ్మశక్యంగా లేదన్నారు. ఆయనను సజీవంగా పట్టుకుని చిత్రహింసలకు గురిచేసి చంపారని, అందుకే ఇప్పటివరకు వారి ఫొటోలను కూడ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేయలేదని పేర్కొన్నారు. నాటి ఎమర్జెన్సీని మించిన పాలన నేడు దేశంలో కొనసాగుతోందన్నారు. మేధావులు స్పందించి ఈ పరిస్థితికి అడ్డుకట్టవేయాలని కోరారు. చిన్నచిన్న అంశాలకే స్పందించే రాజ్యాంగబద్ధ సంస్థలైన సుప్రీంకోర్టు, జాతీయ మానవ హక్కుల కమిషన్లు దేశంలో నరమేధం సాగుతుంటే మిన్నకుండిపోవడం ఈ దేశానికి మంచిది కాదన్నారు.

తక్షణమే ఈ వ్యవస్థలు న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో పౌరహక్కుల నేతలు ఎన్.నారాయణరావు, బల్లా రవి, చంద్రమౌళి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాటయోధురాలు సుగుణకు అంతిమ వీడ్కోలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిరంకుశ నిజాం సైన్యం, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు శాఖమూరి సుగుణమ్మ ధైర్యం చాలా గొప్పదని, దోపిడీ, అసమానతల పునాదిని ప్రశ్నించే ఉద్యమ నిర్మాతల్లో సుగుణమ్మ ఒకరని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో మంగళవారం మరణించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధురాలు, కమ్యూనిస్టు నాయకురాలు శాఖమూరి సుగుణమ్మ భౌతికకాయాన్ని గురువారం హైదరాబాద్ కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో సుగుణ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. డాక్టర్ నారాయణతో పాటు సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, డాక్టర్ బి.వి. విజయలక్ష్మి, సిపిఐ మాజీ ఎంఎల్‌సి పి.జె.చంద్రశేఖర్ రావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, జ్యోతి, సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వర్‌రావు, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వర్ రావు, కోశాధికారి వి.చెన్నకేశవరావు, సిఆర్ పాలీ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జె.కల్పన, సభ్యులు వి.లలిత, ఆరుట్ల మమత, పి.ప్రేమ్ పావని, తమ్మారెడ్డి తాన్యా, ప్రముఖ కవి డాక్టర్ ఎస్.వి.సత్యనారాయణ తదితరులు శాఖమూరి సుగుణమ్మ భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.





**మహాప్రస్థానంలో అంత్యక్రియలు :**
సుగుణ అత్యక్రియలు గురువారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జరిగాయి. సుగుణమ్మ అత్యక్రియలకు డాక్టర్ కె.నారాయణతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. సుగుణ కుమార్తె డాక్టర్ శాఖమూరి శోభ, కుమారులు డాక్టర్ శాఖమూరి రవి, శాఖమూరి రమేష్‌లకు నేతలు పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**సుగుణ విప్లవ జోహార్లు : ఎస్.బాల్‌రాజ్**
కమ్యూనిజం రావాలంటే కమ్యూనిస్టులంత బేషరతుగా ఒకటి కావాలని ఆశించిన గొప్ప కమ్యూనిస్టు సుగుణ భౌతికంగా లేరని తెలిసి ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ విచారం వ్యక్తం చేశారు. సుగుణ, ఎస్‌వికె.ప్రసాద్‌లతో కలిసి పని చేసే అవకాశం వచ్చిందని గుర్తుచేసుకున్నారు. సుగుణ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## మానేరు రివర్ ఫ్రంట్ పనులలో
# అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి
### సిఎంకు చాడ వెంకట్‌రెడ్డి వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కరీంనగర్ నగరంలోని మానేరు రివర్ ఫ్రంట్ పనులలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై, సంబంధిత గుత్తేదార్‌పై గత పాలకుల పాత్రపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ శాసనసభ్యుడు చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని చాడ వెంకట్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ నగరంలో మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల పేరుతో గత ప్రభుత్వం రివర్‌ఫ్రంట్ నిర్మాణం కోసం రూ.500కోట్లు మంజూరు చేసిందని, అందులో టూరిజం శాఖకు రూ.100కోట్లు, నీటి పారుదల శాఖకు రూ.100కోట్లు నిధులు విడుదల చేసిందని చాడ వెంకట్‌రెడ్డి సిఎంకు తెలిపారు. గత ప్రభుత్వకాలంలో ఈ రివర్‌ఫ్రంట్ నిర్మాణ పనులు చేపట్టి ఆ పనులను తన అనుచరులకు అప్పగించారని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా గుత్తేదార్ నిర్లక్ష్యం వహించారని, పనులు కూడా పూర్తికాకుండానే బిల్లులు చెల్లించారని, నిర్మాణంలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని తెలుస్తున్నదని సిఎంకు చాడ వెంకట్‌రెడ్డి వివరించారు. రివర్‌ఫ్రంట్ పరిధిలో చెక్ డ్యామ్‌లు నిర్మించగా వర్షాకాలంలో కురిసిన వానలకు అవి పూర్తిగా కొట్టుకుపోయాయని, చెక్‌డ్యామ్‌లు కొట్టుకుపోయిన తరువాత కూడా రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ ఈ పనులు ఇప్పటికీ పూర్తికాలేదని చాడ వెంకట్‌రెడ్డి తెలియజేశారు. ఈ నేపథ్యంలో మానేరు రివర్‌ఫ్రంట్ పనులలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఆయన సిఎంను కోరారు.



## తిరుపతి హాతీరామ్ బావాజీ మఠంలో..
## బంజారా పీఠాధిపతుల పూజలకు అవకాశం : కవిత విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తిరుపతి హాతిరామ్ బావాజీ మఠంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన బంజారా పీఠాధిపతులకు పూజలు చేసే అవకాశం కల్పించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని వివిధ బంజారా పీఠాధిపతులతో కలిసి హైదరాబాద్ లో టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడును కవిత గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 30న హరితామ్ బావాజీ జయంతి సందర్భంగా బంజారా (సుగాలి, లంబాడీ) పీఠాధిపతులు, పూజారులకు మఠంలో ప్రత్యేకంగా పూజలు చేసే అవకాశం కల్పించడంతో పాటు నైవేద్యం సమర్పించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. దీంతో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు స్పందిస్తూ త్వరలోనే హతిరామ్ బావాజీ పీఠం నిర్వాహకులు, గిరిజన పీఠాధిపతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని హామీనిచ్చినట్టు కవిత తెలిపారు.



పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ రాష్ట్రంలో తలెత్తే ముంపు సమస్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తెలిపారు.



## వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని తక్షణమే ప్రారంభించాలి
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ పనుల్లో కూలీల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో 2025–26కి సంబంధించి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని తక్షణమే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. వ్యవసాయ యంత్రీకరణ, ఎరువుల సరఫరా, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు తదితర అంశాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం అధికారులతో సమిక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రికరణకు ప్రభుత్వం రూ.104కోట్లను కేటాయించిందన్నారు. రైతులకు ఉపయోగకరమైన, డిమాండ్ ఉన్న పరికరాలను గుర్తించి, జిల్లాలు, నియోజకవర్గాల వారిగా కోటా నిర్ణయించి సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను అందించాల్సిందిగా సూచించారు. ఈ పథకంలో సన్న, చిన్నకారు, మహిళా రైతులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా 'నమో డ్రోన్ దీదీ' కింద సరఫరా అయ్యే 381 డ్రోన్లను మహిళా సంఘాలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వానాకాలం సీజన్‌కి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నెలవారిగా కేటాయించిన సకాలంలో వచ్చేలా అధికారులు కృషిచేయాలన్నారు. ఈ విషయంలో ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి జెపి నడ్డా లేఖ రాశారని తెలిపారు. అంతకు ముందు మార్క్ ఫెడ్ ద్వారా 1,55,257 మెట్రిక్ టన్నుల జొన్నలను సేకరించగా, 91వేల మెట్రిక్ టన్నులకు రూ.302 కోట్లు,పొద్దతిరుగుడు సంబంధించి 4,333 టన్నులు సేకరించగా, ఇందుకు గాను రూ.31 కోట్లను రైతులకు చెల్లించడం జరిగిందని మంత్రి తుమ్మలపేర్కొన్నారు. హైదరాబాద్‌లో నేడు సిఎసిపి దక్షిణ ప్రాంతీయ సమావేశం జరగనున్న నేపథ్యంలో పెరిగిన సాగు ఖర్చులు, డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారస్‌ల మేరకు రైతులకు ఇవ్వాల్సినమద్ధతు ధరల ప్రతిపాదనలను సిఎసిపి కేంద్ర ప్రభుత్వానికి సూచించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు.

# మావోయిస్టు నేతలు బందీలుగా ఉన్నారా?

ఎన్‌కౌంటర్లపై అనేక అనుమానాలు
కర్రెగుట్టల ఆపరేషన్‌లోనే నేతలు పట్టుబడ్డారా?
బంధువులకు మృతదేహాలను అప్పగించేందుకు ససేమిరా అంటున్న పోలీసులు






**ప్రజాపక్షం/ఖమ్మం :** మావోయిస్టు అగ్ర నేతలు పోలీసుల చెరలో బందీలుగా ఉన్నారా అందుకే ఒక్కొక్కరిని ఎన్‌కౌంటర్ల పేరుతో హతమారుస్తున్నారా అన్న ఈ అనుమానం పౌర హక్కుల సంఘాల నేతల్లోనూ, వామపక్ష, లౌకిక వాద శక్తుల మదిలోనూ ఉంది. ఇది నిజమే అనేందుకు ఒక్కొక్కరుగా కేంద్ర కమిటీ సభ్యులు, కీలక నేతలు ఎన్‌కౌంటర్లలో మరణించడం ఆ ఎన్‌కౌంటర్లు జరిగిన తీరు ఇందుకు కారణాలుగా చూపుతున్నారు. రెండు రోజుల క్రితం అల్లూరి జిల్లా అడవి ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన గాజర్ల రవి, అరుణ, అంజుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పలు అనుమానాలు వెల్లువెత్తుతున్న తరుణంలో మావోయిస్టు కేంద్ర కమిటీలోని ప్రధాన సభ్యులందరినీ ఆపరేషన్ కగార్‌లో భాగంగా కర్రెగుట్టలను చుట్టుముట్టినప్పుడు బందీలుగా మార్చుకుని ఉండవచ్చునన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నంబాల కేశవరావు, ఆడేలు అలియాస్ భాస్కర్, ఆంధ్రా ప్రాంతానికి చెందిన మరో ముగ్గురు కీలక నేతలను సజీవంగా బందీలుగా మార్చుకుని ఆ తర్వాత ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కేంద్ర కమిటీ సభ్యుల్లో ప్రధానమైన వ్యక్తులను బందీలుగా పట్టుకుని కర్రెగుట్టల నుంచి సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి కాల్చి చంపుతున్నారని పౌరహక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇందుకు సంబంధించి మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన గాజర్ల రవి, అరుణ, అంజుల ఘటన ధృవపరుస్తుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలో ఎక్కడా ఎన్‌కౌంటర్ జరిగిన దాఖలాలు లేవని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. కేంద్ర కమిటీ సభ్యుడు రవి సహా మరో ఇద్దరి మృతదేహాలను అప్పగించాలని రంపచోడవరం పోలీస్ స్టేషన్ వద్ద బంధువులు బుధవారం నుంచి పడిగాపులు కాస్తున్నారు. మృతదేహాలను ఇవ్వకపోయినా కనీసం చూసేందుకైనా అనుమతి ఇవ్వండి అన్నా పోలీసులు ససేమీరా అంటున్నారు. గతంలో అరుణ మృతిచెందినట్లు మూడు, నాలుగుసార్లు ప్రకటించారని కానీ ఆమె సజీవంగానే ఉందని, ఇప్పుడు కూడా అరుణ కాకపోవచ్చునన్న భావన మాలో ఉందని, మృతదేహాన్ని చూస్తే మేము గుర్తు పడతామంటూ బంధువులు పోలీస్ అధికారుల ముందు మొరపెట్టుకున్నా వినిపించుకునే స్థితిలో లేరు. గాజర్ల రవి సోదరుడు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అశోక్, అరుణ తండ్రి లక్ష్మణ్‌రావు, సోదరి ఝాన్సీ, అమరుల బంధుమిత్రుల సంఘం నాయకురాలు పద్మ తదితరులు మృతదేహాలను చూసేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడో పట్టుకొచ్చి కొట్టి కాల్చి చంపారని మృతదేహాలపై గాయాలు ఉన్నట్లు వారు ఆరోపిస్తున్నారు. మీడియా ప్రతినిధులను సైతం మృతదేహాలను చూసేందుకు అనుమతించడం లేదు.

సహజంగా కేంద్ర కమిటీ సభ్యులకు అత్యంత భారీ భద్రత ఉంటుంది. ఆ భద్రతా సిబ్బందిని మట్టుపెట్టి అగ్రనేతలను బందీలుగా మార్చుకున్నారన్న ఆరోపణలకు ఎన్‌కౌంటర్లు రుజువుగా నిలుస్తున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే మావోయిస్టు ఉద్యమ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకోక తప్పదు.




## 12 మంది మావోయిస్టులు లొంగుబాటు
### మీడియా ముందు ప్రవేశపెట్టి ఎస్‌పి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వివిధ క్యాడెర్లలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పనిచేస్తున్న 12మంది మావోయిస్టు పార్టీ సభ్యులు గురువారం జిల్లా ఎస్‌పి రోహిత్‌రాజ్ ముందు లొంగిపోయారు. ఈమేరకు ఆయన వారిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూతలో భాగంగా 12 మంది వివిధ క్యాడెర్లకు చెందిన మావోయిస్టు సభ్యులు లొంగిపోయారన్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గ్రామాలు ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో మావోయిస్టు పార్టీకి సహకరించరాదన్నారు. వారి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు ఇవ్వాలని అన్నారు. ఇటీవల కాలంలో 20మంది సాయుధ దళ సభ్యులను ములుగు జిల్లాలో అరెస్టు చేసి వారి నుండి 12 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా మావోయిస్టులు అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలన్నారు. లొంగిపోయినవారికి ప్రభుత్వం పునరావాసాన్ని కల్పిస్తుందని చెప్పారు. ఇప్పటికే చాలామంది లొంగిపోయి కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవిస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోతే వారి అభివృద్ధికి కావాల్సిన సౌకర్యాలు కల్పిచేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎఎస్‌పి విక్రాంత్ కుమార్‌సింగ్, సిఆర్‌పిఎఫ్ 81,141 బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

## బనకచర్ల ప్రాజెక్ట్, గోదావరి విషయంలో
# సిఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారు
### మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బేసిన్లపైన సిఎం రేవంత్ రెడ్డికి కనీస అవగాహన కూడా లేదని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. బనకచర్ల ప్రాజెక్ట్, గోదావరి నదీపరివాహక విషయంలో సిఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. బనకచర్ల ప్రాజెక్ట్‌ను అడ్డుకునే విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, తాము పూర్తిగా సహకరిస్తామని, ఎపికి, చంద్రబాబుకు సహకరించేలా వ్యవహారిస్తే బిఆర్‌ఎస్ తరపున తాము సుప్రీంకోర్ట్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్, బిజెపి కలిసి బిఆర్‌ఎస్‌ను ఇబ్బందిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ గోదావరిలో 1000టిఎంసి,కృష్ణాలో 500 టిఎంసిలు ఇచ్చి మిగిలిన నీటిని ఆంధ్రప్రదేశ్ తీసుకెళ్లాలని చెప్పడానికి సిఎం రేవంత్ రెడ్డి ఎవరని, ఆయన ఆంధ్రప్రదేశ్‌కు దాసోహం అయ్యారని విమర్శించారు.

నల్లమల ఏ జిల్లాల్లో ఉందో కూడా రేవంత్ రెడ్డికి తెలియదా అని ఎద్దేవా చేశారు. గోదావరి, కృష్ణా బేసిన్లకు సంబంధించిన నాలెడ్జ్ లేదని, అందరి ముందు సిఎంగా రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇద్దరూ తెలంగాణ పరువు తీశారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి విషయం తక్కువగా, విషం ఎక్కువగా ఉన్నదన్నారు. అఖిలపక్ష ఎంపిల సమావేశం పెట్టింది బనకచర్లను ఆపడానికా..?, కట్టుకోమని చెప్పడానికా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో ఒక ఏకరాకు అదనంగా నీళ్లు ఇవ్వలేదని, ఒక్క ప్రాజెక్టును నిర్మించలేదని ఆరోపించారు. నాటి ఎపి ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2004 14సంవత్సర వరకు తెలంగాణ ప్రాంతంలో 6.64 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తే, బిఆర్‌ఎస్/టిఆర్‌ఎస్ అధికారంలోనికి వచ్చిన 2014 నుంచి 2023 సంవత్సరం మధ్యలో 48. 74 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించామని హరీశ్‌రావు వివరించారు. గోదావరి నదిపైన కెసిఆర్‌అనేక ప్రాజెక్టులను నిర్మించారని, సమ్మక్క సాగర్, సీతమ్మ సాగర్ ఇలా అన్ని ప్రాజెక్టులకు హైడ్రాలజీ క్లియరెన్స్ తీసుకొచ్చామని వివరించారు. కల్వకుర్తి బీమా నెట్టెంపాడు కోయిల్ సాగర్ పూర్తిచేసి 6.50 లక్షలు ఎకరాలకు నీళ్లు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ హయాంలో పెద్దవాగు కొట్టుకుపోయిందని, ఎస్‌ఎల్‌బిసి కూలిందన్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి ఎందుకు అబద్ధాలు మాట్లాడుతున్నారని, చంద్రబాబుకు,రేవంత్ రెడ్డికి మధ్యగా తెలంగాణ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ ఉన్నారని, ఆయన గతంలో ఎపి ప్రభుత్వం నిర్మించిన అక్రమ ప్రాజెక్టులకు అండగా నిలిచారని ఆరోపించారు.




**'మూడు' వేల టిఎంసి నీరు వృధా అని సిడబ్ల్యుసి చెప్పింది :**
ప్రతి సంవత్సరం 3000 టిఎంసిల నీరు సముద్రంలో కలుస్తున్నాయని సెంట్రల్ వాటర్ కమిషన్ చెప్పిన విషయాన్ని కెసిఆర్ ప్రస్తావించారని హరీశ్‌రావు అన్నారు. ఈ నీటిని రెండు రాష్ట్రాలు ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై ఇద్దరు సిఎంలు కూర్చొని మాట్లాడుకోవాలని, రెండు రాష్ట్రాలకు లాభం చేకూరే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అపెక్స్ కమిటీ సమావేశంలో కెసిఆర్ సూచించారని వివరించారు. గోదావరి, కృష్ణ నదుల అనుసంధాన విషయంలో తెలంగాణ రాష్ట్రాన్ని సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లో ముందుకు పోకూడదని, ఒకవేళ వెళ్తే తెలంగాణ అందుకు అంగీకరించబోదని కెసిఆర్ ఇది వరకే స్పష్టం చేశారని, ఈ సమావేశంలో బనకచర్ల ప్రాజెక్ట్ చర్చనే రాలేదని వివరించారు. అపెక్స్ కమిటీ సమావేశ వివరాలను సిఎం రేవంత్ రెడ్డి వక్రీకరిస్తున్నారన్నారు. ప్రస్తుతం నది మార్గంగా కాకుండా తెలంగాణ రాష్ట్రాన్ని టచ్ చేయకుండా 200 టిఎంసిలను తన్నుకుపోతున్నారని మండిపడ్డారు. దీనిని ఆపాల్సిన బాధ్యత సిఎం, ప్రస్తుత ప్రభుత్వంపైనలేదా అని ప్రశ్నించారు.

**తెలంగాణ ప్రభుత్వం**
**ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం**
నం.08/EE PH/SRD/2025-26, తేది: 18.06.2025
హైదరాబాద్, సంగారెడ్డి డివిజన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పిహెచ్) కార్యాలయం నుండి ఆందోల్ జోగిపేట మునిసిపాలిటీలో TUIFDCలోన్ అసిస్టెన్స్ కింద అభివృద్ధి పనుల కోసం టెండర్ నోటీసు ఆహ్వానించడమైనది. 01 పని సంఖ్య (సిసి రోడ్) NIT. నం.04/EEPH/SRD/ఆందోల్ /TUFIDC/CC రోడ్లు/2 BHK హౌసింగ్ కాలనీ/ DB/ T1/2024-25 (2వ పిలుపు). **విలువ:** రూ.0.5 కోట్లు. **టెండర్లు షెడ్యూల్:** 25.06.2025న ఉ.11.00 గం.ల నుండి 02.07.2025 సా. 5.00 గం.ల వరకు. వివరాలకు https://tender.telangana.gov.in ని సందర్శించండి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (PH) పబ్లిక్ హెల్త్, డివిజన్ సంగారెడ్డి
DIPR R.O. No. : 3813-PP/CL/ADVT/1/2025-26, Date: 19-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
NIT No. 07/DB/EE/Alwal Circle/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్స్ తేది: 19.06.2025
**పని పేరు:** బిటి రోడ్లు, సిసి రోడ్లు మరియు వరద నీటి కాలవల నిర్వహణ, **అంచనా విలువ:** రూ.25.50లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 20.06.2025న మ.4.30గం.ల నుండి, బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 23.06.2025న సా.4.30గం.ల వరకు, ఇఇ **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 3817-PP/CL/ADVT/1/2025-26, Date: 19-06-2025

ప్రజాపక్షం
శుక్రవారం, 20 జూన్

# కేంద్రానికి కాలం స్తంభించింది!

కేంద్ర ప్రభుత్వం పనితీరు, ప్రధాని నరేంద్ర మోదీ వ్యవహార శైలి చూస్తుంటే, కాలం స్తంభించిపోయిందనే అనుమానం తప్పకుండా. బహుశా, కేంద్రం దృష్టిలో మణిపూర్ రావణకాష్టం ఎప్పుడో సమసిపోయింది. దేశంలో సమస్యలన్నీ తీరిపోయాయి. గాజాపై ఇజ్రాయెల్ దాడులు జరపడం లేదు. ఇరాన్‌తో పూర్తి యుద్ధానికి కాలుదువ్వలేదు. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీని లొంగిపోవాల్సిందిగా అమెరికా హెచ్చరించలేదు. ఆయనను హతమారుస్తామని ఇజ్రాయెల్ ప్రకటించలేదు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో విందు ఇవ్వనించలేదు. వారి మధ్య కశ్మీర్ నుంచి సింధు నదీ జలాల వరకూ పలు అంశాలు చర్చకు రాలేదు. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు కీలక అంశాలపై, పాకిస్థాన్‌తో భారత్ చర్చించాల్సిన అవసరం లేనేలేదు. ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడులు చేయడంతో సమస్యలకు తెరపడింది. పాకిస్థాన్ ప్రతీకార దాడి చేయలేదు. మనకు ఎలాంటి ఆస్తి లేదా ప్రాణ నష్టం వాటిల్లలేదు. మన దేశం నుంచి దిగుమతయ్యే వస్తువులపై అమెరికా సుంకాన్ని పెంచలేదు. ఎగుమతిదారులు భారీ నష్టాలు ఎదుర్కోవడం లేదు. మహిళా రిజర్వేషన్ నుంచి కులగణన వరకూ అంతా సవ్యమే. నిజంగా కేంద్రానికి కాలం స్తంభించకపోతే, అట్టుడుకుతున్న మణిపూర్ సమస్యను ఎందుకు పరిష్కరించదు? నిరుద్యోగం నుంచి ధరల పెరుగుదల వరకూ దేశంలో నెలకొన్న సవాలక్ష సమస్యలపై ఎందుకు స్పందించదు? అన్నిటికీ మౌనమే సమాధానం ఎలా అవుతుంది? భారత్–పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ తన ఘనతేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చేస్తున్న ప్రకటనను మన ప్రధాని ప్రత్యక్షంగా ఎందుకు ఖండించడం లేదు? ఈ విషయంలో మూడవ ప్రమేయం లేదంటూ డొంకతిరుగుడు సమాధానం ఎందుకో? గాజా స్ట్రిప్‌లో జరుగుతున్న విధ్వంసంపై భారత ప్రభుత్వం ఇంతవరకూ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఒక్క ప్రకటన కూడా చేయకపోవడంలో అంతర్యం ఏమిటో? అదే ఇజ్రాయెల్ ఇప్పుడు ఇరాన్‌ను దెబ్బతీయడానికి చేస్తున్న ప్రయత్నాలను ఎందుకు ఖండించడం లేదో సర్కారే వివరించాలి. ఇజ్రాయెల్‌తో అమెరికాయే దాడులు చేయిస్తూ, అణ్వాయుధాల నిర్వీర్యమనే ముసుగు తగిలించుకుంది. ఇరాన్‌ను రెచ్చగొడుతూ, ఇరు దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధానికి తెరతీస్తున్నది. ఈ పరిస్థితులు భారత్‌సహా ఆసియా దేశాలన్నిటినీ ప్రమాదంలోకి నెట్టడం ఖాయం. కానీ, ఇజ్రాయెల్ చర్యలను ప్రధాని ఖండించకపోవడం విచిత్రం. ఇటు దేశంలో... అటు ప్రపంచంలో చోటు చేసుకుంటున్న కీలక పరిణామాలపై మోదీ మౌనం ఓ బ్రహ్మపదార్థం. పదకొండేళ్ల క్రితం ఎన్నికల సమయంలో ఏటా కోటి ఉద్యోగాల హామీ అటకెక్కింది. 370 అధికరణ రద్దు తర్వాత కశ్మీర్ ముఖచిత్రం మారిపోలేదు. రైతు సమస్యలు పెరిగాయేగాని తగ్గలేదు. హక్కుల కోసం కార్మికులు ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. నూతన జాతీయ విద్యా విధానంపై విద్యార్థిలోకం మండిపడుతున్నది. మైనారిటీ వర్గాల జీవన్మరణ పోరాటం కొనసాగుతూనే ఉంది. ఆహార ద్రవ్యోల్బణం రేటు భయపెడుతూనే ఉంది. ప్రజల కొనుగోలు శక్తి పతనమవుతూనే ఉంది. కాగితాలు... గణాంకాల్లో తప్ప ప్రజా జీవితాల్లో వాస్తవిక అభివృద్ధి జాడలేదు. కార్పొరేట్ సంస్థలు... ప్రైవేటు కంపెనీలు తప్ప, దేశంలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదు. ప్రజల కొనుగోలు శక్తి పెరగలేదు. దేశంలో అవాంఛనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుగుపొరుగు దేశాలతో శాంతి తాత్కాలిక ఊరటే తప్ప, శాశ్వత పరిష్కారం కాదు. ఇన్ని సమస్యలు ముసురుకున్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు. అత్యవసర పార్లమెంటు సమావేశాలు నిర్వహించడం లేదు. ప్రతిపక్ష పార్టీలతో చర్చించడం లేదు. ఇజ్రాయెల్ చర్యలను ఖండించడం లేదు. ఆపరేషన్ సిందూర్‌పై వివరణ ఇవ్వడం లేదు. కేంద్ర ప్రభుత్వానికి కాలం స్తంభించిపోయిందేమో!

# జూన్ డేస్ తిరుగుబాటు



కృష్ణ ఝా

అది 1840వ దశకం. సమ్మెలు, పోరాటాలతో దద్దరిల్లిన, తిరుగుబాట్లు, అల్లర్లతో కూడిన కాలం అది. వాటిల్లో అత్యంత ప్రజాదరణ పొందినది జూన్ తిరుగుబాటు. అది కేవలం నాలుగు రోజులు మాత్రమే జరిగినా, క్రూరంగా అణిచివేయబడినా, దాదాపు రెండు శతాబ్దాల తర్వాత కూడా ప్రతిధ్వనిస్తూనే ఉన్నది. అది పారిస్‌లో జరిగింది. బూర్జువా వర్గానికి, కార్మికులకు మధ్య ఉద్రిక్తతలు అక్కడ అత్యంత తీవ్రంగా ఉండేవి. 1848 ఫిబ్రవరి నాటికి, పరివర్తన మొదలై, రెండు ప్రవాహాలుగా విభజించబడిన ఒక నూతన సమాజం ఆవిర్భవించడం ప్రారంభమైంది.

వాటిలో ఒకటి మానవ అవసరాలను తీర్చే వస్తువులను ఉత్పత్తి చేయడానికి తన శ్రమ శక్తిని వెచ్చించింది. మరొకటి ముడిసరుకు, ఇంధనం లేదా గుర్రాలతో నడిచే పెద్ద, చిన్న తరహా మగ్గాలు, లేదా ఆదిమ యంత్రాలతో కూడిన ఉత్పత్తి సాధనాలను యజమాని నిర్వహించేవారు. ఆ తరువాత ఆవిరి శక్తి కనుగొనబడింది. దానిని వివిధ రకాల యంత్రాలకు వినియోగించారు. అది ఉత్పత్తి యంత్రాలు, రవాణాకు రెండింటికీ, వివిధ రకాల యంత్రాలకు విస్తరించింది. కార్మికులకు తక్కువ చెల్లించడం ద్వారా, కార్మికుడు స్వయంగా సృష్టించిన ఉత్పత్తుల ఖర్చు కంటే తక్కువ ధరకే శ్రమ శక్తిని కొనుగోలు చేయడం ద్వారా లాభం పొందారు.

ఆ రోజులు అసాధారణమైనవి. వ్యవసాయ వ్యవస్థ, అంధ భూస్వామ్య పాలనతో పాటు మొత్తం ఎగువస్థాయి నిర్మాణం కూలిపోతున్న దశ అది. రాజులు ఇక దైవాంశులు ఏమాత్రం కారు. అయితే నిర్దిష్టంగా, అంతటా వ్యాపించిన ఒక స్పష్టమైన, స్థిరమైన అంశం ఉంది. అది ఆహారం లేకపోవడంతో, అత్యధికుల్లో ఆకలి రాజ్యమేలింది. కొత్త ప్రభుత్వం విషయానికొస్తే, అది గొప్ప 1789 ఫ్రెంచ్ విప్లవ నినాదాలు, చిహ్నాలను పునరావృతం చేయడంలో సంతృప్తి చెందింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని ప్రకటిస్తూ, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసింది. వారు రాచరికాలపై సంపూర్ణంగా విశ్వాసాన్ని కోల్పోయారు.

ప్రజలు కోపం, విపరీతమైన ఆకలితో ఉన్నారు. మరొక తీవ్రమైన అంశం 'దివాలా' ఫ్రాన్స్‌ను కమ్మేసింది. పరిస్థితి అస్థిరంగా మారుతోంది. నెమ్మదిగా నూతన ఆలోచనలతో కొత్త సమాజం ఆకృతులు ద్యోతకమవుతున్నాయి. ప్రజాస్వామ్యం, ప్రాతినిధ్య ప్రభుత్వం ఆవశ్యకత పెరుగుతోంది. వ్యక్తిగత హక్కులు, సమానత్వం అనే ప్రజాస్వామ్య ఆలోచనను రూపొందించడంలో ఫ్రాన్స్ ఒక్కటే లేదు. వారు ఒక నూతన ఉషోదయం కోసం ఎదురుచూస్తున్నారు. అది పెట్టుబడిదారీ పాలన. ఇది కేవలం ఫ్రాన్స్‌తోనే కాకుండా, ఇతర దేశాలతో కూడా గుర్తింపు పొందింది. అనూహ్యంగా ఫలితాలు ఆశ్చర్యం కలిగించాయి.

నూతన యంత్రాలు, పరిపాలనకు ఒక ప్రజాస్వామ్య వ్యవస్థతో పారిశ్రామిక యుగం ప్రారంభమవుతోంది. 1830లు, 1840లలో, నగరం కార్మికవర్గం విస్తరణతో సోషలిస్ట్, కమ్యూనిస్ట్ ఆలోచనలు, సంస్థల విస్తరణ జరిగింది. ఈ సమూహాలు కార్మికవర్గ విముక్తిని సాధించడంలో ఆసక్తిని కనబరిచాయి, అంటే 1789 సంప్రదాయాలను అధిగమించి ముందుకు వెళ్ళడం. 1848 ప్రారంభంలోనే, కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ కమ్యూనిస్ట్ మేనిఫెస్టోను రాయడం ముగించిన వెంటనే యూరోపియన్ ఖండంలో వరుస విప్లవాలు మొదలయ్యాయి. అవి కమ్యూనిస్ట్ విప్లవాలు కావు. అవి పాత యూరోపియన్ నిరంకుశత్వాలకు వ్యతిరేకంగా ఉదారవాద సంస్కరణల కోసం జరిగిన విప్లవాలు.

కొలోన్‌లో జరిగిన ప్రజాస్వామ్య పోరాటంలో మార్క్స్, ఏంగెల్స్ పాల్గొనడం ద్వారా తమకు తాముగా విప్లవ ఉద్యమంలోకి ప్రవేశించారు. 1848 జూన్ 1న వారు మార్క్స్ సంపాదకత్వంలో 'న్యూయీ రైనిషె జెయ్‌తుంగ్' అనే వార్తాపత్రికను 'ఆర్గాన్ ఆఫ్ డెమోక్రసీ' అనే ఉపశీర్షికతో ప్రారంభించారు.

1848లో ఫ్రాన్స్ అధిక నిరుద్యోగంతో ఆర్థిక మాంద్యంలో ఉంది. ఫిబ్రవరి విప్లవంలో కొత్త ప్రభుత్వం 'పని హక్కు'కు ఉండాలని సాయుధ కార్మికులు డిమాండ్ చేశారు. కార్మిక వర్గం సంక్షేమానికి ప్రత్యేకించి హామీ ఇవ్వాలని కోరారు. అది అయిష్టంగానే అంగీకరించబడింది. నిరుద్యోగుల కోసం ప్రభుత్వం జాతీయ వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేసింది. కానీ ఇవి అప్పుడప్పుడు, తక్కువ వేతనంతో కూడిన పనిని అందించాయి. అది తక్కువస్థాయివి, ఒకే మాదిరిగా ఉంటున్నాయని పారిస్‌లోని నైపుణ్యం కలిగిన నిరుద్యోగ కళాకారులు వ్యతిరేకించారు.

ప్రభుత్వం జూన్ 22న జాతీయ వర్క్‌షాప్‌లను రద్దు చేసింది. వాటిలో నమోదైన కార్మికులను సైన్యంలో చేరాలని లేదా పారిస్ నుండి బయటికి వెళ్ళి ఇతర చోట్ల పనిచేయాలని ప్రభుత్వం తెలియజేసింది.

ఆ సాయంత్రం, కార్మికులు బారికేడ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. జూన్ డేస్ తిరుగుబాటు ప్రారంభమైంది. తిరుగుబాటు వార్త అందిన క్షణం నుండి, మార్క్స్, ఏంగెల్స్ విప్లవకారులకు మద్దతు ప్రకటించారు. ఇది ఒక అసాధారణమైన వైఖరి. మునుపటి విప్లవాల వెల్లువలతో పోలిస్తే, జూన్ తిరుగుబాటుకు ప్రముఖ పరిరక్షకులు/నాయకులు ఏ మాత్రం లేరు. వారి వైఖరి ఫలితంగా, 'న్యూయీ రైనిషె జెయ్‌తుంగ్' తన మిగిలిన వాటాదారులందరినీ కోల్పోయింది. మరుసటి సంవత్సరం ప్రతివిప్లవం పుంజుకోవడంతో ప్రచురణ మూసివేస్తున్నప్పుడు, మార్క్స్ చివరి సంచికను ధైర్యంగా పూర్తిగా ఎరుపు సిరాతో ముద్రించాడు. ఈ ఎరుపు పదాలు 'మా పత్రం యొక్క సారం' జూన్ తిరుగుబాటు అని ప్రకటించాయి.

పారిస్‌లో ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి మార్క్స్, ఏంగెల్స్ ఫ్రాన్స్‌లో ఉన్న తమ ఇద్దరు విలేకరుల నుండి సమాచారాన్ని పొందగలిగారు. వారు ఫ్రెంచ్ జాతీయ అసెంబ్లీలో స్టెనోగ్రాఫర్‌గా పనిచేసిన సెబాస్టియన్ సెయిలర్, గాయపడిన విప్లవకారులకు చికిత్స చేసిన డాక్టర్ హెర్మాన్ ఎవెర్‌బెక్. తాను వైద్యం అందిస్తున్న సమయంలో విప్లకారుల చెప్పిన సారాంశాన్ని పత్రికకు డాక్టర్ ఎవెర్‌బెక్ పంపేవారు.



కమ్యూనిస్ట్ మేనిఫెస్టోలో, మార్క్స్, ఏంగెల్స్ ఇలా వ్రాశారు: 'మన ప్రస్తుత సమాజంలో శ్రామికులు కింది స్థాయిలో ఉన్న వర్గం. అధికారిక సమాజంలోని మొత్తం ఉన్నత వర్గాలు గాలిలో చెల్లాచెదురు కాకుండా ఉన్నంత వరకు శ్రామికులు కదలలేరు, తమను తాము పైకి లేపలేరు.' పాత సమాజంతో పూర్తిగా సంబంధాలు తెచ్చుకోవడం కార్మికవర్గ విప్లవానికి ఎంత అవశ్యకమనేది వారు వివరించారు. ఫిబ్రవరి విప్లవంతో పోలిస్తే జూన్ డేస్ చాలా నిశ్శబ్దం గా ఉందని ఎవెర్‌బెక్ వారికి చెప్పారు. జూన్ డేస్ అనుభవం ఈ సత్యాన్ని ధృవీకరించింది. జూన్‌లో బారికేడ్ యోధులు 1789 గురించి పాటలు పాడలేదు.

మార్క్స్ ఫిబ్రవరి విప్లవాన్ని మంచి విప్లవంగా వర్ణించడానికి సమాజంలో వర్గ విభేదాలను తిరస్కరించి, వాటిని సౌభ్రాతృత్వం సార్వత్రిక వాక్పటిమతో కప్పబడడమే కారణం. ఇందుకు విరుద్ధంగా, జూన్ డేస్ అసహ్యకరమైన విప్లవం. ఎందుకంటే అది ఆ వర్గ విభేదాలను భయంకరంగా ప్రస్ఫుటం చేసింది. కొత్త ఫ్రెంచ్ ప్రభుత్వం బారికేడ్లపై కార్మికులతో యుద్ధానికి దిగింది. అది సైన్యాన్ని పిలిచింది.


జూన్ తిరుగుబాటుదారులకు వ్యతిరేకంగా ఉపయోగించిన హింసను ఏ స్థాయిలో ఉపయోగించారనేది మార్క్స్, ఏంగెల్స్ విశదీకరించారు. భయపడిన బూర్జువా వర్గం తమ అధికారాన్ని కాపాడుకోడానికి ఎంత దూరం వెళ్తుందో అది వెల్లడించింది.

1919లో విఫలమైన కార్మికుల తిరుగుబాటు తర్వాత, విప్లవకారిణి రోసా లక్సెంబర్గ్ తన హత్యకు కొన్ని గంటల ముందు తన చివరి వ్యాసం రాసారు. దానికి 'బెర్లిన్‌లో శాంతి రాజ్యమేలుతుంది (ఆర్డర్ రీన్స్ ఇన్ బెర్లిన్)' అని ఆమె పేరు పెట్టారు. అది జూన్ డేస్‌పై మార్క్స్ రాసిన వ్యాసాన్ని సూచిస్తూ 'ఫ్రెంచ్ ప్రభుత్వం, ఇతర అణచివేత పాలనల మాదిరిగానే 'శాంతిభద్రతలు(ఆర్డర్)' పేరుతో ఊచకోత కోసింద'ని గుర్తుచేశారు.

ఇదొక పాక్షిక వ్యంగ్య వ్యాఖ్య. ప్రాథమికంగా బూర్జువా సామాజిక వ్యవస్థ హింస, అణచివేతపై ఆధారపడి ఉందని మార్క్స్ తరువాత రోసా లక్సెంబర్గ్ కూడా పేర్కొన్నారు. అందుకే వారు దానిని పడగొట్టడానికి తమ జీవితాలను అంకితం చేశారు.

# ఇంజనీరింగ్ కళాశాలల దోపిడీ!

రాష్ట్రంలో మొత్తం 177 ఇంజనీరింగ్ కళాశాలలు ఉంటే, అందులో 155 ప్రైవేటువే. ఇక్కడ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారి సంఖ్య 50 వేలకి పైమాటే. వారి కష్టాలు వర్ణనాతీతం. 7వ వేతన సంఘ జీతాలు చెల్లించడం లేదు కానీ చెల్లిస్తున్నామంటూ తప్పుడు నివేదికలు తయారు చేసి గత పది ఏళ్ల నుంచి ఫీజులు పెంచుకుంటూ వస్తున్నారు. దీనితో విద్యార్థులపై పెను భారం పడుతుంది. ఇటు ఉద్యోగులకి జీతాలు రాక మానసికంగా ఆర్థికంగా బలహీన పడుతున్నారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఆలోచించి అధ్యాపకులు జీతాలు రాకున్నా పాఠాలు చెప్పడం ఆపడం లేదు. కొన్ని కాలేజీలలో 26 నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. కారణం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కావడం లేదని సాకులు. వాస్తవంగా విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.35000/– మాత్రమే. మిగతా ఫీజు విద్యార్థినే చెల్లించడం జరుగుతుంది. అయినప్పటికీ ఉద్యోగుల జీతాలు చెల్లించడం లేదు. అంతేగాక చెల్లించే జీతాలు తాత్కాలిక జీతాలు మాత్రమే అవే చెల్లించకపోతే వారి జీవనం ఎలా గడుస్తుంది? తెలంగాణ విద్యా హక్కు చట్టం 1982 చాప్టర్ 14 సెక్షన్ 84 ప్రకారం ప్రతినెలా ఒక తేదీన జీతాలు చెల్లించాలి. ఒకవేళ చెల్లించకపోతే, యజమానులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలనీ, రూ.2000/– అపరాధ రుసుము చెల్లించాలని చట్టంలో తెలియజేస్తుంది. దీనిపై ప్రభుత్వాలు తగిన విచారణ చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు. ప్రతి సంవత్సరం 700 కోట్లనుంచి 1000 కోట్ల వరకు లావాదేవీలు జరుగుతున్నాయి. అయినా దీనిపైన ప్రభుత్వం స్పందించి వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు వాపోతున్నారు.





రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి, దానిని బోర్డుకి ఫీజు రీయింబర్స్మెంట్ మళ్లించి, దానిద్వారా ప్రతి నెలా ఉద్యోగులకు జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థులకి నాణ్యమైన విద్య అందాలంటే అధ్యాపకులు ఆర్థికంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాల దోపిడీపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

అయినేని సంతోష్ కుమార్

# ఫోన్ ట్యాపింగ్ పేరు 'ఆపరేషన్ ఆర్.ఆర్'!



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఇప్పుడు యావద్దేశాన్ని కుదిపేస్తోంది.నాడు కర్ణాటకలో హెగ్డే ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ఫోన్ ట్యాపింగ్ జరిగితే,ఇక్కడ కేసీఆర్ ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడం కోసం జరిగింది.ఈ సంగతులన్నీ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు 'సిట్' ఎదుట ఇచ్చిన వాంగ్మూలాల ద్వారా తెలుస్తున్నాయి. "తుపాకీ పేల్చింది, 2023 చివరి దాకా స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ గా పని చేసిన ప్రభాకరరావు. కానీ తుపాకీ ఆయనది కాదు.అందులోని తూటాలు ఆయనవి కావు" అని సీనియర్ జర్నలిస్టు ఒకరు అన్నారు.'ఫోన్ ట్యాపింగ్' కోసం ఒక ప్రత్యేక బృందాన్ని తయారు చేసి, వారికి అన్ని హంగులు సమకూర్చిన వ్యక్తి ప్రభాకరరావు అనే ఆరోపణలున్నవి.ఆయన నల్లగొండ ఎస్పీగా ఉన్నకాలంలో బీబీనగర్ ఎస్.ఐ.గా పనిచేసిన ప్రణీత్ రావును శిష్యునిగా మలచుకున్నారు. ఈ 'ముఠా' కు ప్రధాన ఆపరేటర్‌గా ప్రణీత్ పేరు మార్మోగుతోంది. 2007 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐలలో 2022 నాటికి డిఎస్పీగా పదోన్నతి పొందిన ఏకైక వ్యక్తి ప్రణీత్ రావు. ఆయన అప్పటి కెసిఆర్ ప్రభుత్వం పట్ల ఎంత విధేయంగా ఉన్నారో, కెసిఆర్‌కు, నాటి బిఆర్ఎస్ ముఖ్యులకు ఎంతగా నమ్మిన బంటుగా మారారో ఈ ప్రమోషన్ ఘటన తెలియజేస్తున్నది.రేవంత్ రెడ్డిని రాజకీయంగా అణచివేయడానికి జరిగిన ఫోన్ ట్యాపింగ్ భాగోతానికి 'ఆపరేషన్ ఆర్.ఆర్.' అని కోడ్ పేరు పెట్టుకున్నట్టు తెలియవచ్చింది.

జనతా పార్టీ ప్రభుత్వం కర్ణాటకలో ఆనాడు నిలబడడానికి కారణం హెగ్డే. ఆయన అనుభవజ్ఞుడైన పోరాట యోధుడు. ఆయన వ్యక్తిగత ఆకర్షణ. మొదట్లో ఆయనకు ప్లేబాయ్ ఇమేజ్ ఉండేది. తర్వాత ఆయన అహంకారపూరిత శైలిని పూర్తిగా విడనాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే హెగ్డే తన కారు నుంచి సైరన్‌ను తొలగించారు. సాధారణ భారతీయ కారులో తిరగడానికి ఇష్టపడ్డాడు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప రాష్ట్ర హెలికాప్టర్‌ను ఉపయోగించేందుకు ఆయన నిరాకరించారు.ప్రజలకు తాను ఎంతగా అందుబాటులో ఉండేవాడంటే, సిఎం అయిన మొదటి కొన్ని నెలల్లో ప్రతి రోజూ కనీసం మూడు గంటలు తన కార్యాలయం వెలుపల ప్రజలను కలవడానికి, వారి మాటలను సానుభూతితో వినడానికి ఆయన కేటాయించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా పనిచేసిన కెసిఆర్‌కు సంక్రమించిన 'గ్లామర్'ఉద్యమ గ్లామర్. అదే ఆయన కు ప్రత్యేక ఆకర్షణ. కానీ సిఎం కాగానే తన 'లోపలి మనిషి' బయటకు వచ్చాడు. 'అహంకారం' ఒంటినిండా పులుముకొని పరిపాలన సాగించినట్టు ప్రజాసంఘాలు ఆరోపిస్తుంటాయి.కేసీఆర్ 'హ్యాట్రిక్' సాధించడానికి ఎన్ని దొడ్డిదారి పనులు చేశారో కానీ, ఫోన్ ట్యాపింగ్ నేరం ఆయన ప్రతిష్ఠను తీవ్రంగా దెబ్బతీస్తోంది.

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మొత్తం వెయ్యి మంది నాయకుల ఫోన్‌లు ట్యాప్ చేసినట్లు విచారణలో 'సిట్' గుర్తించింది. తెలంగాణలో 650 మంది తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు కనుగొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాయకులపై ప్రధానంగా ఫోకస్ చేసి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఏపిసిసి చీఫ్ గా ఉన్న వైఎస్ షర్మిల ఫోన్లను సైతం అప్పట్లో ట్యాప్ చేసినట్లు సిట్ విచారణలో వెలుగులోకి వచ్చింది. ఆమె ఎవరెవరితో మాట్లాడుతున్నారు,అందుకు సంబంధించిన ప్రతి అంశం నాటి ఏపి సిఎం, ఆమె సోదరుడు వైఎస్ జగన్‌కు చేరవేసినట్లు సమాచారం అందుతోంది.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాల్లో బాధితుల నుంచి సిట్ అధికారులు జూన్ 17 నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్నారు. అందులోభాగంగా టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సిట్ అధికారుల ముందు హాజరయ్యారు. ఈ ట్యాపింగ్ వల్ల తాము ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నామో ఆయన వివరించారు. మూడోసారి అధికారాన్ని అందుకోవాలని కెసిఆర్ గట్టి ప్రయత్నాలు చేసినట్టు ఫోన్ ట్యాపింగ్ ఉదంతం ఒక రుజువు. రాష్ట్రంలోని ప్రతిపక్ష నాయకులతో సహా, స్వపక్షం బిఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, రచయితలు, మేధావులు, కొందరు న్యాయమూర్తుల ఫోన్లను సైతం ట్యాప్ చేసినట్టు తెలుస్తోంది. అలాగే పక్క రాష్ట్రంలో నాయకుల ఫోన్లు కూడా 'జగన్ సూచనల మేరకు' ట్యాప్ చేసినట్టు ఒక ప్రచారం సాగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన కొద్దీ తనకు 'ప్రమాదకర ప్రత్యర్థి'గా రేవంత్ రెడ్డి అవతరించినట్టు కెసిఆర్‌కు అర్థమైంది. అందువల్ల రేవంత్ రెడ్డి ఇంటికి 200 మీటర్ల దూరంలోనే 'ట్యాపింగ్ పరికరాలను' పెట్టి సంభాషణలను ప్రణీత్ రావు బృందం రికార్డు చేసినట్టు ఏడాది కిందటే ప్రచారం జరిగింది.

అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. బిఆర్ఎస్ ప్రతిపక్షానికి పరిమితమైంది. అయితే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం గురించి రేవంత్ రెడ్డికి అదివరకే కొంత సమాచారం ఉన్నందున దాని సంగతేమిటో అంతు తేల్చాలని ఆయన నిర్ణయించారు. దర్యాప్తుకుగాను ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను నియమించారు. రేవంత్, కెసిఆర్ ఎత్తులకు పై ఎత్తులు వేసి, దూకుడుగా ప్రచారం చేసి, ఆయన కుటుంబ అవినీతి గురించి, అహంకార పూరిత పరిపాలన గురించీ బలంగా తీసుకు వెళ్లడం వలన అధికారంలోకి వచ్చారు. రేవంత్ అప్రమత్తంగా లేకపోతే కెసిఆర్, కాంగ్రెస్ నాయకులను 'పంటికి అందకుండా మింగివేసేవారు' అని రాజకీయపరిశీలకులు అంటున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగులోకి రాగానే ట్యాపింగ్‌లో కీలకంగా వ్యవహరించిన మాజీ ఐపిఎస్ అధికారి ప్రభాకర్ రావు, ఒక తెలుగు న్యూస్ ఛానల్ అధిపతి శ్రవణ్ రావు విదేశాలకు ఉడాయించారు. బృందంలోని పోలీసులు అరెస్టయి జైలుకు వెళ్లారు. కొందరు బెయిలుపై విడుదలయ్యారు. ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే తాము ట్యాపింగ్‌కు పాల్పడినట్టు సిట్ అధికారుల ఎదుట వారు స్పష్టం చేశారు. ప్రభాకర్ రావును భారత్‌కు రప్పించే ప్రయత్నం చేశారు. దాంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆగస్టు 5 వరకు ఆయనను అరెస్టు చేయరాదని సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే సిట్ విచారణకు పూర్తిగా సహకరించాలని ప్రభాకరరావును ఆదేశించింది. సిట్ అధికారుల విచారణలో ఆయన ప్రశ్నలను దాట వేస్తున్నారని పోలీసు వర్గాలంటున్నవి. అనంతరం వరుసగా జరిగిన విచారణలో ఆయన నుంచి సిట్ అధికారులు కొన్ని కీలక విషయాలను రాబట్టినట్లు తెలుస్తోంది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిజెపి ఎంపిలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, కేంద్రమంత్రి బండి సంజయ్ సహా అనేక ప్రముఖుల కదలికలు, వారి సంభాషణలన్నీ ఫోన్ ట్యాపింగ్ ముఠా సేకరించి 'పంపించవల్సిన వాళ్లకు' పంపించేవారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్,జగన్ సూత్రధారులనే ఆరోపణలు ఒకవేళ నిజమయితే వాళ్ళ విశ్వసనీయత, ప్రతిష్ట పాతాళానికి వెడతాయి. తన ఫోన్ ట్యాప్ అయినట్టుగా ఆధారాలు షర్మిల చూపించగలిగితే ఈ కేసులో పురోగతి రావచ్చు.రాజకీయ చదరంగంలో ఎవరు ఎప్పుడు ఓడిపోతారో చెప్పలేం కానీ అనైతిక చర్యలతో యుద్ధం చేయడాన్ని సమాజం ఎప్పుడూ హర్షించదు. ఆధునిక సాంకేతికతను మేళవించి కెసిఆర్, జగన్ వెన్నుపోటు రాజకీయాలను నడిపారని విమర్శలు వస్తున్నవి.

2018 నుంచి 2023 వరకూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఇందుకు తగ్గ ఆధారాలు అన్నీ ఉన్నట్లు తెలుగు దేశం పార్టీ నాయకులు చెబుతున్నారు.

కాగా రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థను కేసీఆర్ భ్రష్టు పట్టించినట్టుగా ఏ ముఖ్యమంత్రి ఇదివరకు చేయలేదు.రేవంత్ రెడ్డి,బండి సంజయ్,ఈటల,అరవింద్ సహా నా ఫోన్లు కూడా ట్యాప్ చేస్తున్నారు. ఉగ్రవాదులతో ప్రాణాలకు తెగించి పోరాడినందుకు గాను ఇచ్చే యాగ్జిలరీ ప్రమోషన్ తన బంధువు దుగ్యాల ప్రణీత్ రావుకు ఇచ్చారు.జీవో 280 ని దుర్వినియోగం చేశారు.రాజకీయ ప్రత్యర్థుల ఫోన్లు హ్యాక్ చేసినందుకు బహుమతిగా ఈ ప్రమోషన్ ఇచ్చారు'' అని అప్పట్లో బహుజన సమాజ్ పార్టీ తెలంగాణ బాధ్యునిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ చెలరేగిపోయారు.తర్వాత ఆయన మారుమనసుతో బిఆర్ఎస్ లో చేరిపోయారు.

''తన సన్నిహితులు,శ్రేయోభిలాషులు, పార్టీ నాయకులను కూడా హరీష్ రావు దూరం పెట్టేవారు. ఎవరూ తనకు ఫోన్ చేయవద్దని కూడా సూచించేవారు.తన బతుకు లాగే మీ బతుకులూ ఆగమయి పోతాయని అనేవారు. అందరి ఫోన్లు ట్యాప్ అవుతున్నాయి అని హెచ్చరించేవారు.'' అని బిఆర్ఎస్ నాయకుడు వి.ప్రకాష్ కొద్ది రోజుల కిందట ఒక యూట్యూబ్ ఛానల్ లో చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో మాజీ మంత్రి హరీశ్ రావు వంటి సీనియర్లు కూడా గజ గజ వణిపోయారంటే పరిస్థితి తీవ్రతను అంచనా వేయవచ్చు.

# శరణార్థులు కూడా సాధారణ పౌరులే

యుద్ధాలు, సంక్షోభాలు, హింసలు, పీడించడం, వాతావరణ ప్రతికూల మార్పులు, జాతి వివక్షలు, మత విద్వేషాలు, జాతీయత, కొన్ని సామాజిక లేదా రాజకీయ సంఘాల్లో సభ్యత్వాల కారణంగా ప్రాణ భయంతో మరో దేశానికి వెళ్లి శరణు కోరి ప్రాణాలు కాపాడుకునే ప్రత్యేక వ్యక్తులు లేదా సమూహాలను శరణార్థులుగా నిర్వచిస్తాం. నేరుగా మరో దేశంలో శరణార్థులుగా చేరేవారు, ఆశ్రమం పొందేవారు, అంతర్గతంగా స్థానభ్రంశం పొందినవారు, ఏ దేశానికి చెందని వారు, అనేక ఏళ్ల తర్వాత తిరిగి తమ దేశానికి చేరిన వారందరూ శరణార్థుల జాబితాలో వస్తారు.

శరణార్థులు, వారి పిల్లలు పడుతున్న అమానవీయ వేదనలను గుర్తించి ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 20 జూన్ రోజున ప్రపంచ శరణార్థి దినం (వరల్డ్ రెఫ్యూజీ డే)ను 2001 నుంచి పాటించడం జరుగుతోంది. 2025 ప్రపంచ శరణార్థి దినం ఇతివృత్తంగా 'శరణార్థులకు సంఘీభావంగా ఉందాం' అనే అంశాన్ని నిర్ణయించారు. 2025 శరణార్థివారం ఇతివృత్తంగా సూపర్ పవర్‌గా పౌర సమాజం అనే అంశాన్ని తీసుకున్నారు. శరణార్థులను కూడా సాధారణ పౌరులుగా చూడాలని, శత్రువులుగా భావించవద్దని ఐరాస సూచిస్తున్నది. శరణార్థుల పట్ల సహానుభూతి చూపడం, కనీస మానవ హక్కులను కల్పించడం, వారికి సంఘీభావంగా ప్రచారాలు నిర్వహించడం, వారి జీవిత కథలను వినడం, వారి అనుభవాలను అర్థం చేసుకోవడం, వారి పట్ల రాజకీయ ఏకీకరణ జరగడం, వారి అభ్యున్నతికి నిధులు కేటాయించడం, వారి మనోభావాలను అర్థం చేసుకోవడం లాంటివి నిత్యం కొనసాగాలి. భారత్‌లోకి శ్రీలంక, మియాన్మార్, అఫ్ఘానిస్థాన్, టిబెట్, బంగ్లాదేశ్ లాంటి ఇరుగుపొరుగు దేశాల నుంచి వేలమంది శరణార్థులు భారత భూభాగంలోకి శరణార్థులుగా చేరడం కొనసాగుతున్నది.

ప్రపంచ శరణార్థి దినం వేదికగా నిజమైన శరణార్థులను గుర్తించి వారికి కనీస వసతులను కల్పించడం, దురుద్దేశంతో భారత్‌లోకి చేరిన శరణార్థులను ఏరిపారేయడం నిరంతరం జరగాలి.

# పెళ్లి, విడాకుల్లో సంక్లిష్టతలు.. అందుకే జీవితభాగస్వాముల హత్యలు

మేఘాలయ 'హనీమూన్ మర్డర్' కేసు ఇటీవల సంచలనం సృష్టించింది. ఇండోర్‌కు చెందిన సోనమ్, రఘువంశీల వివాహం జరగ్గా.. ఆ పెండ్లి ఇష్టం లేకపోవడంతో ప్రియుడితో కలిసి సోనమ్ భర్తను హత్య చేసేందుకు సుపారీ ఇచ్చినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మీరట్‌లో సౌరభ్ రాజ్‌పుత్ అనే వ్యక్తిని అతని భార్య ముస్కాన్ రాస్తోగి, ఆమె ప్రియుడు సహిల్ శుక్లా హత్యచేసి, శవాన్ని సిమెంట్ డ్రమ్‌లో దాచారు. కర్ణాటకలో ఒక మాజీ డిజిపిని ఆమె భార్య కత్తితో పొడిచి హత్య చేసింది. యుపి, ఢిల్లీ, బిహార్ ఇలా చాలా రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఘటనలు తరచూ వినిపిస్తూనే ఉన్నాయి. భార్యలను హత్య చేస్తున్న ఘటనలు దేశంలో నిత్యకృత్యంగానే మారుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో జీవితభాగస్వాముల మధ్య హత్యలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. అయితే ఇందులో 95 శాతానికి పైగా కేసుల్లో ఎవరికీ క్రిమినల్ రికార్డులు లేవు. 'పెళ్లి–విడాకులు' అనే రెండు అంశాలపై సామాజికంగా వస్తున్న ఒత్తిళ్లు సామాన్య పౌరులను సైతం నేరస్తులుగా మారుస్తున్నాయి. చిన్న సొల్యూషన్ తో పరిష్కారమయ్యే సమస్యలు కూడా హత్యల వరకు దారితీస్తున్నాయి.

**ఇష్టం లేకున్నా వివాహబంధంలోకి..** భారత్‌లో 85 నుంచి 90 శాతం అరేంజ్డ్ మ్యారేజెస్ జరుగుతున్నాయి. అందులో అబ్బాయి, అమ్మాయిల సమ్మతి తీసుకోకుండానే ఒత్తిడితో చేసిన వివాహాలే అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది. భారత సమాజంలో వివాహ బంధం అనే ది ఇద్దరు వ్యక్తుల మధ్య కంటే.. కుటుంబాల మధ్య ఒప్పందంగా భావిస్తారు. కులం, మతం, ఆర్థిక స్థితి, సామాజిక స్థాయిని బట్టి జీవిత భాగస్వాములను ఎంపిక చేస్తారు. ఎక్కువ శాతం పెళ్లిళ్లలో జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ సంబంధిత వ్యక్తికి ఇవ్వరు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా కుటుంబంపై ఆధారపడి ఉండడంతో వారికి నిర్ణయం తీసుకునే ఫ్రీడమ్ తక్కువగా ఉంటున్నది. మహిళలు గృహ హింసకు గురవుతున్న సందర్భాలు అనేకం. విడాకులు తీసుకోవడం తీవ్ర కష్టతరం కావడం, ఆ వివాహ బంధం నుంచి బయటపడలేక ఆందోళనకు గురవుతున్నారు. ఆ వివాహ బంధం నుంచి ఎలాగైనా బయటపడాలనే ఆతృతతో కొన్నిసార్లు కఠిన నిర్ణయాలు తీసుకొని నేరస్తులుగా మిగిలిపోతున్నారు. విడాకుల ప్రక్రియ సుదీర్ఘమైనది, ఖర్చుతో కూడుకున్నది కావడంతో.. ఈ జాప్యం వివాదాల ను తీవ్రతరంచేసి హత్యల వరకు తీసుకెళ్తున్నదనే అభిప్రాయం ఉంది.

**ఇలా చేస్తే మంచిది..** సమాజంలో మార్పువస్తేనే ఈ హత్యల నివారణ సాధ్యమవుతుంది. వివాహ బంధం నుంచి బయటకు వెళ్లిపోయినా.. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా పథకాలను అమలు చేయాలి. పెళ్లి చేయడానికి అయ్యే ఖర్చును భారీగా తగ్గించాలి. విడాకులను ఒక వైఫల్యంగా చూడడం కంటే.. ఒక వ్యక్తి స్వాతంత్ర్యం, ఆరోగ్యకరమైన జీవితానికి అవసరమైన ఎంపికగా సమాజంలో ప్రచారం చేయాలి.

ఫిరోజ్ ఖాన్, 9640466464

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఆసుపత్రి నుంచి సోనియాగాంధీ డిశ్చార్జి




**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఉదర సమస్యలతో బాధపడుతున్న ఆమె ఈనెల 15న ఢిల్లీలోని సర్ గంగారాం ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. నాలుగు రోజులుగా చికిత్స పొందిన సోనియా గాంధీ ఆరోగ్యం మెరుగుపడటంతో గురువారం డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం సోనియా ఆరోగ్యం నిలకడగా ఉందని, డిశ్చార్జ్ చేసినట్లు ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు. కాగా, ఉదర సంబంధిత సమస్యలతో సోనియా గాంధీ ఆదివారం రాత్రి ఢిల్లీలోని ఆసుపత్రిలో చేరారు. ఈ నెల 9వ తేదీన ఇదే ఆసుపత్రిలో సోనియా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న సోనియా గాంధీకి వైద్యులు చికిత్స అందించారు.

## మునీర్‌కు ట్రంప్ ఆహ్వానం

# భారత దౌత్యానికి పెద్ద దెబ్బ

### కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపాటు



**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను భోజనానికి అహ్వానించడంతో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపడింది. ఇది భారత దౌత్యానికి పెద్ద దెబ్బ అని పేర్కొంది. ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ పాకిస్థాన్ దేశాధినేత లేదా ప్రభుత్వ అధిపతి కాదని, ఆర్మీ స్టాఫ్ చీఫ్ అయినప్పటికీ ట్రంప్ ఆయనను భోజనానికి ఆహ్వానించి ఆయనను ప్రశంసించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. ఇది భారత దౌత్యానికి పెద్ద దెబ్బ అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని విమర్శించారు. ఈ పరిణామంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న హగ్‌లోమసీకి కూడా పెను విఘాతం కలిగిందని ఎద్దేవా చేసింది. ట్రంప్ సహా ప్రపంచ దేశాల అధినేతలను ఆత్మీయ ఆలింగనాలు చేసుకోవడం ద్వారా ప్రధాని మోదీ హగ్‌లోమసీని చేస్తున్నారని చాలా ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ విమర్శిస్తోంది. కాగా, భారత్, పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు నేతలూ తెలివైన వారని, ఘర్షణ మొదలైన మొదటిసారే అణ్వాయుధంగా మారే యుద్ధాన్ని కొనసాగించకూడదని నిర్ణయించుకున్నారని, రెండు పొరుగు దేశాల మధ్య శత్రుత్వాన్ని ఆపినందుకు తాను క్రెడిట్ పొందలేదని ట్రంప్ అన్నారు. బుధవారం వైట్ హౌస్‌లో మునీర్‌కు ఆతిథ్యం ఇచ్చిన తర్వాత ఓవల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మునీర్‌ను కలవడం తనకు గౌరవంగా ఉందని ట్రంప్ అన్నారు. కాగా, ప్రధాని మోదీతో మాట్లాడిన కొన్ని గంటల తర్వాత, మునీర్‌ను కలవడానికి ముందు, భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని ఆపానని ట్రంప్ తన పదే పదే వాదనను పునరావృతం చేయడంతో, మోదీ 'ప్రజా ప్రచార యంత్రాంగం' సృష్టించిన హైప్‌ను ఆయన తగ్గించారని, అమెరికన్ నాయకుడు చేసిన వాదనలను ప్రధానమంత్రి బహిరంగంగా ఖండించాలని కాంగ్రెస్ పేర్కొంది. ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రిత్వ శాఖ మాటలు ఇప్పుడు చాలా బలహీనంగా ఉన్నాయా, వారు అమెరికా అధ్యక్షుడితో అరగంట పాటు ఫోన్‌లో జరిపిన సంభాషణల్లో భారత వైఖరిని కూడా స్పష్టంగా ప్రదర్శించలేకపోతున్నారా అని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం హెడ్ పవన్ ఖేరా నిలదీశారు. ఎక్స్‌లో ఖేరా ట్రంప్ మాటలను ఉటంకిస్తూ 'నేను యుద్ధాన్ని ఆపాను. నేను బుధవారం రాత్రి ప్రధాన మంత్రి మోదీతో మాట్లాడాను. మేము త్వరలో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయబోతున్నాము' అని చెప్పారు.

## విమాన ప్రమాదంపై

# భిన్న విభాగాల నిపుణుల బృందం దర్యాప్తు

### బ్లాక్ బాక్స్ డీ–కోడింగ్‌పై ఎఎఐబిదే నిర్ణయం

### పౌరవిమానయాన మంత్రిత్వశాఖ ప్రకటన

**అహ్మదాబాద్ :** ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం జరిగిన వారంరోజుల తర్వాత బ్లాక్ బాక్స్ డీ–కోడింగ్ పైనే అధికారులంతా దృష్టి సారించారు. ఈ రెండు బ్లాక్ బాక్స్‌లలో ఉన్న సమాచారాన్ని తెలుసుకోవడానికి ఏ విధంగా, ఎలా డీ–కోడ్ చేయాలి, ఎక్కడకు తీసుకువెళ్ళి డీ–కోడింగ్ చేయాలి అనే విషయంపై దర్యాప్తు అధికారులు ఒక నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వం ప్రకటించింది. ''విమాన ప్రమాద ఘటనాస్థలంలో దొరికిన బోయింగ్‌కు చెందిన సివిఆర్–డిఎఫ్‌డిఆర్ (బ్లాక్‌బాక్స్)లను డీ–కోడింగ్ చేసేందుకు, విశ్లేషణ చేసేందుకు విదేశాలకు తరలిస్తున్నారని కొన్ని పత్రికల్లో మీడియాలో వార్తలు వెలువడ్డాయి, ఐతే సాంకేతికపరమైన, భద్రతకు సంబంధించిన పరిశీలనలు, విశ్లేషణలు చేసిన తర్వాత ఫ్లయిట్ రికార్డులను ఎక్కడకు తీసుకువెళ్ళి డీ–కోడింగ్ చెయ్యాలి, ఎలా విశ్లేషణ చేయాలి అనే విషయంపై ఎఎఐబి (ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో) ఒక నిర్ణయం తీసుకుంటుంది'' అని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ గురువారం ఒక ప్రకటనలో తెలియజేసింది. స్థానిక అధికారులు, ఏజన్సీల సహాయంతో అన్నివిధాలుగా సమాచారాన్ని సేకరిస్తూ, విమానం కూలిపోవడానికి గల ప్రధాన కారణాలు కనిపెట్టే దిశగా దర్యాప్తు అధికారులు పురోగతి సాధిస్తున్నారని మంత్రిత్వశాఖ పేర్కొంది. ప్రమాదం జరిగిన ప్రదేశం చుట్టుపక్కల ఉన్న సమాచారాన్ని, ఆ పూర్తి వివరాలను పత్రాలలో పొందుపరచి సాక్ష్యాలను సేకరించే ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేశారు. గుజరాత్ ప్రభుత్వం కూడా ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ దర్యాప్తులో తమకు ఎలాంటి సంబంధం లేదని, కేంద్ర అధికారులు కోరిన విధంగా తగిన సహాయాన్ని మాత్రమే అందిస్తున్నామని తెలియజేసింది. ప్రమాదం జరిగిన తర్వాత విమానం తోకభాగం మెడికల్ హాస్టల్ భవనం పైభాగంలో ఇరుక్కుపోయిందని, దీనివల్ల క్యాంటిన్ భవనం ధ్వంసమైందని, తర్వాత రెండు రోజులకు జూన్ 14వ తేదీన ఈ తోక భాగాన్ని క్రేన్ల సహాయంతో నేలమీదకు దించామని ఖాడియా చెప్పారు. ఈ విధమైన అంతర్జాతీయస్థాయి ప్రయాణ విమానానికి రెండు బ్లాక్ బాక్సులు ఉంటాయి. విమాన ప్రమాదం జరిగిన మరునాడు జూన్ 13న ఘటనాస్థలం నుండి కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సివిఆర్), డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్ (డిఎఫ్‌డిఆర్) కు చెందిన ఉమ్మడి యూనిట్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జూన్ 16న రెండో జతను కూడా స్వాధీనం చేసుకున్నారు. జూన్ 12వ తేదీ మధ్యాహ్నం అహ్మదాబాద్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి లండన్‌కు బయలుదేరిన బోయింగ్ 787–8 డ్రీమ్ లైనర్‌లో 242 మంది ప్రయాణికులు ఉన్నారు. బయలుదేరిన తర్వాత 1.5 కి.మీ ప్రయాణించిన విమానం సెకన్ల వ్యవధిలోనే సమీపంలోని ఒక మెడికల్ హాస్టల్‌పై కూలిపోయింది. ఇప్పటివరకూ డిఎన్ఎ టెస్టుల ద్వారా 215 మంది మృతుల మృతదేహాలను గుర్తించినట్లు అధికారులు చెప్పారు. మృతదేహాలు గుర్తుపట్టడానికి కూడా వీలులేనంతగా మాడిపోయాయి. మృతుల్లో 149 మంది దేహాలను భారతీయ కుటుంబాలకు స్వాధీనం చేశారు. 32 మంది బ్రిటన్ పౌరుల మృతదేహాలను, ఏడుగురు పోర్చుగల జాతీయుల మృతదేహాలను, ఒక కెనడా వాసి మృతదేహాన్ని వారికి అప్పగించారు. ఏడు మృతదేహాలకు చెందిన అవశేషాలను కూడా వారి వారి బంధువులకు స్వాధీనం చేశారు.

## పార్టీలో కొంతమందితో భేదాభిప్రాయాలు

### కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు శశిథరూర్



**తిరువనంతపురం :** కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని కొంతమందితో తనకు అభిప్రాయ భేదాలు ఉన్నాయ ని ఆ పార్టీ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సభ్యుడు శశి థరూర్ పేర్కొన్నారు. అయితే కేరళలోని నిలంబూర్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నిక దృష్ట్యా తాను వాటి గురించి మాట్లాడబోనన్నారు. గురవారం ఆయన తిరువంతపురంలో మీడియాతో మాట్లాడారు. కాం గ్రెస్, దాని విలువలు, పార్టీ కార్యకర్తలు తనకు చాలా ప్రియమైనవారని థరూర్ అన్నారు. తాను 16 సంవత్సరాలుగా పార్టీ కార్యకర్తలతో సన్నిహితంగా పనిచేశానని, వారిని సన్నిహిత స్నేహితులు, సోదరులుగా చూస్తున్నానని చెప్పారు. 'నేను ఏమి మాట్లాడుతున్నానో మీకు తెలుసు, ఎందుకంటే అందులో ఉన్న కొన్ని ప్రజాక్షేత్రంలో ఉన్నాయి' అని థరూర్ అన్నారు. అయితే తనకు అభిప్రాయ భేదాలు జాతీయ లేదా రాష్ట్ర నాయకత్వంతో ఉన్నాయా అని ఆయన స్పష్టం చేయలేదు. ఉప ఎన్నిక ఫలితాల తర్వాత ఆ విభేదాల గురించి మాట్లాడవచ్చని తిరువనంతపురం ఎంపి సూచించారు. ఉప ఎన్నిక ప్రచారంలో ఎందుకు పాల్గొనలేదని అడిగినప్పుడు, గత సంవత్సరం జరిగిన వయనాడ్ ఉప ఎన్నికలతో సహా ఇతర ఉప ఎన్నికల్లాగానే తనను ఆహ్వానించలేదని థరూర్ అన్నారు. ఆహ్వానించబడని చోటికి వెళ్ళనన్నారు. పార్టీ కార్యకర్తల ప్రచార ప్రయత్నాలు ఫలించాలని, నిలంబూర్ నుండి యుడిఎఫ్ అభ్యర్థి గెలవాలని కోరుకుంటున్నానన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఇటీవల జరిగిన చర్చల గురించి మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి వివిధ దేశాలకు ప్రతినిధి బృందాల పర్యటనలు, అక్కడ జరిగిన చర్చల గురించి జరిగాయన్నాయని థరూర్ అన్నారు. ఏ దేశీయ రాజకీయాల గురించి చర్చించలేదని చెప్పారు. ప్రతినిధులలో ఒకదానికి నాయకత్వం వహించడానికి కేంద్రం ఆహ్వానాన్ని అంగీకరించాలనే తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ, పార్లమెంటు విదేశాంగ కమిటీ చైర్మన్ అయినప్పుడు, తాను కాంగ్రెస్, బిజెపి విదేశాంగ విధానంపై కాకుండా భారతదేశ విదేశాంగ విధానం, దాని జాతీయ ప్రయోజనాలపై దృష్టి సారించానని స్పష్టం చేశానని అన్నారు. 'నేను నా పంథాను మార్చుకోలేదు. దేశానికి సంబంధించిన సమస్య వచ్చినప్పుడు, మనమందరం దేశం కోసం పని చేయడానికి, మాట్లాడటానికి బాధ్యత వహిస్తాము. ఆపరేషన్ సిందూర్ సమయంలో నేను చెప్పింది నా సొంత అభిప్రాయం. 'కేంద్రం నా సేవలను కోరింది. నిజానికి, నా పార్టీ అడగలేదు. కాబట్టి, నేను భారత పౌరుడిగా నా విధిని గర్వంగా నిర్వర్తించాను' అని ఆయన అన్నారు.

## క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో...

# ఐఐటి ఢిల్లీకి అత్యుత్తమ ర్యాంకు

### దేశంలోని 54 విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలకు రికార్డు స్థాయిలో జాబితాలో చోటు





**న్యూఢిల్లీ :** ప్రఖ్యాత క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో ఐఐడి ఢిల్లీ అత్యుత్తమ ర్యాంక్ పొందిన భారతీయ సంస్థగా నిలిచింది. దేశంలోని 54 విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలు రికార్డు స్థాయిలో ఈసారి క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలను వివిధ అంశాలవారీగా అంచనా వేసి క్యూఎస్ ర్యాంకింగ్స్ 2026 విడుదల చేస్తారు. ఐఐటి ఢిల్లీ గత రెండేళ్ల వరుసగా 197, 150 వ స్థానంలో నిలిచింది. ఈసారి ర్యాంకింగ్స్‌లో 70 స్థానాలు మెరుగుపరుచుకుని 123వ స్థానంలో ఉంది. ఉద్యోగ కల్పనలో (50వ స్థానం), సైటేషన్స్ (86వ ప్లేస్), సస్టైనబిలిటీ (172వ స్థానం), అకడమిక్ రెప్యుటేషన్ (142వ ప్లేస్)లో ఉంది. దీంతో ర్యాంకింగ్స్‌లో మెరుగుపడింది. అమెరికాకు చెందిన జార్జియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కలిసి ఐఐటి ఢిల్లీ 123వ ర్యాంక్‌ను సంయుక్తంగా పంచుకుంది.

**దిగజారిన ఐఐటి బాంబే ర్యాంకు...** క్యూఎస్ ర్యాంకింగ్స్ 2025లో 118వ ర్యాంక్‌తో రాణించిన ఐఐటి బాంబే ఈసారి కాస్త వెనుకపడింది. 129వ స్థానానికి పడిపోయింది. అయినప్పటికీ అది ప్రపంచంలో టాప్ 130లో కొనసాగుతోంది. ఉద్యోగాల కల్పనలో 39వ స్థానంలో ఉంది. అమెరికాకు చెందిన 192, యుకెకు చెందిన 90, చైనాలోని 72 సంస్థలు, భారత్‌కు చెందిన 54 ఉన్నత విద్యాసంస్థలు క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో చోటు సంపాదించుకున్నాయి. క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో భారత యూనివర్సిటీలు నాలుగో స్థానంలో నిలిచాయి.

**ర్యాంకింగ్స్ చోటు దక్కించుకున్న 8 కొత్త యూనివర్సిటీలు...** దేశంలోని 11 ప్రభుత్వ, ఆరు ప్రైవేట్ యూనివర్సిటీలు ఈ ఏడాది తమ స్థానాలను మెరుగుపరుచుకున్నాయి. ఐఐటి మద్రాస్ 47 స్థానాలు మెరుగుపరుచుకుని మొదటిసారిగా టాప్ 200లోకి ప్రవేశించింది. ప్రస్తుతం 180వ స్థానంలో నిలిచింది. షూలిని యూనివర్సిటీ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ (503వ స్థానం), చండీగఢ్ యూనివర్సిటీ (575వ స్థానం), బిర్లా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ 668వ స్థానంలో ఉంది. ఈసారి క్యూఎస్ ర్యాంకింగ్స్ జాబితాలో ఎనిమిది భారతీయ విద్యాసంస్థలు కొత్తగా ప్రవేశించాయి. ఏ ఇతర దేశం నుంచి కూడా ఇన్ని కొత్త సంస్థలు ఈ జాబితాలో చేరకపోవడం గమనార్హం. 'భారతదేశం ప్రపంచ ఉన్నత విద్యా పటాన్ని తిరిగి రాస్తోంది. ఈ ఎడిషన్‌లో క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో మరే దేశంలోనూ ఇన్ని కొత్త యూనివర్సిటీలు చోటు దక్కించుకోలేదు. ఇది వేగంగా అభివృద్ధి చెందుతున్న విద్యా వ్యవస్థకు స్పష్టమైన సంకేతం. మేము భారత్‌లోని విశ్వవిద్యాలయాల స్పష్టమైన పురోగతిని చూస్తున్నాం. భారతీయ విశ్వవిద్యాలయాలు తమ ప్రపంచ పరిశోధన పాదముద్రను బలోపేతం చేస్తున్నాయి. ఫ్యాకల్టీ, స్థిరత్వం, అంతర్జాతీయ పరిశోధన అంశాల వంటి రంగాల్లో ముందుకు సాగుతున్నాయి. కేవలం ఒక దశాబ్దంలో భారత్‌లోని యూనివర్సిటీలు క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో 11 నుంచి 54కి పెరిగాయి. ఇది 390శాతం పెరుగుదల.'అని క్యూఎస్ సీఈఓ జెస్సికా టర్నర్ తెలిపారు.

**ప్రధాని మోదీ హర్షం...** భారత్‌కు చెందిన 54 విశ్వవిద్యాలయాలు క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకోవడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ 2026 ర్యాంకింగ్స్ మన విద్యా రంగానికే గొప్ప శుభవార్త అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. యువత ప్రయోజనం కోసం పరిశోధన, ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థలను మరింత పెంపొందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

## 'థగ్ లైఫ్' విడుదల చేయాల్సిందే.. కర్ణాటకకు సుప్రీంకోర్టు ఆదేశాలు


**న్యూఢిల్లీ :** కమల్‌హాసన్ నటించిన థగ్ లైఫ్ సినిమాను కర్నాటకలో రిలీజ్ చేయాల్సిందే అని, అది ప్రభుత్వ బాధ్యత అని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఫిల్మ్‌ను రిలీజ్ చేయాల్సిన బాధ్యత రాష్ట్రానిదే అని కోర్టు చెప్పింది. సినిమా రిలీజ్‌ను అడ్డుకుంటామని బెదిరిస్తున్న వారిని నియంత్రించాలని, దీనిపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సుప్రీంకోర్టు తెలిపింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది.తమిళం నుంచే కన్నడ భాష పుట్టినట్లు ఫిల్మ్ స్టార్ కమల్‌హాసన్ ఇటీవల వ్యాఖ్యలు చేయడంతో వివాదం మొదలైంది. దీంతో అతను నటించిన థగ్‌లైఫ్ సినిమాను కర్నాటకలో రిలీజ్ చేయకుండా అడ్డుకున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ కమల్‌హాసన్ కోర్టును ఆశ్రయించారు. సుప్రీం చివాట్లతో దిగివచ్చిన కర్నాటక ప్రభుత్వం నిరసనకారులపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పింది. సినిమా రిలీజ్‌ను అడ్డుకుంటున్నవారికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఒకవేళ ఎవరైనా సినిమాను అడ్డుకుంటే వారిపై కర్నాటక సర్కారు తీవ్ర చర్యలు తీసుకుంటుందని సుప్రీం తెలిపింది. జూన్ 5వ తేదీన థగ్‌లైఫ్ సినిమా రిలీజ్ కావాల్సి ఉంది. కానీ వివాదం వల్ల కర్నాటకలో ఆ ఫిల్మ్‌ను బ్యాన్ చేశారు.

## హత్యకు గురైన మాజీమంత్రి నివాసాల్లో ఐటి సోదాలు

**భువనేశ్వర్:** క్రిస్టియన్ మైఖెల్‌ను 2023లో హత్యకు గురైన ఒడిశా మాజీ మంత్రి , సీనియర్ బీజేపీ నేత నబా కిశోర్ దాస్‌కు సంబంధించిన అక్రమార్జన కేసులో ఇవాళ ఆదాయం పన్ను శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. సుమారు 20 ప్రదేశాల్లో ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. గురువారం ఉదయం ఐటీ సెర్చ్ ఆపరేషన్ మొదలైంది. జార్సుగూడ, సంబల్‌పూర్, న్యూఢిల్లీల్లో ఉన్న దివంగత మాజీ మంత్రి నివాసాలతో పాటు బంధువులు, అనుబంధ వ్యాపారవేత్తల ఇండ్లల్లోనూ ఐటీ శాఖ తనిఖీలు నిర్వహిస్తున్నది. భువనేశ్వర్‌లో ఉన్న మాజీ మంత్రి ఇళ్లు మాత్రం ప్రస్తుతం మూసివేశారు. నబా కిశోర్ దాస్‌తో లింకున్న హోటల్ నికీ, ఇతర ప్రాపర్టీలపై కూడా ఐటీ సెర్చ్ జరుగుతోంది. పన్ను ఎగవేతతో పాటు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ప్రస్తుతం తనిఖీలు జరుగుతున్నాయి. సుమారు 180 మంది ఐటీ ఆఫీసర్లు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. సుమారు 40 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది, 60 వాహనాలు, సైంటిఫిక్ అనాలిస్ బృందం కూడా వారితో ఉన్నాయి.

# రాహుల్‌కు కొత్త చిరునామా

### ఢిల్లీ సునేహ్రీబాగ్ రోడ్డులోని బంగ్లా నంబర్ 5కి మారనున్న ప్రతిపక్షనేత



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ త్వరలోనే కొత్త నివాసానికి మారబోతున్నారు. ఢిల్లీలోని సునేహ్రీబాగ్ రోడ్డులోని బంగ్లా నంబర్ 5 ఇకపై ఆయన కొత్త చిరునామాగా మారనుంది. గురువారం తన పుట్టిన రోజు సందర్భంగా సామాన్ల తరలింపు ప్రక్రియ మొదలైనట్లు సమాచారం. జులై 21నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే ఆయన ఈ బంగ్లాకు మారతారని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. తన అధికారిక నివాసంగా ఈబంగ్లాను రాహుల్‌గాంధీ అంగీకరించినట్లు సదరు వర్గాలు తెలిపాయి. రాహుల్‌కు బంగ్లాను ఆఫర్ చేసినప్పటికీ.. ఆయన ప్రతిస్పందన కోసం ఎదురుచూస్తున్నట్లు గతేడాది పార్లమెంటు వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, రాహుల్ ఎంపి అయినప్పటి నుంచి ఆయన 12, తుగ్లక్‌లేన్‌లో నివసించేవారు. అయితే, పరువునష్టం కేసులో దోషిగా తేలడంతో 2023లో లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించడంతో ఆయన ఆఇంటిని ఖాళీ చేయాల్సి వచ్చింది. అప్పటినుంచి రాహుల్ తనతల్లి సోనియాగాంధీతో కలిసి 10 జనపథ్‌లోనే నివసిస్తున్న విషయం తెలిసిందే. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నిక కావడంతో ఆయనకు క్యాబినెట్ మంత్రి హోదా దక్కడంతో టైప్ 8 బంగ్లాకు అర్హులయ్యారు. గతంలో సునేహ్రీబాగ్ నివాసంలో కర్ణాటక బిజెపి నేత ఎ. నారాయణస్వామి ఉన్నారు. ఆయన 2021–24 మధ్య కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు.

## ఎంపిలో డివైడర్‌ను ఢీకొని నలుగురు మృతి



**రాజ్‌గఢ్ :** మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో గురువారం ఉదయం ఎస్‌యువి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టడంతో 11ఏళ్ల బాలుడు సహా నలుగురు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని గోండా నుండి గుజరాత్‌లోని సూరత్‌కు ఒక కుటుంబం వెళుతుండగా ఉదయం ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని కర్వాన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ జాట్ తెలిపారు. దాదాపు 18 గంటలు డ్రైవింగ్ చేసిన తర్వాత అలసట కారణంగా నిద్రపోయానని, వాహనంపై నియంత్రణ కోల్పోయానని డ్రైవింగ్ చేస్తున్న భోలేనాథ్ దుబే (40) పోలీసులకు చెప్పాడని అధికారి తెలిపారు. సీటు బెల్ట్ పెట్టుకుని, ఎయిర్‌బ్యాగ్ సకాలంలో అమర్చడంతో దుబే స్వల్ప గాయాలతో బయటపడ్డాడని ఇన్‌స్పెక్టర్ జాట్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ప్రాంతంలో ఏడుగురు సభ్యులతో కూడిన కుటుంబం గోండా నుండి బయలుదేరి టీ, స్నాక్స్ కోసం కొద్దిసేపు మాత్రమే విరామం తీసుకున్నారన్నారు. అన్మోల్ దూబే (16), ప్రియాంషు పాండే (11) అక్కడికక్కడే మరణించగా, ప్రమీలా పాండే (55), శివ దేవి తివారీ (45) షాజాపూర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అరవింద్ సింగ్ తెలిపారు. పుష్పం దూబే (50), అన్షికా దూబే (14) చికిత్స పొందుతున్నారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని సింగ్ తెలిపారు

# ఇంగ్లీష్ మాట్లాడే వారు.. సిగ్గు పడే రోజులొస్తాయ్

### కేంద్రమంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ :** దేశంలో ఇంగ్లీష్ భాష మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని కేంద్రమంత్రి అమిత్‌షా అన్నారు. దేశ ఐక్యతలో భారతీయ భాషలు ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఐఎఎస్ ఆఫీసర్ ఆశుతష్ అగ్నిహోత్రి రాసిన మై బూంద్ స్వయం.. కుద్ సాగర్ హు అన్న పుస్తకాన్ని గురువారం మంత్రి రిలీజ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. భారతీయ భాషల వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన సందర్భంగా వచ్చిందన్నారు. మాతృ భాషలపై గర్వంతో ప్రపంచంలో ముందుకు వెళ్లాలన్నారు. ఈ దేశంలో.. త్వరలో ఇంగ్లీష్ మాట్లాడే ప్రజలు సిగ్గుపడే సందర్భం వస్తుందని, అలాంటి సమాజ ఏర్పాటు ఎంతో దూరం లేదని, పట్టుదలతో మార్పును కోరుకునేవారితో అది సాధ్యం అవుతుందని, మన దేశంలోని భాషలు.. మన సంస్కృతికి రత్నాలని నమ్ముతున్నట్లు చెప్పారు. మన భాషలు లేకుండా మనం ఈ దేశవాసులం కాబోమన్నారు. ఈ దేశాన్ని, సంస్కృతిని, చరిత్రను, మతాన్ని అర్థం చేసుకోవడనానికి ఏ విదేశీ భాష సరిపోదు అని, అసమగ్రమైన విదేశీ భాషలతో సమగ్రమైన దేశభావన రాదు అని, ఇది చాలా సంక్లిష్టమైన అంశమని, కానీ భారతీయ సమాజం దీంట్లో విజయం సాధిస్తుందని ఆశిస్తున్నానని, మరోసారి మన దేశాన్ని మన స్వంత భాషల్లో ముందుకు నడిపిస్తామని అనుకుంటున్నట్లు చెప్పారు.

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 897 OF 2024**

Between:-

**M/s. Kalpakam Chit Funds Pvt Ltd., Hanamkonda Branch, rep. By it's Foremen,**

.....**Disputant**

VERSUS

**P.UGENDER & OTHERS**

......**Opponents**

1. Sri. Palapu Ugender, S/o, Narsaiah, Age: 40Yrs, Occ: Contractor works R/o: H.No: 30-2-42, Rottabanda, Madikonda, Hanamkonda.
2. Sri. Gandam Sambaraju, S/o, Chandraiah, Age: 44 Yrs, Occu: Track Mntrs/RLY/KZPT, R/o: H.No: 2-25/11, Station Ghanpur, Jangaon.
3. Sri. Malothu Narsinga Rao, S/o, Shankaraiah, Age: 49 Yrs, Occu: Sr.Tech-Locoshed-kazipet, R/o: H.No: 2-31, Station Ghanpur, Jangaon.
4. Sri. Kandala Yugandhar, S/o, Niranjan, Age: 54 yrs, Occu: Sr. Asst. MPP-Nekkonda, R/o: H.No: 3-14-13/4/1, Yadavnagar, Hanamkonda.
5. Sri. Bochu Prasadarao, S/o, Saraiah, Age: 49 yrs, Occu:Teacher-Govt.High School, Kothhur, R/o: H.No: 2-1-761, Lashkar Singaram, Naimnagar, Hanamkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.07.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 898 OF 2024**

Between:-

**M/s. Hasini Chit Funds Pvt Ltd., Hanamkonda Branch, Rep. By it's Foreman,**

.....**Disputant**

VERSUS

**K.SRINIVAS & OTHERS**

......**Opponents**

1. Sri.Konda Srinivas, S/o, Venkataiah, Age:52 Yrs, Occu:Ward Boy Govt. T.B.Hospital, R/o:H.No:2-11-56,Hanmantharaonagar, Bhimaram, Warangal.
2. Sri.Kumari Nagaraju, S/o.Ramaswamy, Age:48 Yrs, Occ:Lab Technician Govt. T.B.Hospital R/o: H.No: 15-4-73,Pothananagar,Near Substation,Warangal.
3. Sri.Sambaraju Ravinder, S/o,Ilaiah, Age: 55 Yrs, Occu: Lab Attendant Govt. T.B. Hospital, R/o: H.No. 6-7-124, Raghanna Dharwaja, chowratha, Hanamkonda.
4. Sri. Muthyala Ravikumar, S/o, Veeraswamy, Age: 47 Yrs, Occu: Driver Govt.T.B. Hospital, R/o: H.No: 5-38/8, Enumamula Road, Near Petrol Bunk, Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.07.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 899 OF 2024**

Between:-

**M/s. Hasini Chit Funds Pvt Ltd., Hanamkonda Branch, Rep. By it's Foreman,**

.....**Disputant**

VERSUS

**V.KRISHNA & OTHERS**

......**Opponents**

1. Sri. Venaganti Krishna, S/o,Yadagiri, Age: 42 Yrs, Occu: Business, R/o: H.No: 16-4-1386, Shivanagar, Warangal.
2. Sri. Sathani Ravikiran, S/o, Ramaiah, Age: 37 Yrs, Occ: Clerk-Indian Bank, R/o: H.No: 31-3-2073, TNGO's colony, Waddepally, Hanamkonda.
3. Sri. Venuganti Ramachandrudu, S/o, Yadagiri, Age: 40 Yrs, Occu: Business, R/o: H.No. 16-4-1387, Shivanagar, Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.07.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 900 OF 2024**

Between:-

**M/s. Hasini Chit Funds Pvt Ltd., Hanamkonda Branch, Rep. By it's Foreman,**

.....**Disputant**

VERSUS

**V.RAJAMANI & OTHERS**

......**Opponents**

1. Smt.Velde Rajamani, W/o, Sarvaiah, Age: 69 Yrs, Occu: Pension Holder, R/o: H.No: 2-7-428, Excise Colony, Hanamkonda.
2. Sri.Velde Srinivas, S/o, Sarvaiah Age: 39 Yrs, Occu: Superintendent/ SR&BGNR Arts & Sceince College, Khamamm, R/o: H.No: 2-7-428, Excise Colony, Hanamkonda.
3. Sri.Velde Gyaneshwar, S/o,Sarvaiah, Age: 48 Yrs, Occu: Medical Officer/ PHC-Kunoor. R/o: H.No. 3-9-502, Reddy Colony, Hanamkonda.
4. Sri.Shakir Hussian Gulam, S/o, Gulam Shaiful Hussian, Age:35 Yrs, Occu:Junior Lecturer, R/o: H.No: 7-2-834, Mankamathota, Karimnagar.
5. Sri.Tuduru Dattatreya,S/o,Ramaiah, Age: 52 Yrs,Occu: Labrarian Govt Degree College, R/o: H.No: 1-2-122/1, Near Potti Sriramulu Statue, Indhira Marrket, Kaghaznagar.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.07.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 901 OF 2024**

Between:-

**M/s. Hasini Chit Funds Pvt Ltd., Hanamkonda Branch, Rep. By it's Foreman,**

.....**Disputant**

VERSUS

**A.RAMAKRISHNA & OTHERS**

......**Opponents**

1\.
2. Sri.Gundeti Sampath, S/o, Kailasam, Age: 38 Yrs, Occ: Business, R/o: H.No: 9-1-30, Nehrunagar, Sircilla, Rajanna Siricilla.
3. Sri.Adepu Devender, S/o,Sathaiah, Age: 37 Yrs, Occu: Police Constabler, R/o: H.No. 6-5-12, Vidyanagar, Near Water Tank, Rajanna Siricilla
4. Sri.Mekala Kumar,S/o,Lingaiah, Age: 52 Yrs, Occu: Police Constable, R/o: H.No: 15-Police Quarters, Metapally, Karimnagar.
5. Sri.Maganti Srikanth, S/o, Rajendraprasad, Age: 42 Yrs, Occu: Teacher (HPT-Gr-II), R/o: H.No: 1-8-74/1B, Adarshanagar, Metpalli, Karimnagar.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.07.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**



# జనరల్

STATE & REGIONAL NEWS

## నీలాంబర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో 70.76 పోలింగ్

**మలప్పురం (కేరళ) :** కేరళలోని నీలంబర్ అసెంబ్లీ నియోజకవర్గానికి గురువారం జరిగిన ఉప ఎన్నికల్లో 70.76 శాతం మేరకు పోలింగ్ జరిగింది. సాయంత్రం ఐదు గంటల నాటికి లభించిన గణాంకాలప్రకారం భారీగా పోలింగ్ జరిగింది. ఎన్నికల సంఘం ఈ విషయం వెల్లడించింది. ఓట్ల లెక్కింపు ఈనెల 23వ తేదీన జరుగుతుంది. ఉదయం ఏడు గంటలకు భారీ భద్రతమధ్య పోలింగ్ ప్రారంభమైంది. మొదటి రెండు గంటల్లోనే 13.15 శాతం పోలింగ్ నమోదుకాగా, ఉదయం 11గంటల నాటికి 30.15 శాతం, మధ్యాహ్నం మూడు గంటల సమయం నాటికి 60 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 263 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గంలో 2.32 లక్షలమంది ఓటర్లు ఉన్నారు. మొత్తం పదిమంది అభ్యర్థులు ఈ స్థానం కోసం పోటీ పడ్డారు. అధికార వామపక్ష ప్రజాస్వామ్య సంఘటనకు చెందిన ఎం.స్వరాజ్, కాంగ్రెస్ సారథ్యంలోని యుడిఎఫ్ కూటమి అభ్యర్థి ఆర్యదన్ షౌకత్, ఇండిపెండెంట్ అభ్యర్థి పి.వి.అన్వర్, ఎన్‌డిఎ కూటమికి చెందిన బిజెపి అభ్యర్థి మోహన్ జార్జ్ ఈ స్థానం కోసం ప్రధానంగా పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికల్లో తామే గెలుస్తామని ఎల్‌డిఎఫ్ అభ్యర్థి స్వరాజ్ ధీమా వ్యక్తం చేశారు.



## చైల్డ్ పోర్న్ వీడియోలు అప్లోడ్ చేస్తున్న 15 మంది అరెస్టు

డైరెక్టర్ జనరల్ శిఖా గోయల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చైల్డ్ పోర్న్ వీడియోలు అప్లోడ్ చేస్తున్న 15 మంది నిందితులను గురువారం అరెస్ట్ చేశామని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ శిఖా గోయల్ తెలిపారు. కరీంనగర్, జగిత్యాల, వరంగల్, హైదరాబాద్ కు చెందిన ఈ నిందితులకు మరో 34 కేసుల్లో సంబంధం ఉందన్నారు. వీరంతా 19 నుంచి 50 ఏళ్ల లోపు వారేనని, ఇందులో కొంతమంది ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా ఉన్నట్టు పేర్కొన్నారు.సైబర్ సెక్యూరిటీ పోలీసులు, క్రైమ్ పోలీస్ తో కలిసి సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో వీరు పట్టు పడ్డారని తెలిపారు. ఇకపై తెలంగాణలో సోషల్ మీడియాపై సైబర్ సెక్యూరిటీ పూర్తి దృష్టి పెడుతుందని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిజి శిఖా గోయల్ హెచ్చరించారు.



## ఇంటింటికీ సంక్షేమ పథకాలు విస్తృత ప్రచారం

* స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి
* రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ పతాకం ఎగురవేయాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేటలో రోజురోజుకు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావటంపై సంతోషం వ్యక్తం చేశారు. గురువారం సిద్దిపేట నియోజక వర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ నివాసంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తున్న ఆరుగ్యారంటీలను ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యంగా రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికి ఇచ్చిన మాటకు కట్టుబడి రెండు లక్షల రూపాయలకు రైతులకు ఒకే సారి మాఫీ చేసిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. అర్హులైన రైతులందరికి పెట్టుబడి సాయం రైతుభరోసా అందిస్తున్నట్లు తెలిపారు. బిఆర్‌ఎస్ సర్కార్ గొప్పలకు పోయి రాష్ట్రాన్ని దివాళ తీయించిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అర్థిక పరిస్థితిని చక్కదిద్దుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ మెరుగైన స్థానాలు కైవసం చేసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని పూర్తి దీమాను వ్యక్తం చేశారుస. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను నియోజక వర్గం పూజల హరికృష్ణ శాలువాతో సన్మానించారు.

ఈసమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్, నాయకులు కలీమోద్దీన్, బొమ్మల యాదగిరి, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముద్దం లక్ష్మి, నాయకులు సాకి ఆనంద్,రియాజ్,ఆలకుంట మహేందర్ , యూత్ కాంగ్రెస్ నాయకులు పూజల గోపికృష్ణ, సందీప్, దేశెట్టి నరేశ్, చంది శ్రీనివాస్, అజ్మత్, రషద్, అతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# గాడినపడ్డ రైతు భరోసా

ఈ పంట కాలానికి రూ.9వేల కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వ లక్ష్యం

ఐదు ఎకరాల వరకు రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.6404.70 కోట్లు జమ

సాయం అందడంతో రాష్ట్రంలో ఊపందుకున్న వ్యవసాయ పనులు

**బి.అంజన్ కుమార్**



**హైదరాబాద్ :** 'రైతు భరోసా' గాడిన పడింది. పంట పెట్టుబడి కోసం ఎదురుచూసిన రైతుకు భరోసా కలిగింది. ఇప్పటికే ఒకటి కాదు.. రెండు కాదు.. ఐదు ఎకరాల వరకు రైతు భరోసా నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. రైతు సంక్షేమమే లక్ష్యమని ప్రకటించిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్నట్లుగానే కాస్త ఆలస్యమైనా రైతు భరోసా నిధులను విడుదల చేస్తూ అన్నదాతలకు కొండంత అండగా నిలిస్తోంది. దుక్కులు దున్నడం మొదలు పంట పెట్టుబడి కోసం ప్రతి ఏటా రైతులు బ్యాంకుల చుట్టూ, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగడానికే సరిపోయేది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది అన్నదాతలకు ఆ శ్రమ లేకుండా చేసింది. దుక్కులు దున్నడం ప్రారంభం కాగానే అన్నదాత ఖాతాల్లో ఎకరాకు రూ.6వేల చొప్పున పంట సాయం జమ చేయడంతో రైతన్నలు రెట్టించిన ఉత్సాహంతో పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. రైతు భరోసా పేరుతో ప్రభుత్వం అందించిన ఈ ఆర్థిక సాయం పంట మొత్తానికి సరిపోకపోయినప్పటికీ ప్రాథమికంగా దుక్కులు దున్నడం, నాటు, మొదటి దశ ఎరువుల ఖర్చు వరకు మాత్రం రైతులకు చింత లేకుండా పోయింది.

**ఈ ఏడాది గాడిన పడ్డ రైతు భరోసా**

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు 'రైతుబంధు' పేరుతో పంట సాయం అందిస్తే కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత దానిని 'రైతు భరోసా'గా మార్చడమే కాకుండా అదనంగా ఎకరాకు వెయ్యి చొప్పున ఎకరాకు రూ.6వేలను అందిస్తోంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో గత వానాకాలం సీజన్‌లో రైతు భరోసా నిధులు విడుదల కావడంలో కొంత అలస్యమైంది. అంతేకాకుండా రైతులందరికీ పూర్తి స్థాయిలో కూడా ప్రభుత్వం నిధులను విడుదల చేయలేకపోయింది. నిధుల లేమితో ప్రభుత్వం, రైతు భరోసా విడుదల కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. అయితే దీనిపై గత రబీ సీజన్ నుంచే దృష్టి సారించిన ప్రభుత్వం నిధుల లేమిని అధిగమించి రైతు భరోసాను గాడిలో పడేలా చర్యలు తీసుకుంది.

**ఈ పంట కాలానికి రూ.9వేల కోట్లు రైతు భరోసా**

రాష్ట్ర వ్యాప్తంగా ఈ వానాకాలం (ఖరీఫ్) సీజన్‌కు సంబంధించి, సుమారు 1.37 కోట్లు ఎకరాల సాగు చేసే వకాశాలున్నట్లు అధికారులు అంచనా వేశారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం మొత్తంగా సాగు యోగ్యమైనవి 1.49 కోట్ల ఎకరాలు ఉన్నట్లు అంచనలు ఉండడంతో ఈ సీజన్‌కు సంబంధించి రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగులో ఉన్న ప్రతి ఎకరాకు రైతు భరోసా నిధులు వేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అధికారుల సాగు అంచనాకు మించినా రైతులకు నష్టం జరగకుండా ఉండేలా ఈ చర్యలను తీసుకుంది.

**దుక్కులకు ముందే రైతు భరోసా నిధులతో రైతులలో సంతోషం**

ఈ ఏడాది దుక్కులు దున్నడానికి ముందే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులను అన్నదాత ఖాతాలో జమ చేస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 16వ తేదీన హైదరాబాద్‌లో రైతు నేస్తం వేదికగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తన చేతుల మీదగా రైతు భరోసా నిధుల విడుదలను లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభించిన తేదీ మొదలు 9 రోజుల్లోనే సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా నిధులను అందిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో గడిచిన నాలుగు రోజుల్లో ఇప్పటికే 5 ఎకరాల లోపు ఉన్న 62.47లక్షల మంది రైతులకు సంబంధించి 93.41లక్షల ఎకరాలకు గాను అన్నదాతల ఖాతాల్లో రూ.6404.70 కోట్లును ప్రభుత్వం జమ చేసి రికార్డును సృష్టించింది. ఇందులో 2ఎకరాల వరకు ఉన్న 39.16లక్షల ఎకరాలకు గాను 41.25లక్షల మంది అన్నదాతల ఖాతాలో రూ.2349.83 కోట్ల జమ చేశారు. అదేవిధంగా మూడు ఎకరాల వరకు ఉన్న రైతులకు చెందిన 25.86లక్షల ఎకరాలకు సంబంధించి 10.45 లక్షల రైతుల ఖాతాల్లో రూ.1551.89 కోట్లును వేశారు. కాగా నాలుగు ఎకరాల వరకు 21.89 లక్షల ఎకరాలకు గాను 6.33 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.1313.53 కోట్లు జమ చేశారు. గురువారం నాటికి 5 ఎకరాల వరకు ఉన్న 19.82 లక్షల ఎకరాలకు గాను 4.43 లక్షలమంది రైతుల ఖాతాల్లో రూ.1189.43 కోట్లను జమ చేయడంతో రాష్ట్రంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.

## పేద ప్రజల సొంతింటి కల లక్ష్యం

స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్మ మని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ స్పష్టం చేశారు. వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ పట్టణం ,మండలానికి సంబంధించిన ఇందరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ వికారాబాద్ పట్టణానికి చెందిన 359 మంది, వికారాబాద్ మండలానికి చెందిన 254 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అయన అందజేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి ,అభివృద్ధి ఫలాలు అందూలా కృసి చేస్తున్నామన్నారు. దేశంలో పేదల కోసం కూడు ,గుడ్డ ,నీడ స్వర్గీ ఇందిరాగాంది దేశ ప్రజలకు ఎంతో సేవ చేశారని సభాపతి అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు మధ్య వర్తుల ప్రమేయం లేకుండా మొత్తం నాలుగు విడుతల్లో లబ్దిదారుల బ్యాంక్ ఖాతలో డబ్బులు జమ చేయడం జరుగుతుందిని అయన తెలిపారు. బేస్‌మెంట్ గాని గోలు గాని శ్లాబ్‌గాని నిర్మాణ పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఖతాలో వేయడం జరుగుతుందని అయన తెలిపారు. ఈ ఏడాది నాలుగు లక్షల యాభైవేల ఇళ్లు వస్తాయని అయన తెలిపారు.

స్పీకర్ హోదాలో ఉండడంతో వికారాబాద్ నియోజకవర్గనికి ప్రత్యేకంగా 7000 ఇందరమ్మ ఇళ్ళు వస్తాయని మన నియోజకవర్గంలో కూడా స్వంత ఇల్లు లేని పేదలందరికి ఏడాదికి కొంతమందికి చొప్పున అందరికి ఇళ్ళను మంజురు చేయిస్తామని అయన తెలిపారు. రాష్టం ప్రభుత్వం మేనిపెస్టోలో పెట్టిన అంశాలతో పాటుగా ఇవ్వని హామీలను కూడా చేపట్టడం జరుగుతుందని అయన అన్నారు. పేదలు తృప్తిగా కడుపు నిండా అన్నా తినాలనే మంచి ఆశాయంతో దేశంలోనే మొదటి సారిగా మన తెలంగాణ రాష్టంలో 90లక్షల కుటుంబాలకు సన్న బియ్యంతో అన్నం తింటున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత 18నెలల లోనే వ్యవసాయ రంగానికి లక్ష కోట్లు ఖర్చు చేసిందని అయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన మూడు నెలల కాలంలోని 25లక్షల మంది రైతులకు 22వేల కోట్ల రుణమాపీ చేసిందని స్పీకర్ అన్నారు.

వానాకలం పంటలకు సాగుకు రైతు భరోసా డబ్బులు రైతుల భ్యాంకు ఖాత్తల్లో జమ చేస్తున్నామన్నారు. నిన్నటి వరకు నాలుగు ఎకరాల వరకు రైతులకు అందాయని ముఖ్యంమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విదంగా తొమ్మిది రోజులలో తొమ్మిదివేల కోట్ల రూపాయలు రైతులకు అందుతాయని అయన తెలిపారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయ అవరణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ మహిళా శక్తి మన దుకాణం స్టాల్ ను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ , అదనపు కలెక్టర్ సుదీర్ , ఆర్డిఓ వాసుచంద్ర , డిఆర్‌డిఓ శ్రీనివాస , పీడి కృష్ణయ్య, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## భద్రత లేని బాసర తీరం..



ఐదేళ్లలో 51 మంది మృతి

ఇది ముమ్మాటికీ అధికారుల నిర్లక్ష్యమే

జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో పిటిషన్

మృతుడి కుటుంబానికి రూ.పది లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర గోదావరి నదిలో పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు భద్రత కరువైంది. ఆలయానికి కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నా..భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే చోట భద్రతా చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఐదేళ్లుగా అధికారుల నిర్లక్ష్యానికి 51 మంది బలయ్యారు. సాధారణంగా జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు తొలుత గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారు. అయితే స్నాన ఘాట్ ల వద్ద సరైన ఏర్పాట్లు లేకపోవడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. అలాగే ప్రమాదాలకు కూడా గురవుతున్నారు.కొందరు నది మధ్యలో ఉన్న ఇసుకమేటల వరకూ పడవలో వెళ్లి అక్కడ స్నానాలు చేస్తున్నారు.ఇక్కడ సుమారు ముపుయి వరకు పడవలు ఉన్నాయి.ఇసుక మేటల వరకూ తీసూకెళ్లి అక్కడ వదిలి పడవ నిర్వహకులు వచ్చేస్తున్నారు.ఆ ఇసుక మేటల వద్ద స్నానాలు చేసే వారికి నీటి లోతు తెలియక ప్రమాదాలకు గురై గల్లంతు అవుతున్నారు.ఆదివారం హైదరాబాద్ లోని చింతల్ బరి,దిల్మక్న గర్కు చెందిన ఐదుగురు గోదావరి నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.గత వారం పుణ్యస్నానాలు చేయడానికి వచ్చి ఇద్దరు మృతి చెందారు.

**ఇదీ నిర్లక్ష్యం..**

స్నానాల ఘాట్ వద్ద ఎటువంటి సూచిక బోర్డులు లేవని,గజ ఈతగాళ్ల జాడే లేదని,లైవ్ జాకెట్లు మచ్చుకైనా కని పించలేదని,అధికారులు,సిబ్బంది భక్తులను పట్టించు కున్న పాపాన పోవడంలేదని పలువురు భక్తులు ఆరోపించారు.నది లోపలికి వెళ్లకుండా ఉండేందుకు ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టలేదని,కనీసం కంచె ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు.బాధ్యులపై చర్యలు తీసుకు నేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.ఇష్టానుసారంగా బోటింగ్ నిర్వహణ. బాసర వద్ద గోదావరి నదిలో బోటింగ్ నిర్వహణ ఉంది నాటుపడవలతో బోటింగ్ నిర్వహిస్తుంటారు. ఎక్కడ నిబంధనలు పాటించడం లేదు.సుమారు ముప్పయికి పైగా పడవలు ఉన్నాయి.గోదావరి నది మధ్యలో ఉన్న ఇసుక మేటల వద్దకు పడవలో కొందరు భక్తులు వెళ్లి అక్కడ స్నానాలు చేసి వస్తుంటారు.అయితే ఇసుకదిబ్బల వద్ద కూడా హెచ్చరిగా బొడ్డులు లేవు.గజ ఈతగాళ్లు కూడా లేరు.అలాగే పడవ నిర్వహకులు కూడా భక్తులను ఇసుక మేటల వద్ద దించి తిరిగి వచ్చేస్తారు.

## మహిళలకు ఆర్థిక స్వావలంబన

● ప్రజా ప్రభుత్వ లక్ష్యం అదే ● పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ● ములుగు జిల్లా జగ్గన్నపేట గ్రామంలో కుట్టుమిషన్‌లో శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాల పంపిణీ





**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి**

మహిళా సంఘాలను బలోపేతం చేసి వారికి ఆర్థిక స్వావలంబన చేకూర్చడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లాలోని జగ్గన్నపేట గ్రామం ఆశ్రమ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కుట్టు మిషన్ ఉచిత శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్, ధృవపత్రాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ చాలా మంది నైపుణ్యం లేని కారణంగా ఉపాధికి దూరంగా ఉంటున్నారని, దూర ప్రాంతాలకు పని కోసం వెళ్ళి మరల ఇంటికి వెనుదిరిగి వస్తున్నారని, ఈ పరిస్థితి దృష్టిలో పెట్టుకొని మహిళలు ఉన్న దగ్గరనే ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో వారికి ఈ కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల అభివృద్ధి కొరకు కట్టుబడి పనిచేస్తున్నదని అన్నారు. వివిధ పాఠశాలల్లో అవసరమైన మేరకు ఏకరూప దుస్తులను మహిళా సంఘాలకు ఆర్డర్ ఇచ్చి వారి ద్వారా విద్యార్థులకు బట్టలు కుట్టించడం ద్వారా మహిళా సంఘాలకు దాదాపు 30 కోట్ల రూపాయల లాభం వారికి చేకూర్చడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో రాబోయే విద్యా సంస్థలలోని పిల్లలకు కూడా మహిళా సంఘాల ద్వారానే బట్టలు కుట్టేలా వారికి ఆర్డర్లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. 15 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలలోపు వయస్సున్న మహిళలు అందరూ తప్పకుండా మహిళా సంఘాలలో చేరాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత కొరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, అందులో భాగంగానే సంఘాలకు పెట్రోల్ బంక్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, బస్సులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవకాశాలను అందించడం జరుగుతుందని అన్నారు. మహిళలు ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకొని ఉన్నతంగా ఎదగాలని, తద్వారా తెలంగాణ ప్రగతి పథంలో నడిచేలా మనమంతా ముందడుగు వేద్దామని అభిలషించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా సంక్షేమాధికారి తుల రవి, డేటాప్రో సంస్థ నిర్వాహకులు రవీందర్, డిఎస్‌పి రవీందర్, ట్రైబల్ వెల్ఫేర్ డి పోచం, ఎంపిడి రామకృష్ణ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం (డిహెచ్‌ఈడబ్ల్యూ) డిఎంసి రమాదేవి, డిసిపిఓ జె ఓంకార్, ఐసిడిఎస్ ములుగు ప్రాజెక్టు పరిధిలోని వివిధ సెక్టార్ల సూపర్‌వైజర్లు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, డిసిపియూ, సిహెచ్‌ఎల్, సఖి, డేటాప్రో సంస్థల సిబ్బంది, శిక్షణలో పాల్గొన్న మహిళలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## హోర్మజ్ జలసంధిని మూసేస్తాం

**శత్రుదేశాలకు ఇరాన్ హెచ్చరిక**

**టెహ్రాన్ :** వాణిజ్య రాకపోకలకు ఎంతో కీలకమైన హోర్మజ్ జలసంధిని మూసేస్తామని, యుద్ధ వ్యూహంలో భాగంగా ఆ అవకాశం కూడా తమకు అందుబాటులో ఉందని ఇరాన్ గురువారం నాడు శత్రుదేశాలకు హెచ్చరిక చేసింది. ఇరాన్ జాతీయ భద్రతామండలి అధ్యక్షవర్గం సభ్యుడు బెహ్నాం సయీదీ ఒక ప్రకటన చేస్తూ శత్రుదేశాల వాణిజ్య నౌకల కార్యకలాపాలను అడ్డుకునేందుకు ఇలాంటి అవకాశం కూడా తమ దగ్గర ఉందని ఆయన హెచ్చరించారు. గతంలో కూడా విభేదాలు తలెత్తినప్పుడు పశ్చిమ దేశాల ఒత్తిడిని తట్టుకోలేక జలసంధి మూసివేతను ఒక ఆయుధంగా ఉపయోగిస్తామని హెచ్చరించింది. ప్రపంచ దేశాల చమురు అవసరాలకు వీలుగా నౌకల్లో ఈ జలసంధి నుండి చమురు రవాణా జరుగుతుంది. ఈ జలసంధి ద్వారా వెళ్ళే నౌకల్లో చమురు ప్రతిరోజూ 20 శాతం ప్రపంచ చమురు అవసరాలను తీరుస్తూ ఉంటుంది. ఈ జలసంధి పనామా కాలువ తరహాలోనే చాలా ఇరుకుగా ఉండటంవల్ల విపరీతమైన రద్దీ ఉంటుంది. నౌకలు మెల్లగా ప్రయాణం చేస్తూ ఉంటాయి. గల్ఫ్ దేశాల నుండి ప్రతిరోజూ యూరప్ దేశాలకు చమురు నౌకలు ఈ జలసంధిద్వారా ప్రయాణం చేస్తాయి. పదేళ్ళక్రితం ఈ జలసంధిలోని తనిఖీ కేంద్రాలలో నమోదౌన గణాంకాల ప్రకారం రోజుకు 18.5 మిలియన్ బ్యారల్స్ చమురు రవాణా అవుతూ ఉండేది. ఇప్పుడు ఈ రవాణా రెట్టింపు దరిదాపులకు చేరింది. అమెరికా ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ సమాచారం ప్రకారం, ఈ జలసంధి నుండి ప్రయాణాన్ని తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని, లేదా భారీ పైపులైన్లు ఏర్పాటు చేయాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీఅరేబియా దేశాలు చాలాకాలంగా కోరుతున్నాయి. డోనాల్డ్ ట్రంప్ మొదటివిడత అధికారంలోకి వచ్చాక 2018లో ఇరాన్‌తో అణుఒప్పందాన్ని రద్దుచేశారు. ఆ తర్వాత 2019 ఏప్రిల్ 18వ తేదీన ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి)ను ఉగ్రవాదసంస్థగా ప్రకటించడంతో ఉద్రికతలు పెరిగాయి.

అప్పటినుండి ఇప్పటివరకూ ఆ ఉద్రిక్తతలు అడపాదడపా కొనసాగుతూనే ఉన్నాయి. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ఇరాన్‌తో అణుచర్చలు ప్రారంభించడం, ఇజ్రాయెల్ జూన్ 13న ఇరాన్‌పై దాడులు చేయడంతో పరిస్థితులు గతంకంటే భిన్నంగా పూర్తిగా మారిపోయాయి. ఇజ్రాయెల్‌కు పాశ్చాత్యదేశాల మద్దతు ఉండటం వల్ల ఇరాన్‌పై దాడచేసే హక్కు ఉందన్న ధీమా పెరిగింది. ఇది రెండో ప్రపంచయుద్ధానంతర నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నది.

**ఇరాన్‌పై సైనిక చర్యల్లో జోక్యం చేసుకోవద్దు : రష్యాహెచ్చరిక**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న సైనిక చర్యలో జోక్యం చేసుకోవద్దని అమెరికాకు రష్యా హెచ్చరించింది. రష్యా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా గురువారం నాడు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో అంతర్జాతీయ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇరాన్ అణుస్థావరాలపై ఇజ్రాయెల్‌తో కలిసి దాడులు చేసేందుకు ట్రంప్ ప్రణాళిక సిద్ధంచేశారన్న వార్తలపై స్పందించారు. ఈ విధంగా జోక్యం చేసుకోవడం తీవ్ర ప్రతికూల పరిణామంగామారుతుందని హెచ్చరించదలిచామన్నారు. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య సంఘర్షణను పరిష్కరించేందుకు రష్యా రాజకీయ, దౌత్య ప్రత్యామ్నాయ మార్గాలలో నిమగ్నమై ఉందని ఈ సందర్భంగా ఆమె అమెరికాకు గుర్తుచేశారు. హింసను అరికట్టి, చర్చలను పునరుద్ధరించి, శాంతికి కట్టుబడటం ప్రస్తుత తరుణంలో తక్షణ కర్తవ్యమని, ఇందుకు రష్యా పూర్తిగా కట్టుబడి చురుగ్గా ప్రయత్నాలు చేస్తోందని మరియా జఖరోవా చెప్పారు.

ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధం మొదలైన మొదటిరోజునే తమ అధ్యక్షుడు పుతిన్ రెండు దేశాల నాయకులతో అంటే నేతన్యాహూతో, ఆయొతుల్లా అలీ ఖమేనీలతో సంభాషణలు చేశారనీ, అమెరికా అధ్యక్షుడితో, టర్కీ, యుఎఇ నాయకులతో కూడా ఆయన ఈ సమస్యపై సంభాషణలు చేసి రాజకీయ,దౌత్యపరమైన పరిష్కార యత్నాలు చేస్తున్నారని, ఈ దశలో ఎలాంటి జోక్యం చేసుకోవద్దని హెచ్చరించారు.

## దళితులకు చెందిన స్మశాన వాటిక దళితులకే కేటాయించాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : ఏండ్ల తరబడి దళితులు దహన సంస్కారాలు నిర్వహిస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని ముల్కలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులో స్థానిక ఎమ్మార్వో దేశ్యకు గ్రామానికి చెందిన దళితులు మెమోరాండం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముల్కలపల్లి గ్రామంలోని 33/8 సర్వేనెంబర్‌లో ఉన్నటువంటి స్మశాన వాటిక స్థలాన్ని ఆనాటి ప్రజాప్రతినిధులు, పంచాయతీ సెక్రెటరీ, గ్రామ మాజీ సర్పంచ్ ఇమ్మడి మల్లప్ప, పక్క గ్రామమైన జేతిరాం తండా గ్రామానికి అట్టి స్థలాన్ని అన్యాయంగా రాసిచ్చాడని, అందులోనే వైకుంఠ ధామం నిర్మించుకొని జేతురాం తండా గ్రామస్థులు దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. దయ చేసి మాదిగ కులానికి చెందిన బొందల గడ్డను అన్యాయంగా రాసిచ్చారని, వెంటనే అట్టి సమస్యపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని తమ దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దళిత కుల పెద్దలు ఎస్.పెంటయ్య, రామచంద్రయ్య, అంజమ్మ, యాదమ్మ, దుర్గయ్య, ఇస్తారి పాల్గొన్నారు.

## బీచుపల్లి ఆంజనేయుడి సన్నిధిలో మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి** : జోగులాంబ గద్వాల జిల్లాలోని కృష్ణా నది సమీపంలోని బీచుపల్లి ఆంజనేయ స్వామిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దర్శించు కున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, విజయుడు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురవ హనుమంతు పాల్గొన్నారు.





## రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భూ సమస్యలకు రెవెన్యూ సదస్సుల ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులు అందరు సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం భువనగిరి మండలంలో చీమలకొండూరు గ్రామంలో భూ భారతి రెవిన్యూ సదస్సు లో పాల్గొని జరుగుతున్న రెవెన్యూ సదస్సును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఆన్లైన్ లో నమోదు చేస్తున్నారా అని అధికారులను ఆరా తీశారు. వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సదస్సులో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని, సానుకూలంగా ఉన్న సమస్యలను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పిల్లలకు కృత్యాధార పద్ధతుల్లో విద్య

### భవిత కేంద్రాల్లో అవసరాలు ఉన్న పిల్లలను నమోదు చేయాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలందరిని నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి ప్రారంభించి ఆమె మాట్లాడారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు కృత్యాధార పద్ధతుల్లో విద్యను అందించడం జరుగుతుందన్నారు. అంతేకాక వారి మానసికపరమైన లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు తదుపరి విడతలో విద్యాశాఖ ద్వారా పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని ఆమె తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలో భవిత కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దడం పట్ల సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను, విద్యాశాఖ అధికారులను ఆమె అభినందించారు. ఆమె వెంట డీఈవో భిక్షపతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్హులకు న్యాయం జరిగేలా పనిచేద్దాం



**ప్రజాపక్షం/యాదాద్రి** : అర్హులైన వారికి పూర్తి న్యాయం జరిగేలా సానుకూల దృక్పథంతో పని చేయాలని, అప్పుడే భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సార్థకత చేకూరి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి అన్నారు. గురువారం మినీ మీటింగ్ హాల్‌లో రెవిన్యూ డివిజనల్ అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లతో రెవెన్యూ సదస్సులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయని వాటిలో ఎన్ని పరిష్కరించారని మండలాల వారిగా సమీక్షిస్తూ వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో నమోదు చేసి తద్వారా నోటీసులు జారీ చేయాలన్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, భూ సంబంధిత సమస్యల మార్పులు చేర్పులు తదితర భూ సమస్యలు పరిష్కరించుట కొరకు పాత ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సంబంధిత పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ రెవెన్యూ సదస్సులు ముగియున్నందున క్షేత్రస్థాయిలో విచారణ జరపాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో భువనగిరి రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణారెడ్డి, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, అన్ని మండలాల తహసిల్దార్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంపునకు కృషి : డిఇఒ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. గురువారం పట్టణంలో మాట్లాడుతూ జిల్లాలో 1438 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, అందులో 229 హైస్కూల్స్, 117 యుపీఎస్, 1100కు పైగా ప్రైమరీ స్కూల్స్, కేజీబీవీ 27, మోడల్ స్కూల్స్ 17, యుఆర్‌ఎస్ ఒకటి ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 69వేల మంది విద్యార్థులు అడ్మీషన్లు పొందారని అన్నారు. ఆగస్టు 31తో అడ్మీషన్ గడువు ముగుస్తుందని అప్పటిలోగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. గతంలో కంటే ఈ సంవత్సరం విద్యార్థు సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందించబడుతుందని, గుణాత్మక విద్య ప్రభుత్వ పాఠశాలల ద్వారా అందుతుందని తల్లిదండ్రులకు వివరించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా కృషి చేయాలన్నారు. అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలను నడపవద్దన్నారు. అనుమతులు ఒక పేరుతో పాఠశాలలు మరో పేరుతో కొనసాగితే చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు లేని ప్రభుత్వ పాఠశాలలను 24 గుర్తించామని వాటిని మూసివేస్తామని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో పది పాఠశాలలను తిరిగి పునః ప్రారంభించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఈవో బాలునాయక్ ఉన్నారు.

# డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి

### దామరచర్ల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ



**ప్రజాపక్షం/నల్లగొండ (దామరచర్ల)** : ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు, సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె దామరచర్ల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపి రిజిస్టర్ ,ఇతర రిజిస్టర్‌ను, మందుల స్టాక్‌ను పరిశీలించారు. డాక్టర్లతో మాట్లాడు తూ సమయం ప్రకారం డాక్టర్లు,సిబ్బంది విధులకు హాజరు కావాలని ,ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ,ముఖ్యంగా వైద్యం కోసం వచ్చిన రోగులను వెంటనే ఆస్పత్రిలో చేర్చుకొని వైద్యం అందించాలని , కేసులు సీరియస్‌గా ఉన్నప్పుడు మాత్రమే నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి లేదా ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేయాలని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ కేంద్రంలో ఉన్న పిల్లలను పరిశీలించారు. అంతేకాక నిర్మాణంలో ఉన్న టాయిలెట్ పనులను తనిఖీ చేశారు. ఆక్టివిటీ రూమ్ లో నూతన సాంకేతిక తను ఉపయోగించి విద్యార్థులకు కృత్యాధార పద్ధతిలో బోధించడం జరుగుతుందని, అలాగే ఫిజియోథెరపీ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ కస్తుర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని తనిఖీ చేసి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా కెజిబివి పరిసరాలు, టాయిలెట్స్ అన్నింటిని తిరిగి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ఆమె వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్,మండల ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

**నిర్లక్ష్యం చేస్తే షో కాజ్ నోటీసులు** : పాఠశాలల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె పాఠశాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం అమలు, తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడం ,అలాగే వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా పాఠశాలల్లో పరిశుభ్రత లోపం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేకించి జిల్లాలోని అన్ని పాఠశాలలు ,అంగన్వాడీ కేంద్రాలు ,హాస్టళ్లలో పరిశుభ్రత లోపం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.మండలాల ప్రత్యేక అధికారులు చొరవ తీసుకోవాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఎక్కడా ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే షో కాజ్ నోటీసులు జారీ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ , రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,ఎమ్ ఎస్ వో లు, ఇతర అధికారులు, తదితరులు, హాజరయ్యారు.



## డబ్బాకొట్లను తొలగించాలని చూస్తే ఉద్యమిస్తాం

### అఖిలపక్షం నాయకుల హెచ్చరిక

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని మండపం ఏరియాలో డబ్బాకొట్లు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలు చేసుకుంటూ గత యాభై సంవత్సరాలుగా అప్పటి గ్రామ పంచాయతీకి ప్రస్తుతం మున్సిపాలిటికి పన్నులు చెల్లిస్తూ చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం గడుపుతున్న వారి డబ్బాకొట్లను తొలగించాలని, లేనిచో మేమే బలవంతంగా మీ డబ్బాకొట్లు తొలగిస్తామని మున్సిపాలిటి వారు భయభ్రాంతులకు గురి చేయడం అన్యాయమని కోదాడ పట్టణ అఖిలపక్షం నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నలభై, యాభై ఏళ్లుగా నిరుపేదలైన వారు డబ్బాకొట్లు ఏర్పాటు చేసుకుని బతుకుతుంటే వారిని అక్కడ నుండి వెళ్లగొట్టాలని చూడటం. వారి జీవనం మీద దెబ్బకొట్టడమేనని అన్నారు. ఒక వేళ మున్సిపాలిటి వారు బలవంతంగా ఆ డబ్బాకొట్లను తొలగించాలని చూస్తే ఊరుకునేది లేదని, ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని అన్నారు. ఈ విషయమై డబ్బాకొట్లు దుకాణందారులు గౌరవ హైకోర్టును అశ్రయించగా వారి తరుపున వీర్జాల ప్రవీణ్‌కుమార్ లాయర్‌గా హైకోర్టులో వాదనలు వినిపించగా హైకోర్టు సానుకూలంగా స్పందిస్తూ ఆ డబ్బాకొట్లను తొలగించరాదని అదేశాలు జారీ చేసినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో డబ్బాకొట్ల దుకాణదారుల సంఘం అధ్యక్షులు ఎస్‌కె నయీం, గౌరవ అధ్యక్షులు బొలిశెట్టి కృష్ణయ్య, సిపిఐ నాయకులు మేకల శ్రీనివాసరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి షేక్ లతీఫ్, కాంగ్రెస్ నాయకులు ఎస్‌డి ముస్తాపా, కందరబోయిన వేలాద్రి, బిఆర్‌ఎస్ నాయకులు కర్ల సుందర్‌బాబు, దొంగరి శ్రీనివాస్, డబ్బకొట్ల దుకాణదారులు షేక్ దస్తగిరి, నరహరి, కర్ల రాజు, సింహచలం, రావూఫ్, సైదులు, మౌలాన, హుస్సేన్, దస్తగిరి, లక్ష్మి , కల్పన, స్రవంతి, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

# పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి

### సిపిఐ ఆధ్వర్యంలో ఇజ్రాయెల్ దేశ ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం





**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు తక్షణమే ఆపాలలి,పాలస్తినాకు సంఘీభావాన్ని ప్రకటించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి దేశ ప్రధానికి కోరారు. సిపిఐ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ బస్టాండ్ సుభాష్ విగ్రహం దగ్గర పాలస్థినాపై ఇజ్రాయిల్ దౌర్జన్యానికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్ దేశ ప్రధాని దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ పేద దేశాలను కబళించి వేసే కుట్రలో భాగంగా సామ్రాజ్యవాదులు చేస్తున్న దాడులు పాలస్తీనాను అతలాకుతలం చేస్తున్నాయని అన్నారు. పాలస్తీనాలో చిన్నారుల, మహిళలపై ఇజ్రాయిల్ చేస్తున్న అమానవీయ చర్యలను ఖండించారు. ఇజ్రాయిల్ క్రూరమైన దాడులపై మోడీ ప్రభుత్వం మౌనం వీడాలని, బాధిత పాలస్తీనా పట్ల సంఘీభావం ప్రకటించాలని డిమాండ్. పాలస్తీన సార్వభౌమత్వాన్ని ,స్వేచ్ఛ స్వాతంత్రాన్ని హరించే విధంగా ఇజ్రాయిల్ వ్యవహరిస్తుందని అమెరికా సామ్రాజ్యవాదులు వారికి వత్తాసు పలకడం విచారకరమని అన్నారు. పాలస్తీనా ప్రజల జీవించే హక్కు హరించి వేస్తున్న ఇజ్రాయిల్ దురాగతాలని ప్రపంచం మొత్తం ఖండించాలని కోరారు. హైదరాబాద్‌లో తయారు చేసిన డ్రోన్‌లను ఇజ్రాయిల్‌కు సరఫరా చేస్తున్నారని, వీటిని ఆ దేశం పాలస్తీనా, ఇరాన్‌లోని అమాయక ప్రజలపై ప్రయోగిస్తున్నారని అన్నారు .కావున సైనిక సహకారాన్ని భారత్ దేశం తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు.పాలస్తీనా అరబ్బులకు చెందినది హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, ఇతరులు భారతదేశంలో కలిసి నివసిస్తున్నట్లే యూదులు, క్రైస్తవులు అక్కడ శాంతియుతంగా జీవించాలి కానీ దీనికి విరుద్ధంగా దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి సిపిఐ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, పాణెం వెంకట రావ్, మాదారు, గుండె రవి, యూసుఫ్,జానీ,వెంకన్న ఏం నందం,సీతారాములు, చాందు సర్దార్, పుట్టల సుజాత విజయ,మాధవి, హైమావతి, విజయరెడ్డి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ మోటకొండూర్ మండల కార్యదర్శిగా గాదగాని మాణిక్యం



**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూర్ మండల సిపిఐ మండల కార్యదర్శిగా గాదగాని మాణిక్యంను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ ప్రకటించారు. ఆయన గురువారం మాట్లాడుతూ మోటకొండూర్ మండల సిపిఐ 4వ మహా సభల సందర్భంగా మానిక్యం ను మరోసారి మండల కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. 31 మంది మండల కౌన్సిల్ సభ్యులుగా మండల కార్యవర్గ సభ్యులు 9 మందిని ఏకగ్రీవంగా ఎంపిక చెసినట్లు, వారితో పాటు మండల సహాయ కార్యదర్శులుగా ముసుకు పెంటారెడ్డి, ఆలేటి బాలరాజులను మండల కార్యవర్గ సభ్యులుగా పశువుల నరసింహ, బోల్ల శీను, పల్లె వెంకన్న, మంచాల రాధమ్మ, శనిగల భాగ్యమ్మ, బీరకాయల మల్లేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్య మాట్లాడుతూ మండలంలోని ఉన్న ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజలతో ఉంటూ ప్రజలను చైతన్యపరిచి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భారత కమ్యూనిస్టు పార్టి ముందుంటుందని, ప్రభుత్వ పథకాలు అమలులో అవకతవకలు జరిగితే సిపిఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమాలు ధర్నాలు రాస్తారోకులు చేస్తామని డిమాండ్ చేశారు.

## సైబర్ నేరాల పట్ల జాగ్రత్త

### సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీనారాయణ






**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : సైబర్ నేరాల పై పిర్యాదులు అందిన వెంటనే సైబర్ వారియర్స్ తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీనారాయణ ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు సైబర్ వారియర్స్ కు సైబర్ నేరాల పట్ల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్రైమ్ డిఎస్‌పి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా సైబర్ నేరగాళ్లు టెక్నాలజీని ఉపయోగించి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులు,మెసేజ్ లు క్లిక్ చేయకూడని, నకిలీ వెబ్ సైట్ల ద్వారా అమాయకులను నమ్మించి వారి వద్ద నుంచి డబ్బులు లాగేస్తున్నారని అంతే కాకుండా వైద్య సహాయం, పేరు పొందిన కంపెనీలలో ఉద్యోగాల పేరుతో సులభంగా నమ్మే మోసాలను ఎంచుకొని మోసాలు చేస్తున్నారన్నారు. లోన్ యాప్ అంటూ సులభంగా లోన్ లు ఇస్తూ అధిక వడ్డీలు వసూలు చేస్తూ మీ యొక్క డేటా మొత్తం తమ అధీనం లోకి తీసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో మోసపూరితమైన ఆన్ లైన్ యాప్ లలో అధిక వడ్డీ ఆశా చూపి, పెట్టుబడికి రెట్టిపు సొమ్ము వస్తాయని అనేక మంది అమాయకులని మోసం చేస్తున్న కేసులు చాలా నమోదు అవుతున్నాయని జిల్లా ప్రజలు ఇలాంటి అన్ లైన్ యాప్ లలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దు అని, ఎవరైనా ఇలాంటి మోసాలకు గురి అయితే వెంటెనే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని లేని యెడల హెల్ప్ లైన్ నంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని కోరారు.

# చోరీ కేసులో నలుగురు దొంగలు అరెస్టు

### రూ.11 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

### జిల్లా ఎస్‌పి కె.నర్సింహ్మ వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాలోని కోదాడ పట్టణ పోలీసులు నలుగురు దొంగలను అరెస్టు చేసి మొత్తం ఏడు కేసుల్లో రూ.11 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి కె.నర్సింహా దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. హుజూర్‌నగర్‌కు చెందిన ఇటికల ఫణిచంద్ ప్రస్తుతం కోదాడలో నివాసం ఉంటున్నాడు. కోదాడకు చెందిన మరో నిందితుడు చేకూరి నాగేంద్రబాబుతో పాటు మరో ఇద్దరు మైనర్లు మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడి కోదాడటౌన్, హుజూర్‌నగర్, చౌటుప్పల్, అనంతగిరి, మునగాల, చిలుకూరు, నల్లగొండ జిల్లాలోని వేమలపల్లి, నిడమనూరు, ఖమ్మం జిల్లాలోని నెలకొండపల్లి లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఫణిచంద్ గురువారం ఉదయం మరో దొంగ నాగేంద్రబాబు ఇంటికి వెళ్లారు. చోరీ చేసిన సొమ్ము బంగారం, వెండి అభరణాలను అమ్ముకునేందుకు ప్రయత్నిస్తుండగా కోదాడ టౌన్ ఇన్స్‌పెక్టర్ కె.శివకుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ సునిల్‌కుమార్, ఎఎస్‌ఐ బి.హనుమాన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కరుణాకర్, కృష్ణలు, పోలీసులు యల్లారెడ్డి, కొండలు, సతీష్ లు వారిని చాక్యచక్యంగా పట్టుకున్నారు. వారి నుండి 8 తులాల బంగారం, 250 గ్రాముల వెండి, రూ.2.20 లక్షల విలువగల కెటిఎమ్ బైకు, 60వేల విలువైన మూడు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు, అనంతరం వీరిని విచారణ చేయగా నల్లగొండ జిల్లా నిడమనూరు, వేములపల్లి, సూర్యాపేట జిల్లాలో కోదాడ, మునగాల, చిలుకూరు, హుజూర్‌నగర్, యాదాద్రి జిల్లా చౌటుప్పల్, ఖమ్మం జిల్లాలో వీరిపై చోరీ కేసులు నమోదుకాగా జైలు జీవితం గడిపినట్లు చెప్పారు. నలుగురి నిందితుల్లో ఇద్దరు మైనర్లు కావడంతో జ్యూవెనల్ కోర్టుకు హాజరు పరుస్తున్నామని చెప్పారు. ఈ కేసును చాకచక్యంగా చేధించిన పోలీసులను జిల్లా ఎస్‌పి అభినందించారు. ఈ సమావేశంలో కోదాడ డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి, పట్టణ ఇన్స్‌పెక్టర్ శివశంకర్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ





**ప్రజాపక్షం/భువనగిరి** : రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు దోపిడీకి పాల్పడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీలు శూన్యమనీ విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ రంగురంగుల బ్రోచర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో భువనగిరిలోనీ మదర్ తెరిసా పాఠశాలలో అధిక ఫీజులు తగ్గించాలని పుస్తకాల అమ్మకాలు చేయకూడదని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఫీజులు పేరుతో వసూలు దందా కొనసాగిస్తున్నారన్నారు విద్యను అంగడి సరుకుగా మార్చేసి అడ్మిషన్ తీసుకోవాలంటే డొనేషన్లు బుక్స్‌కు సపరేటు యూనిఫామ్‌కు సపరేట్ అని ఐఐటి ఫౌండేషన్ కు వేరే ఫీజు అని ఇలా రకరకాల కోర్సులు బ్రోచర్స్ తో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పేద విద్యార్థి తల్లిదండ్రులను ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఆసరాగా చేసుకొని కాసులు వసూలుకు పాల్పడుతున్న విద్య హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి అక్రమా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై దాడులు నిర్వహించి పర్మిషన్ లేనటువంటి విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చేయాలని చెప్పని ఎఐఎస్‌ఎఫ్ అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా సమితి డిమాండ్ చేస్తుంది. జిల్లా సహాయ కార్యదర్శి మారుపాక లోకేష్, జిల్లా సమితి సభ్యులు చందు భువనగిరి మండల నాయకులు అరుణ్ కుమార్, సుమన్, మనీ పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు:** అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలివెల గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. గ్రామంలో సిసి రోడ్లతో పాటు డ్రైనేజీలు చేపట్టాల్సిన ప్రాంతాలను, ఇళ్లపై నుండి వెళ్తున్న విద్యుత్ తీగలను పరిశీలించారు. పలివెల నుండి ఊకొండి వెళ్లే రహదారిని, పలివెల నుండి చీకటిమామిడి వెళ్లే రహదారిని పరిశీలించారు. గ్రామంలో వున్న ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రాథమిక పాఠశాలలో చదువుల నాణ్యత పెంచాలని ప్రభుత్వ ఉపాధ్యాయులకు సూచించారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఫర్నిచర్ లైట్లు ఫ్యాన్లు లేవని గౌరవ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఫర్నిచర్ ఇప్పించే బాధ్యత నాదని, సామాజిక బాధ్యతతో లైట్లు ఫ్యాన్లు మీరే ఇప్పించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు ,అధికారులు పాల్గొన్నారు.

## అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వంగూర్ :** కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి అనారోగ్యంతో గురువారం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సదగొడు గ్రామానికి చేరుకొని పాండురంగారెడ్డి పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు మనోధైర్యం కల్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయనతో పాటు రాష్ట్ర వ్యవసాయ కమీషన్ సభ్యులు కెవిఎన్‌రెడ్డి, కల్వకుర్తి మార్కెట్‌వైస్‌చైర్మన్ పండిత్‌రావుతోపాటు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రీడలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** తెలంగణ ప్రభుత్వం క్రీడల పట్ల ప్రత్యేక దృష్టితో క్రీడా నైపుణ్యాలను పెంపొందింస్తున్నదని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గురువారం మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో మంత్రి నివాసంలో తెలంగాణలోని స్పోర్ట్స్ స్కూల్లో నాలుగో తరగతి విద్యార్థిని విద్యార్థులకు అడ్మిషనకు వాల్ పోస్టర్‌ను మంత్రి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి వెంకటేష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్‌నెస్‌లేని స్కూల్ బస్సులు సీజ్‌చేయాలి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఫిట్‌నెస్‌లేని స్కూల్‌బస్సులను వెంటనే సీజ్‌చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్ డిమాండ్‌చేశారు. గురువారం పిడిఎస్‌యు విద్యార్థిసంఘం ఆధ్వర్యంలో కల్వకుర్తి ఆర్‌టిఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తిపరిధిలోగల ప్రైవేట్‌స్కూల్ బస్సులను తనిఖీ నిర్వహించిఫిట్‌నెస్‌లేని బస్సులను సీజ్‌చేయాలని, ఆవిద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు సాయి, కార్తీక్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ యాజమాన్యాల ఫీజుదోపిడీని ఆరికట్టాలి





**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కార్పొరేట్ విద్యతో వేలకు వేలు ఫీజులు వసూలుచేస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణజాగృతి జిల్లా అధ్యక్షుడు టిఆర్ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు దారమోనిగణేష్ డిమాండ్ చేశారు. గురువారం ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను బోధించే ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుల విద్యార్హతను చూడాలన్నారు. పాఠశాల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని, సామర్థ్యంలేని బస్సులను నడుపుతున్న ప్రైవేట్‌బస్సులను సీజ్‌చేసి ఆపాఠశాలలపైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యారంగంపైన కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే విద్యాశాఖమంత్రిని నియమించాలన్నారు. అదేవిధంగా బకాయిపడ్డ ఫీజురీయింబర్స్‌మెంట్‌ని విడుదల చేయాలని, ఒక్కొక్క కళాశాలలో ఫీజురీయింబర్స్‌మెంట్ కోట్ల రూపాయలు పెండింగ్‌పడటంతో విద్యావ్యవస్థ నాశనమైందన్నారు. అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి కళాశాలలు దిగజారాయని ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ని విడుదలచేసి విద్యావ్యవస్థను కాపాడాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తెలంగాణజాగృతి జిల్లా ఉపాధ్యక్షులు శేఖర్‌గౌడ్, పెరుమాళ్లకృష్ణ, పరుషరాములు, సైదులు, రాకేష్ పాల్గొన్నారు.

## ప్రమాద బరితంగా హైవోల్జేజ్ ఇనుప స్తంభాలు



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల మున్సిపాలిటీ 20 వార్డు సర్దార్ వల్లభాయ్ పటేల్ నగర్‌లో దత్త మందిరం దగ్గర ఉన్న 11 కెవి హై వోల్జేజ్ పవర్ సప్లై లైన్ ఇంకా ఇనున స్తంభలే ఉండటంతో దాని చుట్టూ చెట్లు పెరగడంతో ముందే వర్షాకాలం ఉండడంతో అక్కడి ప్రజలు ఎప్పుడూ ఏమవుతుందో అని భయాందోళనకు గురువుతున్నారు. మరి ఈ సమస్యను ఎపుడు పరిష్కారిస్తారో తెలయడం లేదు. సంబంధిత అధికారులు వచ్చి చూసి వెళ్లిపోవడం తప్ప అక్కడ ఉన్న ఇనుక స్తంభాన్ని మార్చి సిమెంట్ స్తంభాలు మాత్రం ఏర్పాటు చేయడం లేదు. అలాగే ఎస్‌విపి నగరలో కొన్ని ఇనుప స్తంభాలు అలాగే ఉన్నాయి. దాని పైనే విద్యుత్తు వైర్లు చాలా దగ్గరగా ఉంటూ గాలి వస్తే అ ఇను ప స్తంభానికి తగిలి ప్రమాదం జరిగే విధంగా ఉన్నాయి. వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలు అమార్చే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ చైర్మన్ వార్డు కౌన్సిలర్, సంబంధిత అధికారులను కోరుతున్నాం.

## జడ్చర్లలో ఘనంగా రక్త దాతల దినోత్సవం




**ప్రజాపక్షం/జడ్చర్ల :** ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా కోహన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ ఎఫ్‌డిఎఫ్ యూనిట్ 2 పోలేపల్లి, జడ్చర్ల, జిల్లా బ్లడ్ బ్యాంక్ ప్రతినిధుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరానికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ మిడ్జిల్ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శివకాంత్ ముఖ్య అతిథిలుగా హాజరు అయ్యి యాజమాన్యని అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ రక్త దాతలే ప్రాణదాతలని ప్రతి ఆరు నెలలకోసారి రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని అదేవిధంగా రక్తం అత్యవసరం ఉన్న రోగులకు ప్రాణదాతలుగా నిలుస్తారని ఈ కార్యక్రమం నిర్వహించిన సంస్థకు అభినందనలు తెలిపారు. డా॥ శివకాంత్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేయడం వల్ల రక్తదానం చేసే వారికి కలిగే ఆరోగ్య ప్రయోజనాలు చాలా ఉన్నాయని అపోహలు వీడి రక్తదానం చేయాలని సూచించారు. తదుపరి అత్యధిక సార్లు రక్తదానం చేసిన వ్యక్తి హెచ్‌ఆర్ సచిన్‌ను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలోలో కోహాన్స్ సంస్థ ప్రతినిధులు ఓబుల కృష్ణా రెడ్డి, శివ కుమార్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, లలయ్యా, కిషోర్ కుమార్, హెచ్‌ఆర్ సచిన్ ఇతరులు పాల్గొనడం జరిగింది.

## డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** జిల్లా ఎస్పి యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు గురువారం నారాణపేట జిల్లా ఎస్పి కార్యాలయంలోని ట్రైనింగ్ సెంటర్ ఎంటిఒ, ఆర్‌యస్‌ఐ శివ శంకర్ ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంటిఒ మాట్లాడుతూ. జిల్లా పోలీస్ స్టేషన్లలో పెట్రోల్ కార్ విధులు నిర్వర్తించే వాహన డ్రైవర్లు పెట్రోలింగ్ వాహనాన్ని నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండాలని రాత్రి పెట్రోలింగ్ చేసే సమయంలో తమకు కేటాయించిన పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్విరామంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, ముందస్తు నేరాలు జరగకుండా చూడాలని సైరన్ వేసుకుంటూ పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వాహనాల మెకా నిజం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీసు మోటార్ వాహన డ్రైవర్లు, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.



# పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

### రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీహరి



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నర్వ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నర్వ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. విన్నటి నర్వ 18 నెలలలో రూపురేఖలు మార్చి అభివృద్ధి చేశామని తెలిపారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా మూడు కోట్లు ఇందిరమ్మ క్యాంటీన్, అంబులెన్స్‌కు ఇచ్చామని తెలిపారు. నర్వ మండలంలో 5.25 ఎకరాలలో ఇంటర్మీడియట్ కాలేజీ, క్రీడా గ్రౌండ్ తయారవుతుందన్నారు. అర్హులైన వారందరికీ ఇండ్లు ఇస్తామని మంత్రి తెలిపారు. ఇప్పటికే రుణమాఫీ చేశామని, పెన్షన్లు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవాలని ఇది మంచి అవకాశం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరిని ఆదుకుంటుందని, ఇప్పటికే చాలా మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. మహిళలకు బస్సులలో ఉచితంగా ప్రయానించుటకు మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మహిళలకు పెద్దపీట వేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మండలాన్ని ఇంకా అభివృద్ధి చేస్తానని ఐదు సంవత్సరాలలో రూ. 150 కోట్లు తెచ్చి నర్వను అగ్రగామిగా నిలబెడతామన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల ప్రోసీడింగ్స్ కాఫీలను అందజేశారు. నర్వ మండలం 139, మరికల్ మండలానికి 33 మంది లబ్ధిదారులకు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి అందజేశారు. అనంతరం కళ్యాణలక్ష్మీ షాదీ ముబారక్ చెక్కులను మంత్రి, పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ ఇండ్లు లేని వారిని గుర్తించి ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు విడుదలైన వారికి ఇస్తున్నామని ఏ ప్రభుత్వం ఇవ్వలేని విధంగా రాష్ట్రంలో ఇంటి నిర్మాణాలు జరుగుతాయని తెలిపారు. నాలుగు విడతలలో రూ.5లక్షలు ఇస్తున్నామని ఇంటి నిర్మాణాలు త్వరగా స్టార్ట్ చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ శైలేష్ పిడి హౌసింగ్, శంకర్, డిఇ హరికృష్ణ, తహసీల్దార్ మల్లా రెడ్డి, రాంకోటి, చెన్నయ్య సాగర్ , మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎంపిడిఒలు , టి.శ్రీనివాస్, కొండన్న, నంగి దేవేందర్ రెడ్డి, పోలీస్ చంద్ర శేఖర్ రెడ్డి, పోలీస్ జగన్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### కోదండపూర్ నిర్వాసితులకు కేటాయించే స్థలాన్ని

## అన్ని వసతులతో పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి :** కోదండపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ కింద కేటాయించే స్థలాన్ని అన్ని వసతులతో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ కిద వల్లూరు, ఉదండపూర్, తుమ్మల కుంట తండా, రేగడి పట్టి తండా, చిన్నగుట్ట తండా, శామ గడ్డ తండా, ఒంటి గుడిసె తండా, పోలేపల్లి వ్యవసయ క్షేత్రంలో ఇండ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు, అవార్డు అందుకున్న వారందరికీ పునరావాసం కింద మూడు వందల గజాల స్థలం త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. అక్కడ నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ స్కూల్, అంగన్వాడీ, ఫంక్షన్ హాల్ వంటి ఇతర మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తయ్యేలా పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మోహన్ రావు, స్పెషల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




## పోరాటాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** పోరాటాలచరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు కొమ్ముభరత్ అన్నారు. గురువారం తాండూరు మండలం యాదిరెడ్డిపల్లి గ్రామ సిపిఐశాఖ మహాసభ బుధవారం రాత్రి ఎర్రమశన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు కొ మ్ము భరత్ మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. కేంద్రంలో అధికారం లో ఉన్న బిజెపి నేడు ఆపరేషన్ కగార్‌పేరుతో అడవులను మావోయిస్టులను ధ్వంసం చేస్తుందని హత్యాకాండకు పాల్పడుతుందని, నరమేధానికి పాల్పడుతూ గిరిజనులను హతమారుస్తుందన్నారు. అడవులలో ఉన్న సిరిసంపదను ఆదాని, అంబానిలకు కట్టబెట్టేందుకే ఈచర్యలకు పాల్పడుతుందన్నారు. తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ ఆరుగ్యారంటీలను అమలుచేయడం లేదన్నారు. రైతుభరోసా డబ్బులు రైతులఖాతాల్లో వేసి ఖర్చులకాలం వ్యవసాయసీజన్‌దృష్టిలో పెట్టుకొని పూర్తిస్థాయిలో అమలుపర్చాలని డిమాండ్‌చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి ఉద్యోగ అవకాశాలు, రాజీవ్ యువవికాసం పథకంనువెంటనే అమలు పర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐమండల కార్యదర్శి కుత్బుద్దీన్, సైదులు, రామాంజనేయులు, ఇమామ్, లక్ష్మ మ్మ బాలమ్మ, నాగమ్మ, మల్లేష్, స్వప్న, శివజ్యోతి, రాములు, చంద్రయ్య, భీమయ్య పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను కేంద్రం నిర్వీర్యం



**ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ ప్రతినిధి :** కార్పొరేట్ అధిపతులకు దాసోహమై అనేక పోరాటాలతో సాధించుకున్న కార్మికచట్టాలను కేంద్ర ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేస్తుందని ఎఐటియుసి రాష్ట్ర ఉపప్రధానకార్యదర్శి ఎం.నర్సింహ్మా అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని లక్ష్మణాచారిభవనంలో ఎఐటియూసి నాగర్‌కర్నూల్ జిల్లా విస్తృతకౌన్సిల్ సమావేశం కిరణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎఐటియుసి రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా హాజరై మాట్లాడుతూ కార్మికచట్టాలను నిర్వీర్యంచేస్తూ కార్పొరేట్ అధిపతులకు దాసోహమై వారికి అనుగుణంగా కార్మిక చట్టాలను నాలుగులేబర్‌కోడ్‌లుగా మార్చి కార్మికులయొక్క హక్కులను కాలరాస్తుందన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్ చట్టాలకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సకలజనులు, వివిధరంగాల కార్మికులు సంపూర్ణమద్దతుతెలిపి సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, లక్ష్మయ్య, మల్లేష్, శంకర్, వెంకటస్వామి, నీరజ,స్వాతి, బండిలక్ష్మి పతి, సత్యం, నర్సింహ్మా, వెంకటస్వామి, రామయ్య, శంకర్ పాల్గొన్నారు.

# ప్రతీ దరఖాస్తు పరిష్కరించాలి : కలెక్టర్

### సి.సి కుంట మండలం అమ్మపూర్ రెవెన్యూ సదస్సును సందర్శించిన కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి :** భూ సమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. గురువారం సి.సి కుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామం పంచాయతీలో జరుగుతున్న నూతన ఆర్వోర్ చట్టం భూ భారతి రెవెన్యూ సదస్సును ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులో రైతులతో మాట్లాడి వారి సందేహాలు నివృత్తి చేశారు. సదస్సులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఏ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసి పరిష్కరించాలన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో విచారణ పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రెవెన్యూ గ్రామంలో రైతులు, వ్యవసాయ భూమి, ప్రభుత్వ తదితర పూర్తి వివరాలతో విలేజ్ ప్రొఫైల్ తయారు చేయాలని తహసీల్దారును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్లన్న, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

#### విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

సి.సి కుంట మండలం ఉంద్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి గురువారం సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి విద్యా ప్రమాణాలు పెంపొందించాలని కలెక్టర్ అధ్యాపకులకు సూచించారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న సంసిద్ధత కార్యక్రమాలు కలెక్టర్ పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో 4,5 వ తరగతి విద్యార్థిని విద్యార్థులచే తెలుగు, ఇంగ్లీష్ పాఠ్యాంశాలు చదివించారు. నోట్స్ బుక్‌లో సంసిద్ధతలో భాగంగా రాసినవి పరిశీలించారు. ఇంగ్లీష్ స్పెల్లింగ్‌లు విద్యార్థులను అడిగారు. 10వ తరగతిలో పాఠ్యాంశాలు, బోధన గురించి ద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కష్టమైన సబ్జెక్ట్‌లపై దృష్టి సారించి బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థు లు మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించాలని అన్నారు. మళ్లీ 15 రోజుల తర్వాత వస్తానని విద్యార్థులలో విద్య ప్రమాణాలు పెంపొందించాలని సూచించారు. కల్టెర్ వెంకట ఎంఇఒ మురళీ , కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పండుగలా వ్యవసాయం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** జిల్లాలో పండుగలా రైతులు వ్యవసాయ పనులు చేస్తున్నారని, రాష్ట్రప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకొని జిల్లాలో గణనీయంగా పంట విస్తీర్ణత పెరిగిందని జిల్లా కలెక్టర్‌బదావత్‌సంతోష్ తెలిపారు. జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు క్రిమిసంహారక మందులను జిల్లా వ్యవసాయ అధికారులు రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులకు రాష్ట్రప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతోపాటు ఈసంవత్సరం వర్షాలుకూడా ముందుగారావడంతో జిల్లాలో అన్నదాతలు సంతోషదాయకంగా వ్యవసాయపనుల్లో నిమగ్నమయ్యారన్నారు. గతవానకాలంలో 4లక్షల80వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేయగా ప్రస్తుత వానకాలంలో 5లక్షల92వేల ఎకరాల భూముల్లో వివిధ రకాల పంటల సాగుకు రైతాంగం సిద్ధం చేయడం జరిగిందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 2025–26 వానాకాలం సీజన్‌కుగాను గురువారం సాయంత్రం వరకు రైతుభరోసా కింద ఎకరానికి రూ.6వేలచొప్పున 2,47,112మంది రైతులకు 243,55,41,698 రూపాయలను రైతుల ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు. జిల్లాలో మిగిలిన రైతులకు మరో వారం రోజులలో విడతలవారిగా డబ్బులు జమచేయడం జరుగుతుందని, ఇంకా బ్యాంకు అకౌంట్‌లో ఎటువంటి తప్పులు ఉన్నా, కొత్తగాపాస్‌బుక్ జారీ అయినను అవసరమైనపత్రాలను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను ఈనెల 20వతేదిలోపు సంప్రదించాలన్నారు.

## విద్యార్థులకు అండగా ఉప్పల చారిటబుల్‌ట్రస్టు



**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు విద్యనభ్యసించడానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ బాధ్యత తీసుకొని అండగా నిలిచారు. తలకొండపల్లి మండలం కోరంతకుంట తండా నిరుపేద కుటుంబానికి చెందిన చరణ్ నాయక్, చింటు అనే విద్యార్థులను ఇద్దరి అన్నదమ్ముల చదివించే బాధ్యతను తీసుకున్నారు. అదేవిధంగా కల్వకుర్తి మండలం తిమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్ అనేవిద్యార్థి బాధ్యతనుకూడా తీసుకున్నారు. దీంతో విద్యార్థుల కుటుంబసభ్యులు ఉప్పలవెంకటేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే నిర్మాణం ప్రారంభించాలి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**ప్రజాపక్షం /వనపర్తి ప్రతినిధి :** ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణం ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం కొత్తకోట మండలంలోని వడ్డేవాట గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలించిన కలెక్టర అనంతరం అదే గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారుల ఇళ్లను సందర్శించారు. కంసలి పార్వతమ్మ భర్త కంసాలి సొంతన్న ఇంటిని సందర్శించిన కలెక్టర్ ఇల్లు మంజూరు అయినప్పటికి నిర్మాణం ఇంకా ఎందుకు ప్రారంభించలేదని అడిగారు. ప్రస్తుతం ఆషాడ మాసం నడుస్తుంది. రోజులు బాగాలేవు అందువల్ల ప్రారంభించలేదని పార్వతమ్మ సమాధానం ఇచ్చింది. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, త్వరగా ప్రారంభిస్తే బేస్మెంట్ పూర్తికాగానే అందరితో పాటు మొదటి విడత లక్ష రూపాయలు ఖాతాలో జమ అవుతాయన్నారు. నిర్మాణం అయ్యే నాటికి విడతల వారిగా డబ్బులు ఖాతాలో జమ అయిపోతాయన్నారు. ఆషాడం అని రోజులు బాగా లేవవని మూఢ నమ్మకాలతో కాలాయాపన చేయవద్దని, గడువు లోపల ఇంటి నిర్మాణం ప్రారంభించకుంటే మంజూరు అయిన ఇళ్లు సైతం రద్దు అవుతాయని తెలియజేశారు. ప్రభుత్వం ఇచ్చిన సదవాకాశాన్ని మూఢ నమ్మకాలతో కాలరాసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో ఇందిరమ్మ ఇంటికి జిల్లా కలెక్టర్ భూమి పూజ చేశారు. వెల్టూరు గ్రామ పంచాయతీ భవనంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులతో గ్రామ సభ ఏర్పాపాటు చేశారు. ఈ గ్రామ సభలో కలెక్టర్ మాట్లాడుతూ వెల్టూరు గ్రామానికి 34 ఇళ్లు మంజూరు అయ్యాయని లబ్ధిదారులు అందరూ త్వరగా నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. అనంతరం పదవ తరగతిలో ఉత్తీర్ణత పొందిన ప్రతి అమ్మాయిని కళాశాలల్లో చేర్పించేందుకు పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామ పంచాయతీ కార్యదర్శి బాధ్యతలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు , ఏకరూప దుస్తులు విద్యార్థులకు పంపిణీ చేశారు.

## ధర్మ పరీరక్షణ కోసం రథయాత్ర



**ప్రజాపక్షం/ మద్దూర్ :** దామగిద్ద, మద్దూర్, కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో హిందూ ధర్మ పరీరక్షణ కొరకై రథయాత్రి పర్యటనలు రెండు రోజులుగా బ్రహ్మండగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా పూజ్యులు శంకర్ స్వామి జీ తెలంగాణ సాదు సంత్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు, సామాజిక సమరసాత కార్యక్రమాల వీహెచ్చి ప్రాత మార్గదర్శకులు, రవీందర్ వికారాబాద్ జిల్లా గోసేవ ప్రముఖ్ నారాయణ, పుండరీకం, బలవరాజ్, వెంకటయ్య, జగదీష్, రఘుపతి, ధర్మ జాగరణ సమితి అది జంభవ పాలమూరు విభాగ్ , ప్రముఖ్, ఆధ్వర్యంలో ఆర్‌ఎవఎస్ ప్రముఖ్ ల విజయ్, ప్రశాంత్, సిపిరి హరీష్, సాకాలి భాస్కర్, రొయ్యలి నర్సింహా, వెంకటేష్, బీంసేన్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వాకిటికి ఘనంగా సన్మానం

**ప్రజాపక్షం/ మక్తల్ :** మక్తల్ శాసనసభ్యులు డాక్టర్॥ వాకిటి శ్రీహరి తెలంగాణ రాష్ట్ర నూతన రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ డవలప్‌మెంట్ మత్సశాఖ క్రీడా యువజన సర్వీసుల శాఖల మంత్రిగా నియమితులై పదవి బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా తెలంగాణ బిసి ఐక్యవేదిక రాష్ట్ర శాఖ సభ్యులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి వారికి సన్మానం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ బిసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.రామాంజనేయులు గౌడ్ , రాష్ట్ర కోశాధికారి జి.రంగప్ప యాదవ్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.లింగం గౌడ్, నారాయణపేట జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ , ముదిరాజ్ జిల్లా కార్యదర్శి వి.రవికుమార్, నారాయణపేట నియోజకవర్గ నాయకులు, అమర్, రామాంజనేయులు, మక్తల్ నియోజకవర్గ కన్వీనర్ సత్య నారాయణ ,యువత అధ్యక్షులు కె. అశోక్ గౌడ్, యువత ప్రధాన కార్యదర్శి బంగారు తిరుమలేష్, కుర్వ నవీన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

# రోహిత్ కాదు.. కోహ్లీ రిటైర్మెంట్ వల్లే టీమిండియాకు నష్టం

## ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ జెఫ్రీ బాయ్‌కాట్ ఆసక్తికర వ్యాఖ్య

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ రిటైర్మెంట్‌పై ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ జెఫ్రీ బాయ్‌కాట్‌ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మానసికంగా అలసిపోవడంతోనే కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించాడని ఓ దినపత్రికకు రాసిన కాలమ్‌లో పేర్కొన్నాడు. కోహ్లీ రిటైర్మెంట్ టీమిండియాకు కోలుకోని దెబ్బ అని అ భిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ కూడా రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ.. కోహ్లీ గైర్హాజరే టీమిండియా కు నష్టం చేస్తుందని అభి ప్రాయపడ్డాడు. కోహ్లీ గై ర్హాజరీ ఇంగ్లాండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో టీమిండి యా విజయవకాశాలను ప్రభావితం చేస్తుందన్నా డు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవ్వడం టీమిండియా విజయవకాశాలపై ప్రభావం చూపు తుంది. ముఖ్యంగా ఇంగ్లాండ్ పర్యటనలో కోహ్లీ లేకుండా ఆడటం టీమిండియా సవాలే. ఎందు కంటే కోహ్లీ మూడు ఫార్మాట్లలో అ త్యుత్తమ బ్యాటర్. గత కొన్నేళ్లుగా భారత్ తీరికలే ని క్రికెట్ ఆడుతోంది. దాంతో విరాట్ కోహ్లీకి తగినంత



విశ్రాంతి లేకుండా పోయింది. దాంతో అతను మానసికంగా అలసిపోయాడు. ఎంత ప్రతి భ, అనుభవం ఉన్నా.. మానసిక ప్రశాంతత లే కుంటే త్వరగా అలసిపోతారు. కోహ్లీ విషయంలో ఇదే జరిగింది. రోహిత్ గొప్ప బ్యాటర్ అయినప్పటికీ అతని టెస్ట్ రికార్డ్ అంత గొప్పగా ఏం లేదు. పైగా అతను కొన్నేళ్లుగా నిలకడలేమి ప్రదర్శన కనబరు స్తున్నాడు. అందుకే రోహిత్ రిటైర్మెంట్ భారత జట్టుకు పెద్దగా నష్టం చేయకపోయినా..కోహ్లీ రిటై ర్మెంట్ టీమిండియాపై తీవ్ర ప్రభావం చూపనుం ది.'అని బాయ్‌కాట్ తన కాలమ్‌లో రాసు కొచ్చా డు. బాయ్‌కాట్ చెప్పిన ట్లుగా గత కొన్నేళ్లుగా టీ మిం డియా తీరిక లేని క్రికెట్ ఆడు తోంది. బ్రాడ్‌కాస్టర్స్, ప్రకటనదా రుల మధ్య తీవ్ర పోటీ నెలకొన దంతో టీమిండియా ఎక్కువ మ్యాచ్‌లు ఆడుతోం ది. ఏడాదిలో 910 నెలలు అంతర్జాతీయ క్రికెట్ ఆడుతుండగా.. మరో రెండు నెలలు ఐపిఎల్ ఆడుతున్నారు. కోహ్లీ.. కొన్ని సిరీస్‌లకు దూరంగా ఉ న్నా.. 8 నెలల పాటు క్రికెట్ ఆడేవాడు. ముఖ్యం గా టెస్ట్ సిరీస్‌లు, ఐసిసి టోర్నీలు, ఐపిఎల్ వంటి వాటిని ఖచ్చితంగా ఆడేవాడు. ఈ క్రమంలోనే వి రాట్ కోహ్లీ ఆట గాడి తప్పింది. వరుస వైఫల్యాలతో అతను తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. చివరకు ఆట నుంచి తప్పుకున్నాడు.

## నెట్స్‌లో కరుణ్ నాయర్‌కు గాయం!

ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్ ప్రారంభానికి ముందే టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్ కరుణ్ నాయర్ నెట్స్‌లో గాయపడినట్లు తెలుస్తోంది. నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో ప్రసిద్ధ కృష్ణ వేసిన బంతిని అంచనా వేయడంలో కరుణ్ విఫలమయ్యాడు. దీంతో ఆ బంతి అతడి పక్కటె ముకలకు బలంగాతాకింది. దీంతో కాసేపటివరకు అతడు ఇబ్బందిపడ్డాడు. కానీ తర్వాత మరోసారి బ్యాటింగ్ ప్రాక్టీస్ ప్రారంభించాడు. టీమిండియాకే కాకుండా, కరుణ్ నాయర్‌కు ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్ ఎంతో కీలకం. కరుణ్ చివ రిసారిగా భారత్ తరపున 2017లో టెస్ట్ మ్యాచ్ ఆడాడు. దేశవాళీల్లో అద్భుతం గా రాణించి సెలక్టర్ల దృష్టిలో పడ్డాడు. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత తిరిగి టీమ్ ఇండియాకు పునరాగమనం చేస్తున్నాడు. అతడికి కౌంటీ క్రికెట్ ఆడిన అను భవం కూడా ఉంది. 2023, 2024 కౌంటీ ఛాంపియన్షిప్ సీజన్లలో నార్తాంప్టన్ షైర్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 10 మ్యాచ్ 736 పరుగులు చేశాడు. ఇందులో చిరస్మరణీయమైన ఓ డబుల్ సెంచరీ కూడా ఉంది. అలాగే 2024–25 రంజీ ట్రోఫీలో విదర్భకు ప్రాతినిధ్యం వహించిన అతడు 16 ఇన్నింగ్స్ ల్లో 863 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, రెండు అర్ధ సెంచరీలు న్నాయి. విజయ్ హజారే ట్రోఫీలో ఎనిమిది ఇన్నింగ్స్లో ఏకంగా 779 పరుగులు చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 202425లో (టీ20) ఆరు ఇన్నింగ్స్‌ల్లో 255 పరుగులు చేశాడు.



## పటౌడీ ట్రోఫీ పేరు మార్పులో.. నా ప్రమేయం లేదు : సచిన్



ఇంగ్లాండ్ వర్సెస్ ఇండి యా మధ్య జరిగే పటౌడీ ట్రోఫీని అండర్సన్ టెండూల్కర్ గా పేరు మార్చడంపై తీవ్ర దుమారం రేగుతోంది. పటౌ డీ పేరును ఎందుకు తొలగించార ని మాజీ క్రికెటర్ల కపిల్ దేవ్, రాహుల్ ద్రవిడ్‌లు ప్రశ్నించా రు. ఈ నిర్ణయాన్ని తప్పుబట్టా రు. ఇది సరికాదని అ భిప్రాయ పడ్డారు. ఈ వివాదాంపై తాజాగా సచిన్ టెండూల్కర్ స్పందిం చారు. ఇంగ్లాండ్‌తో తొలి టెస్ట్‌కు ఒక రోజు ముందు సచిన్ తన అభిప్రా యాన్ని వెల్లడించారు. ఈ పేరు మార్పు విషయంలో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. ఇసిబి, బిసిసిఐ కలిసి తీసుకున్న నిర్ణయమని తెలిపారు. 'పటౌడీ ట్రోఫీ పేరు మార్పు నిర్ణయంలో నా ప్రమేయం లేదు. బిసిసిఐ, ఇసిబి కలిసి తీసుకున్న నిర్ణయం. ఆ తర్వాతే నాకు సమాచారం ఇచ్చారు. పటౌడీ కుటుంబం భారత క్రికెట్‌కు చేసిన కృషిని నేను గౌరవిస్తాను. పటౌడీ వారసత్వాన్ని సజీవంగా ఉంచాలి. అందుకోసం నేను చేయగలి గినదంతా చేశాను. ఈ వివాదం తలెత్తిన తర్వాత నేను పటౌడీ కుటుంబం తో మాట్లాడాను. ఐసిసి చైర్మెన్ జైషాతో పాటు బిసిసిఐ, ఇసిబి అధికారు లతో చర్చలు జరిపాను. పటౌడీ వారసత్వాన్ని కొనసాగించడానికి ఏదో ఒకటి చేయాలని వారికి సూచించాను. ఈ చర్చల తర్వాత పటౌడీ పేరును ఈ సిరీస్‌తో ఉండేలా.. విజేత కెప్టెన్‌ను పటౌడీ మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను అందజేయాలని నిర్ణయించారు. నేను ఎప్పుడూ సీనియర్ ఆటగాళ్లను గౌరవిస్తాను.'అని సచిన్ టెండూల్కర్ చెప్పుకొచ్చారు.

# వ్యవసాయం




## వేడిని తట్టుకునే కంది

స్పీడ్ బ్రీడింగ్ టెక్నిక్ ఉపయోగించి ఐసిపివి 25444 అనే వేడిని తట్టుకునే కంది (తుర్ దాల్) రకాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ రకమైన కంది మొక్క 45 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలను తట్టుకోగలుగు తుంది. ఇది భారతదేశంలోని వేడి, పాక్షిక శుష్క ప్రాంతాలకు అనువైనది. నీటి కొరత, వేడి కార ణంగా ఖరీఫ్ తర్వాత సాగు చేయని 12 మిలియన్ హెక్టార్ల వరి బీడులను ఉపయోగించుకోవడానికి ఈ వంగడం ద్వారా సాధ్యమవుతుంది. అంతేగాక, ఈ రకం సంవత్సరానికి నాలుగు పంటలనిస్తుంది. అభి వృద్ధి సమయాన్ని 15 నుండి 5 సంవత్సరాలకు తగ్గి స్తుంది. దిగుబడిని 1.1–1.2 నుండి 2 టన్నులు/హె క్టారుకు రెట్టింపు చేస్తుంది. పంట సమయాన్ని సాధా రణ 6–7 నుండి 4 నెలలకు పరిమితం చేస్తుంది. దేశీయ ఉత్పత్తిలో 1.5 మిలియన్ టన్నుల లోటును తగ్గిం చడం ద్వారా, సంవత్సరానికి 800 మిలియన్ డాలర్లు ఖర్చయ్యే భారతదేశ కంది దిగుమతులను ఇది గణనీయంగా తగ్గించగలదు. పప్పు ధాన్యాల గురించి: భారతదేశం ప్రపం చంలోనే అతిపెద్ద పప్పు ధాన్యాల ఉత్పత్తిదారు మాత్రమేగాక, వినియోగదారుకూడా. అందుకు కందిపప్పు దిగుమతులు కూడా ఎక్కువే. కాగా, దిగుమతులను 2028 నాటికి పూర్తిగా నిలిపివేసే రీతిలో ఈ కొత్త కంది వంగడాన్ని సృష్టించారు. ఇలావుంటే, పప్పు ధాన్యాలు ఉత్పత్తి చేసే మొదటి రాష్ట్రాలుగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజ స్థాన్ పేరు సంపాదించాయి. కందిపప్పు మన దేశంలో ప్రోటీన్ అధికంగా ఉండే ఒక ముఖ్యమైన పప్పుదినుసు. ఇది ఉష్ణమండల, పాక్షిక శుష్క ప్రాంతాలలో బాగా పెరుగుతుంది. భవిష్యత్తులో ఈ రకం కందిపప్పు భారత మార్కెట్లను ముంచెత్తుతాయని శాస్త్రవేత్తలు ఆశాభావంతో ఉన్నారు.

## ఆహార భద్రతపై దృష్టి..

ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోతున్న ఆహార కొరతపై ఐక్యరాజ్య సమితి దృష్టి సారిం చింది. 1983లో నెలకొల్పిన ఆహారం, వ్యవ సాయ సంస్థ (ఎఫ్ఎఒ) ద్వారా మొక్కల జన్యు వనరులు (పిజిఆర్) అభివృద్ధి, పరిరక్షణకు చర్యలు చేపడుతున్నది. జన్యు వనరులకు సంబంధించిన విషయాలపై ప్రత్యేకంగా చర్చించ డానికి, నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వాలకు ఇది ప్రాథమిక శాశ్వత అంతర్జాతీయ వేదికగా మారింది. ఎఫ్ఎఒ కాలక్రమేణ వివిధ దేశాలకు విస్తరించింది. ఇప్పుడు అది ప్రపంచ పునరుత్పా దక ఇంధన సంస్థ (జిఆర్ఎఫ్ఎ)తో కలిసి పని చేస్తున్నది. అందులోని అన్ని రంగాలతోనూ ఎఫ్ ఒలో భారత్‌సహా 179 సభ్యదేశాలు ఉన్నాయి. ఆహా రం, వ్యవసాయం కోసం మొక్కల జన్యు వనరులపై అంతర్జాతీయ ఒప్పందం కుదరడంతో ఎఫ్ఎఒ ప్రధాన భూమిక పోషించింది. ప్రపంచాన్ని పోషించే పంటల వైవి ధ్యానికి రైతుల అపారమైన సహకా రాన్ని యావత్ ప్రపంచం గుర్తించడానికి కృషి చేసింది. రైతులు, మొక్కల పెంపకం దారులు, శాస్త్రవేత్తలకు మొక్కల జన్యు పదార్థాలను అందుబాటులోకి తీసుకురావ



డానికి ప్రపంచవ్యాప్త వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి ప్రధాన లక్ష్యాలతో ఇది పని చేస్తున్నది. స్థూలంగా చె ప్పాలంటే, మొక్కల్లో జన్యుపరమైన మార్పులతో ఆహార ఉత్పత్తులను గణనీయంగా పెంచ డం, భవిష్యత్తులో ఆహార కొరత లేకుండా చూడడం లక్ష్యం గా ఎఫ్ఎఒ పని చేస్తు న్నది. ఎఒ తనవంతు పాత్ర పోషిస్తున్నది. మొక్క, జంతువు, అటవీ, జలచర, సూక్ష్మ జీవులు, అకశే రుకాల జన్యు వనరులు, ఆహారం, వ్యవసాయం కోసం జీవవైవిధ్య విస్తారమైన పరిధిని జిఆర్ఎ ఫ్ఎ కవర్ చేస్తుంది. దానితోపాటు ఎఫ్ఎఒ కూడా తన పరిధిని విస్తరించుకుంటున్నది. ఆహార భద్రత, పోషకాహారం, మానవ ఆరోగ్యం, వాతావరణ మార్పు ల సేకరణ, అనుసరణ , జన్యు వనరులు, ప్రయోజనాల భాగస్వామ్యం వంటి పలు ప్రధాన అంశాలపై పరిశోధనలు, ప్రయోగాలు నిర్వహిస్తున్నది. జిఆర్ఎఫ్ఎ వర్గీక రణ, స్థిరమైన ఉపయోగం, పరిరక్షణ, బయోటె క్నాలజీలపై డిజిటల్ సీక్వెల్ సమాచారం వంటి అనేక అంశాలను కూడా పరిగణలోకి తీసు కుంటున్నది. ఎఫ్ఎ

## ప్రత్యక్ష వ్యవసాయ మార్కెటింగ్..



ఇటీవల కాలంలో పెరుగుతున్న కొత్త ఒరవడిగా ప్రత్యక్ష వ్యవసాయ మార్కెటింగ్‌ను చెప్పుకోవచ్చు. మధ్యవర్తుల అవసరం లేకుండా రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు, ప్రాసెసింగ్ కంపెనీలకు లేదా రిటైలర్లకు విక్రయించే విధానం. ఇది సంప్రదాయ వ్యవసాయ మార్కెటింగ్ పద్ధతిలో ఉండే బహుళ మధ్యవర్తులను తొలగించి, రైతుకు నేరుగా ఆదాయాన్ని పెంచే మార్గంగా పనిచేస్తుంది. ఈ విధానంలో రైతు తన ఉత్పత్తులను నేరుగా మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తాడు. ఉదాహరణకు, రైతు బజార్లు, నేరుగా ఇంటి వద్ద సరఫరా, ఆన్‌లైన్ వేదికలు, కాంట్రాక్టు సాగు వంటి వాటిని ఉపయోగించి రైతు తాను పండించిన ఉత్పత్తిని తానే అమ్ముతాడు. ప్రత్యక్ష వ్యవసాయ మార్కెటింగ్ ద్వారా రైతుకు నేరుగా ఎక్కువ ఆదాయం లభిస్తుంది. మధ్యవర్తులు లేకపోవడం వల్ల అమ్మకాల్లో ధోరణుల గురించి స్పష్టత పెరుగుతుంది. రైతులు మార్కెట్ అవసరాలను అర్థం చేసుకొని దానికి తగ్గట్టు పంటలు పండించేందుకు ప్రేరణ పొందు తారు. ఇలాంటి మార్కెటింగ్ వల్ల వినియోగదారుడికి కూడా లాభం కలుగుతుంది. వారు నేరుగా రైతు నుంచి తాజా ఉత్పత్తులు పొంద వచ్చు. సాధారణంగా ధరలు తక్కువగా ఉంటాయి, మరియు నాణ్య తపై విశ్వాసం ఎక్కువగా ఉంటుంది. అయితే, ప్రత్యక్ష మార్కెటింగ్‌లో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. రైతులకు సరైన రవాణా సదుపాయాలు లేకపోవడం, నిల్వ వసతుల కొరత, మార్కెట్ పరిజ్ఞానం లోపించడం, డిజి టల్ సాంకేతికతపై అవగాహన లేకపోవడం వంటి సమస్యలు ఎదురవు తాయి. ఈ రకమైన మార్కెటింగ్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. రైతు బజార్లు స్థాపించడం, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీలు ఏర్పరచడం, ఇఎన్ఎఎం (ఇనామ్) వంటి ఆన్‌లైన్ మార్కెట్ ప్లాట్ ఫామ్‌లను అందించడం తదితర చర్యలు అవసరం. మొత్తానికి, ప్రత్యేక్ష వ్యవసాయ మార్కెటింగ్ ఒక సమర్థవంతమైన విధానం. ఇది రైతుల ఆదా యాన్ని పెంచే మార్గంగా మాత్రమేగాక, కాకుండా వ్యవసాయ రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కూడా దోహదపడుతుంది.

## రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నీ తక్షణమే అమలు చేయాలి

సిపిఐరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దా నాలన్ని తక్షణమే అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాల్‌నర్సింహ్మా డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్ని ఇతర సాకుల పేరుతో దాటి వేయకుండా వందశాతం అ మలుచేయాలన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతు భరోసా పేరుతో రైతులకు పెద్ద ఎత్తున ఆదుకుంటున్నామని చెబుతుందని కాని మూడువిడుతలుగా రైతుభరోసా పూర్తిస్థాయిలో రైతులకు అందడంలేదని వివిధ కారణాల చేత ప్రభుత్వం రైతు భరోసా రైతులందరికి ఇవ్వడంలేదని ఆ యన విమర్శించారు. రైతు రుణమాఫీ విషయంలో కూడా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో చిత్తశుద్ధి వహించడం లేదన్నారు. నేడు రాష్ట్రంలో రైతాంగం అనేక సమస్యలతో సతమతమవుతుంటే వారిని ఆదు కోవాల్సినటువంటి ఈపరిస్థితుల్లో రైతురుణమాఫీ పూర్తిస్థాయిలో జరిగితే రైతు సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పెబ్బేటి విజయుడు, సిపిఐరాష్ట్రసమి తి సభ్యులు హెచ్.ఆనంద్, సిపిఐరాష్ట్ర సమితిసభ్యులు ఎస్ఎండి ఫయాజ్, వార్ల వెంకటయ్య, కేశవులుగౌడ్, టి.నర్సింహ్మా, ఆర్.ఇంద్ర, కొమ్ముభరత్, పరు షరాం, సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ కార్యదర్శి పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు నెరవేర్చే సంఘం ఎఐటియుసి

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/మందమర్రి :** సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే సంఘం ఎప్పటికైనా ఎఐటియుసి మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్ బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మందమర్రిలోని కెకె 5 గనిపై జరిగిన సమావేశానికి గని ఇంచార్జ్ కంది శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీ గాండ్ల సంపత్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతారామయ్య మాట్లాడుతూ, గుర్తింపు సంఘం ఎన్నికలలో ఇచ్చిన హామీలైన కార్మికుల సొంతింటి కల, ఆదాయంపై ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు గురించి సి అండ్ ఎండితో చర్చించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. విధివి ధానాలపై అధ్యయనం చేస్తామని వారు చెప్పినట్లు పేర్కొన్నారు. అలాగే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి విన్నవించగా, ఆయన స్పందించి ఈ హామీలు అమలయ్యేలా కృషి చేస్తామని చెప్పినట్లు సీతారామయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సెక్యూరిటీ అక్బర్ అలీ, బ్రాంచ్ సెక్రటరీలు శైలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, వైస్ ప్రెసిడెంట్ భీమనాథుని సుద ర్శన్, అసిస్టెం ట్ సెక్రటరీ రాజేశం, ఏరియా నాయకులు పి. బాలయ్య, సివి. రమణ, ఇ. రాజేశ్వర్ రావు, శర్మ, కలవల శ్రీనివాస్, మైన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మతోన్మాదానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజం

## ప్రకృతిసంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారు : బాగం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** బిజెపి దాని అనుబంధ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ అవలంభిస్తున్న మతోన్మాదానికి కమ్యూనిజం మాత్రమే ప్రత్యామ్నాయం అవుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. కొణిజర్లలో గురువారం దొండపాటిభవన్‌లో తోటపల్లి సీతారాములు, చింతల ఆదినారాయణ అధ్యక్ష తన జరిగిన గ్రామశాఖ మహాసభలో ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో పేద ధనిక తేడాలేకుం డా ఎంతో బాధ్యతతో సేవలందిస్తున్న ప్రభుత్వ రంగ సం స్థలను ప్రైవేటుపరం చేస్తూ మోదీ ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆయన విమర్శించారు. భారత దేశ ప్రజలు కష్టంతో దేశంలో అనేక సంవత్సరాలుగా నిర్మిం చబడిన ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఎల్ఐసి, రైల్వే, విమాన విశాఖ ఉక్కు లాంటి లాభాల్లో నడిచే దిగ్గజ సం స్థలను ప్రైవేటు పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెట్టా లని చూస్తున్నారని అటువంటి చర్యలను వెంటనే విర మించుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకా దేశంలోని విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు బిజెపి ప్రభుత్వం దోచిపెడుతుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను చంపుతున్నారని నక్సలైట్లు కూడా భారతదేశ పౌరులేనని అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల తో చర్చలు జరుపుతామన్న బిజెపి ప్రభుత్వం నక్సలైట్లు తో చర్చలు జరపకుండా చంపేయడం రాజ్యాంగ ఉల్లం ఘన అవుతుందని అన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యు లు యర్రా బాబు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో సిపిఐ ప్రజాప్రతినిధులు గెలిపించుకుని బలం పెంచుకుంటేనే పేదప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నా రు. అందుకు తగిన విధంగా ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. 2004లో పార్లమెం ట్‌లో కమ్యూనిస్టు ఎంపిల బలం ఉండటంవల్లనే ఉపాధి హామి, అటవీహక్కుల, సమాచార హక్కు చట్టాలు తీసు కురావడం సాధ్యపడిందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో కి వచ్చి రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మర్చిందని అన్నారు. పేదవాడికి ఇండ్లు ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంవల్లే నిరుపేద కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభలో తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కా ర్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, సిపిఐ సీనియర్ నాయకులు బండారు పుల్లయ్య, బండారు వెంకన్న, కడప బాబు, కో యిన్న వెంకయ్య, గొడ్డుగొర్ల రాంబాబు, గొడ్డుగొర్ల శ్రీ ను, కాల్వకట్ల ప్రసాద్, తండు సోమయ్య, నరసింహారా వు, బొమ్మకంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనం తరం కొణిజర్ల గ్రామశాఖ క్యాదర్శిగా స్వర్ణ రమేష్; సహాయ కార్యదర్శిగా తోటపల్లి సీతారాములు, చింతల ఆదినారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంతో ప్రపంచానికి పెనుముప్పు

## యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల నిరసన, ధర్నా

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల :** వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలు నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సిపిఐ జి ల్లా కార్యదర్శి బి ఆంజనేయులు మాట్లాడుతూ గత 20 నెలలుగా పాలస్తీనా గాజాపై, పది రోజులుగా ఇరాన్ పై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధ దౌర్జన్య ఖాండను వెంటనే ఆ పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ పాలస్తీనా యుద్ధం లో 50వేల మంది మరణించారని లక్షలాది మంది ప్రజ లు నిరాశ్రయులు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గాజా మొత్తం సర్వనాశనం అయ్యిందని లక్షలాది మం ది ప్రజలు నిరాశ్రయులయ్యారు, బందీలుగా చిక్కి కనీస అవసరాలు లేక బిక్కు బిక్కు మంటూ కాలం గడుపుతు న్నారు. విద్యా వైద్య రంగాలు నాశనం అయ్యాయని వ్య వసాయ పారిశ్రామిక రంగాలు పూర్తిగా దెబ్బతినాయని అన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధా లకు ప్రధాన కారణం అమెరికా సామ్రాజ్యవాద అధిప త్యం కోసం ఆయుధాల వ్యాపార విస్తరణ కోసం సహజ వనరుల కోసం అమెరికా చేస్తున్న నియంతృత్వ విధానా లను ప్రపంచం మొత్తం ఖండించాలని అన్నారు. సామ్రా జ్యవాద దేశాలు చేసే ప్రపంచ యుద్ధాల వల్ల శాంతి కను మరుగవుతుందని ఆకలి దారిద్రం పెరిగి సంపద మరిం త కేంద్రీకృతం అవుతుందన్నారు. ప్రపంచ యుద్ధాల పెరుగుదల వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా పెట్రోల్ డీజిల్ ఆహార వస్తువుల ఎగుమతి దిగుమతులపై ప్రభావం చూ పి భారతదేశము కూడా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి అం జనేయులు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నర్సిం హ తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ సంకర ప్రభా కర్ సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు ఎల్కూర్, రంగన్న, ఆశ న్న, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ తదితరులు మా ట్లాడారు ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు కాశిం, ప్రజా ఫ్రంట్ నాగన్న, ఏఐటీయూసీ బైర్ రిక్షా కార్మికులు ప్రభు దాస్ తదితరులు పాల్గొన్నారు.

### హనుమకొండలో....

పాలస్తీనా, ఇరాన్ ప్రజలపై సామ్రాజ్యవాద అమెరికా మ ద్దతుతో ఇజ్రాయిల్ చేస్తున్న మారణ హోమాన్ని, దాడు లను ఆపి శాంతిని నెలకొల్పాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ(ఎం) జిల్లా నాయ కులు రాగుల రమేష్, సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు గంగుల దయాకర్, ఆర్.ఎస్.పి జిల్లా నాయకులు కౌడ గాని శివాజీలు డిమాండ్ చేశారు. గురువారం హనుమ కొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్), ఆర్.ఎస్.పీ వామ పక్ష పార్టీల ఆధ్వర్యంలో పాలస్తీనా, ఇరాన్ దేశాలపై ఇజ్రాయిల్ దేశం చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని నిరసన ధర్నా చేపట్టాయి. ఈ నిరసన ధర్నాకు సిపి ఐ నాయకులు తోట బిక్షపతి, సిపిఐ(ఎం) నాయకులు వెంకట్‌ల అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఐ(ఎం) జిల్లా నాయకులు రాగుల రమేష్, సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు దయాకర్, ఆర్.ఎస్.పీ జిల్లా నాయకులు శివాజీలు పాల్గొని మాట్లా డారు. ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రా ష్ట్ర కౌన్సిల్ సభ్యులు మండ సదాలక్ష్మి , ఎన్ ఎ స్టాలిన్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, లక్ష్మ ణ్, బత్తిని సదానందం తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్‌లో...

ఇరాన్ పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దురహంకార దా డులను ఖండించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, ఎంసిపిఐ(యు) జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, సిపిఎం జిల్లా నాయకులు వల్లదాస్ దుర్గయ్య లు డిమాండ్ చేశారు. గత ఐదు రోజులుగా ఇరాన్ దేశం పై అమెరికా సామ్రాజ్యవాద దత్తపుత్రుడు ఇజ్రాయిల్ చేస్తున్న దురహంకార దాడులకు నిరసిస్తూ రాష్ట్ర వామ పక్ష పార్టీ పిలుపు మేరకు చేపట్టే నిరసన కార్యక్రమాలలో భాగంగా గురువారం వరంగల్ అండర్ బ్రిడ్జి బస్టాండ్ సెంటర్లో ఆ పార్టీల నాయకులు కార్యకర్తలు ధర్నా చేసి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమో క్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాల రాజు అధ్యక్షత వహించగా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ కా ర్యదర్శి అక్కినపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### నిజామాబాద్ అర్బన్

ప్రపంచంలో పేదరికం, దారిద్రం, నిరుద్యోగం పెరుగు తుంటే వాటిని తగ్గించటానికి ప్రయత్నం చేయకుండా అమెరికా తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవడం కోసం పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ వాతావరణాన్ని పెంచి పోషిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. గురువారం అమెరికా సామ్రాజ్యవాదం యొక్క అండతో ఇజ్రాయిల్ ఇరాన్‌పై చేస్తున్నదాడులను ఖండిస్తూ వామ పక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం దర్నా చౌక్‌లో అమెరికా ఇజ్రాయిల్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రమేస్‌బాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ నగర కార్యదర్శి సుధాకర్‌తో పాటు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, శంకర్ గౌడ్, నాయకులు సుజాత, విఘ్నేష్, సిపిఐ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గద్వాల జిల్లా కేంద్రంలో...



హనుమకొండలో....



వరంగల్‌లో...



నిజామాబాద్‌లో...

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం



**ప్రజాపక్షం/యాచారం :** ముఖ్యమంత్రి సహయనిధి నిరుపేదలకు వరం లాంటిదని యాచారం మండల పరిషత్ మాజీ వైస్ ఎంపిపి లు గజ్జి రామకృష్ణ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గున్‌గల్ గ్రామంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆపదలో అపద్బంధువుగా ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శోభారాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మచ్చ లక్ష్మ ణ్,గిరమోని రవింధర్,సత్యనారాయణ,మహేశ్, చంటి,రాజు, మధుసూధన్,సాకరమోని వీర బాబు తదితరులు పాల్గొన్నారు.

## పేద మహిళలకు రూ.2500 ఎప్పుడిస్తారో చెప్పండి?
### బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పేద మహిళలకు రూ.2500 ఎప్పుడు ఇస్తారో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని బికెఎంయు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. గురువారం కేశంపేట మండల పరిధి లోని నిర్ధవెల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల స్థాయి సమావేశాన్ని లాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక పేద మహిళలకు నెలకు రూ.2500 ఇంటి ఖర్చుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామని చెప్పి నేటికి 18 నెలలు అవుతుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాన్నారు. లేనిపక్షంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వై.దామోదర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా లాలయ్య, ఉపాధ్యక్షులుగా జయమ్మ, చెన్నయ్య, కార్యదర్శులుగా మల్లేష్, శంకర్, కోశాధికారిగా లక్ష్మమ్మలతోపాటు కమిటీ సభ్యులుగా ఏడుగురిని ఎనుకున్నట్లు తెలిపారు.

## నేడు డయల్ యువర్ డిఎం

**హైదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసి హయత్‌నగర్ 2 డిపోలో శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు 'డయల్ యువర్ డిఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో హయత్‌నగర్ పరిధిలోని ప్రయాణికులు పాల్గొని సూచనలు, సలహాలు తెలిజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందు కోసం 9959226419 నెంబర్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

## యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి : డిఆర్‌ఒ సంగీత



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా రెవిన్యూ అధికారి సంగీత అన్నారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య,ఆయిష్ శాఖల ఆధ్వర్యంలో యోగా దినోత్సవం అవగాహన పోస్టర్‌ను డిఆర్‌ఒ సంగీత, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ సంగీత మాట్లాడుతూ జూన్ 21 అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలలో యోగా పై అవగాహన మరియు ఆసనాలు ప్రదర్శించబడుతారు. గచ్చిబౌలి స్టేడియంలో భారీఎత్తున మెగా దినోత్సవ వేడుక జరుపుతున్నమని, రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యదికారి డా. వెంకటేశ్వర రావు తెలిపారు. కార్యక్రమంలో వివిధ డివిజన్లకు చెందిన డిప్యూటీ డిఎంహెచ్‌వోలు, ప్రోగ్రామ్ అధికారులు,ఆయిష్ వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి : ఎమ్మెల్సీ నవీన్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అంధించేందుకు పాఠశాల యాజమాన్యాలు కృషి చేయాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో దీపికా మెమోరీయల్ ఇంటర్నేషనల్ స్కూల్ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని, నాణ్యమైన విద్యను అంధించేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో యాజమాన్యం ఇందిరా డానియల్, జిమ్మి, నేతలు సుధీర్, తుప్పుడు నరసింహా, నరేందర్, దినేష్‌సాగర్, శ్రీకాంత్ గౌడ్, మధు, జిజో జాన్సన్, అజయ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## సమస్యలు లేకుండా పరిష్కరిస్తా
### కార్పొరేటర్ రంగా నర్సింహగుప్త



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** డివిజన్‌లో సమస్యలు లేకుండా అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చైతన్యపురి డివిజన్ కార్పోరేటర్ రంగా నర్సింహగుప్త అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని న్యూమారుతినగర్, నార్త్ మారుతినగర్, ఫణిగిరికాలనీ, లక్ష్మీ నరసింహాకాలనీలో జిహెచ్ఎంసీ మాస్ శానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నర్సింహగుప్త మాట్లాడుతూ పర్యవరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నీరంకి రవి, ప్రభాకర్, శ్రీనివాస్, కృష్ణ, సత్తయ్య, మురళీ పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు
### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి



**ప్రజాపక్షం/షాబాద్ :** అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కెరామస్వామి అన్నారు. గురువారం నగరంలోని గౌలిదొడ్డి దగ్గర అమెరికన్ కన్సలేట్ దగ్గర నిరసన వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం సిపిఐ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ పాలస్తీనా ఇరాన్లపై సామ్రాజ్యవాద అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ చేస్తున్న అమానుష దాడులను నిలిపివేయాలని లెఫ్ట్ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా చేశామని పేర్కొన్నారు.

# వీధి లైట్ల సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ
### జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్ట్రీట్ లైట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. అదనపు, జోనల్ కమిషనర్‌లు, ఉన్నతాధికారులతో పూడికతీత, పారిశుధ్యం, వీధి దీపాలు, దోమల నివారణ, ట్యాక్స్ వసూళ్లపై కమిషనర్ సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్ట్రీట్ లైట్ సమస్యలపై తరచుగా ఎక్కువ ఫిర్యాదులు వస్తున్న ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి, సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఈ విషయంలో కార్పొరేటర్లు, ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సాయంత్రం క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్యలకు గల కారణాలను తెలుసుకుని పరిష్కారం చేయాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. మెన్, మెటీరియల్ ఏర్పాటుకు జోనల్ కమిషనర్లకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. జోనల్, డిప్యూటీ కమిషనర్లు, విద్యుత్ ఇంజనీర్లు, ఫిర్యాదులు వస్తున్న ప్రాంతాల్లో పర్యటించి, సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తాను కూడా పర్యటిస్తానని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు. డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా దోమలు నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో, పాఠశాలలో పారిశుద్ధ్యంతో పాటు డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్( ఆరోగ్యం)ను ఆదేశించారు. లక్ష్యం మేరకు ట్యాక్స్ వాసులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్, ఖాళీ స్థలాలపై నిర్దేశించిన లక్ష్యం మేరకు వసూలు చేయాలన్నారు. గుర్తించిన కమర్షియల్ ప్రధాన రోడ్డులో ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్, పరిశీలించి, ట్యాక్స్ వసూలు చేయాలన్నారు. ఈ విషయంలో తిరిగి విజిలెన్స్ బృందాలు కూడా పరిశీలన చేస్తాయన్నారు. పూడికతీత ఆశించిన స్థాయిలో ప్రగతి లేనందున హైడ్రా సమన్వయంతో పరిశీలించి, ప్రగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

### దుర్గం చెరువు డ్రైనేజీ సమస్యను.. సర్వత్రేమే పరిష్కరించాలి

దుర్గం చెరువు డ్రైనేజీ సమస్యను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ జోనల్ కమిషనర్, జలమండలి, సిఈ, ఎస్ఎన్‌డిపి ఈఈ, లేక్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మురుగునీటి పైప్‌లైన్ సరిగ్గా, క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. పైప్‌లైన్ మళ్లింపు పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. సివరేజ్ లైన్ స్వతహాగా నిర్వహించి వాకర్స్‌కు ఇబ్బందులు లేకుండా జలమండలి చర్యలు చేపట్టాలన్నారు. చెరువును మరింత సుందరంగా తీర్చిదిద్దడానికి పార్కులో వస్తువులను సమీకరించాలని సి.ఎస్.ఆర్ నిర్వహిస్తున్న వారికి సూచించారు. అక్కడ ఉన్న ఎస్‌టిపి సందర్శించి శుద్ధి వ్యవస్థను అడిగి తెలుసుకున్నారు. థర్డ్ పార్టీతో పాటు నీరీ సంస్థ ద్వారా శుద్ధి చేసిన నీటిని పరీక్షించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. ఎస్ఎన్‌డిపి ద్వారా చేపడుతున్న వర్షపు నీటి డ్రెయిన్ పనులను పరిశీలించారు. సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో జోనల్ కమిషనర్ వారం వారం ప్రగతిని సమీక్షించి, ఏవైనా అడ్డంకులు ఉంటే తొలగించి, నిర్దేశించిన కాల వ్యవధిలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ సహదేవ్ కేశవ్ పాటిల్, ఎస్ఎన్‌డిపి చీఫ్ ఇంజనీర్ కోటేశ్వర రావు, జలమండలి అధికారులు, లేక్స్ ఈఈ నారాయణ, డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

## ఐదు కిలోల గంజాయి స్వాధీనం
### నలుగురిని అరెస్టు చేసిన రాజేంద్రనగర్ పోలీసులు

**ప్రజాపక్షం/గండిపేట:** బీదర్ నుంచి హైదరాబాద్ కు గంజాయిని తరలిస్తున్న నలుగురు యువకులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఇన్స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం. బుద్వేల్, అత్తాపూర్ ప్రాంతానికి చెందిన జగదీష్, రామ్ కుమార్, మనోజ్ చారి, నరేందర్ స్థానికంగా చిరు ఉద్యోగాలు చేస్తూ జీవిస్తున్నారు. ఈ నలుగురు కలిసి డబ్బులు ఆశకు పోయి గంజాయి వ్యాపారం చేయాలనుకున్నారు. దీంతో వీరు ఓ కారులో కర్ణాటకలోని బీదర్ ప్రాంతానికి వెళ్లి అక్కడ మహేష్ రెడ్డి అనే వ్యక్తి నుంచి 40 వేల రూపాయలకు ఐదు కిలోల గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాదుకు తీసుకువస్తున్నారు. విశ్వసనీయ సమాచార మేరకు రాజేంద్రనగర్ ఎస్ఓటి పోలీసులు, రాజేంద్రనగర్ పోలీసులు సంయుక్తంగా రాజేంద్రనగర్ పత్తి కుంట వద్ద గురువారం ఉదయం వాహనాలను తనిఖీలు చేశారు. ఈ క్రమంలో జగదీష్ రామ్ కుమార్ మనోజ్ చారి నరేందర్ ను వస్తున్న వాహనాన్ని నిలిపి తనిఖీలు చేయగా ఐదు కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి దాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ నలుగురిని పోలీస్ స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు.

# పిల్లలకు ఏ సమస్య వచ్చినా.. పాఠశాల యాజమాన్యాలదే బాధ్యత : సిపి ఆనంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతి పాఠశాలకు చెందిన బస్సుల భద్రత విషయంలో ఆయా పాఠశాల యాజమాన్యాలే తగిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ సూచించారు. పిల్లలకు ఎటువంటి సమస్య వచ్చినా యాజమాన్యానిదే బాధ్యత అని స్పష్టం చేశారు. భద్రతా ప్రమాణాలను పాటించాలని, ప్రతి పాఠశాల పరిసరాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుని, నిత్యం పనిచేసేలా చూడాలని ఆదేశించారు. పాఠశాలల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లతో కలిసి హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలోగురువారం సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సివి.ఆనంద్ ముఖ్యఅతిథిగా హాజరవ్వగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ గోపాల్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్,ఆర్‌టిసి ఇడి మునిశేఖర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సిఈఒ. మధుకర్ నాయక్,డిడి ఈఒ ఆర్.రోహిణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సివి ఆనంద్ మాట్లాడుతూ పిల్లలు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పరిసర ప్రాంతాలను పాఠశాల బస్సు డ్రైవర్లు గమనించాలని హెచ్చరించారు. ఓవర్ లోడెడ్ ఆటోలలో విద్యార్థులు వెళ్లడం ప్రమాదకరమని, ఇలాంటి వాటిపైన విద్యార్థుల తల్లిదండ్రులు దృష్టి పెట్టి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. యాజమాన్యాలు పాఠశాల పరిసర ప్రాంతాలలో సైన్ బోర్డు ఉండేలా చూసుకోవాలి. ఒకేప్రాంతంలో ఎక్కువపాఠశాలలు ఉన్నప్పుడు ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉంటాయని, ఇలాంటి ప్రాంతాలలో రవాణా, ట్రాఫిక్ సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసేలా కృషి చేస్తామని ఆనంద్ తెలిపారు. కలెక్టర్ దాసరి హరిచందన మాట్లాడుతూ పాఠశాల వద్ద రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తక్షణమే ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి.జోయల్ డేవిస్ మాట్లాడుతూ త్వరలో పాఠశాలల వద్ద డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని, పాఠశాలల పరిసరాల్లో ట్రాఫిక్‌ను పర్యవేక్షించే బాధ్యత యాజమాన్యాలదేనని అన్నారు.

# సాగుచేసే ప్రతి ఎకరాకూ రైతు భరోసా
### ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** సాగుచేసే ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రాళ్ళు, రప్పలు ఉన్న, సాగుచేయని భూములకు ఇచ్చేంది లేదని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్‌లోని 120గ్రామాల్లో 56వేల మంది అన్నదాతలకు రూ.38 వేల కోట్లకు పైగా రైతు భరోసా నిధులు ఇచ్చినట్టు వివరించారు. రుణమాఫీ విషయంలో సాంకేతిక కారణాలు, కుటుంబ సమస్యల కారణంగానే కొంత జాప్యం చోటుచేసుకుందని తెలిపారు. ఆ సమస్యలను త్వరలోనే పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు.

**ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దుర్మార్గమైనది...**

ఫోన్‌ట్యాపింగ్‌తో వ్యక్తిగత జీవితాల్లోకి వచ్చిన వారిని ఉరి తీయాల్సిందేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దుర్మార్గమైందని, బిఆర్ఎస్‌ది ఇదేమి సం స్కారమని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు.

**పదేళ్లల్లో ఇవ్వలేని రేషన్‌కార్డులు..కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుంది...**

గత పాలకులు పదేళ్ళల్లో ఇవ్వలేని రేషన్ కార్డులు సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే శంకర్ వివరించారు. ఫరూఖ్‌నగన్ మండల పరిధిలోని రాసుమల్లెగూడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు పనులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. నాగులపల్లి గ్రామంలో నిర్మించే సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం ఇస్తున్నామని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, బాల్‌రాజ్‌గౌడ్, విశ్వం, రఘునాయక్, జమ్మృద్‌ఖాన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, రాములు గౌడ్, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు అమెజాన్ సిఎస్‌ఆర్ సంస్థ నిరంతర కృషి

**ప్రజాపక్షం/షాబాద్ :** విద్యార్థుల భవిష్యత్తు కోసం అమెజాన్ సిఎస్‌ఆర్ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని అమెజాన్ సిఎస్‌ఆర్ నిర్వహకులు తాతాజీ అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని తెలంగాణ మాడల్ ఆదర్శ పాఠశాలలో అమెజాన్ సంస్థ తరపున పాఠశాల ప్రిన్సిపాల్ కవితతో కలిసి సోలార్ గ్రిడ్‌ను ప్రారంభించారు. అమెజాన్ ప్రతినిధి లిబీకోహెన్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రకృతి, పర్యావరణాని కాపాడుతూ దేశ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కవిత మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న అమెజాన్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అమెజాన్ సంస్థ సిబ్బంది రాజేష్ మైసా, వినయ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు








**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు రాహుల్‌గాంధీ కృషి చేస్తున్నారని, అందుకు భారత్‌జోడో పాదయాత్ర చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్, మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, నేతలు కృష్ణారెడ్డి, విశ్వం, శ్రీకాంత్‌రెడ్డి, జమ్మృద్‌ఖాన్, బస్వం, మహ్మద్ ఇబ్రహీం, దంగు శ్రీనివాస్ యాదవ్, శ్రీశైలం గౌడ్, పురుషోత్తంరెడ్డి, అప్పి, కత్తి చంద్రశేఖర్ అప్ప, శంకర్, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**తుర్కయంజాల్ :** కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం పురస్కరించుకొని తుర్కయంజాల్ కూడలిలో గురువారం మున్సిపాలిటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నారేవల్లి యాదగిరి, గుడ్ల అర్జున్, ఓర్సు శ్రీనివాస్,దుగ్గని శ్యామల,గుండా శ్రీశైలం, లోహిత్ రెడ్డి, ఎరుకలి రవి,జనార్దన్, రవి తదితరులు పాల్గొన్నారు

**గండిపేట:** మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ జాతీయ నాయకులు ఎంపి రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఆరాధన అనాధాశ్రమం పిల్లలతో కలిసి మణికొండ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్, కార్యనిర్వాక అధ్యక్షులు కిరణ్ కుమార్, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకులను అనాధాశ్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేయడం జరిగింది. పిల్లల చేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో కేకును కట్ చేయించి రాహుల్ గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రవణ్, గణేష్, ఆకాష్,అనాధాశ్రమం నిర్వాహకులు కిరణ్, బాలబాలికలు పాల్గొన్నారు

**సరూర్‌నగర్ :** అన్నిదానాల్లో రక్తదానం గొప్పదని టిపిసిసిసభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం సరూర్‌నగర్ డివిజన్ కొత్తపేట చౌరస్తాలో ఎన్ఎస్‌యుఐ నాయకులు రంజిత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తధాన శిభిరాన్ని ముఖ్యఅతిధిగా హాజరైన దేప భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దేప మాట్లాడుతూ దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా దేశ వ్యాప్తంగా ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు భారత్ జోడో యాత్ర పేరుతో పాదయాత్ర చేసిన ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ సిహెచ్.యాదయ్య, నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, ఇమ్రాన్ అలీ, జంగారెడ్డి, యునూస్ దంతోజు, నరసింహాచారి, సంతోష్, కౌశిక్‌రెడ్డి, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



ప్రజాపక్షం/దమ్మాయిగూడః ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతలోపాలు లేకుండా నిర్మాణం చేపట్టాలని మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. గురువారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చీర్యాల్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆమె పరిశీలించారు. అనంతరం నాలుగో వార్డు పరిధిలోని ప్రభుత్వ పాఠశాల, వీకర్ సెక్షన్ కాలనీలోని అంగన్‌వాడీ స్కూల్‌ను ఆమె తనిఖీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగమణి, డిఇఇ బాలమురళి, భగవంత్‌రావు, కార్యదర్శి నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## జిహెచ్ఎంసి సిబ్బందికి సహకరించాలి

ప్రజాపక్షం/కాప్రా: రానున్న వర్షాకాలం దృష్ట్యా రోగాల బారిన పడకుండా ఉండేందుకుగాను శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని హెచ్‌బి కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ తెలిపారు. పరిసరాల పరిశుభ్రతలో జిహెచ్ఎంసి సిబ్బందికి స్థానికులు సహకరించాలని ఆయన కోరారు. గురువారం శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ డివిజన్‌లోని ఆనంద్‌నగర్, తిరుమలనగర్, కృష్ణానగర్, లక్ష్మినగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో మూడురోజుల పాటు వీధులను శుభ్రంచేసి ప్రత్యేక వాహనాల ద్వారా చెత్తను, గ్రీన్ వేస్ట్ తొలగించటం జరుగుతుందన్నారు. రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ మధుసుధన్, శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, యుబిడి సూపర్‌వైజర్ నరేష్, రామ్‌కి సంస్థకు చెందిన వేణు, కృష్ణ స్థానిక కాలనీ ప్రతినిధులు గోవిందరెడ్డి, మల్లేష్ గౌడ్, దేవిరాజ్, దేవేందర్‌కుమార్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.




## 'రైతు భరోసా'పై రైతుల ఆందోళన

ప్రజాపక్షం/దుండిగల్ : తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా నిధులను రైతుల అకౌంట్లో వేస్తున్నారు కానీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని ఏ ఒక్క రైతు అకౌంట్లో రైతు భరోసా నిధులను జమ చేయడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి జిల్లాలో రెండు విడతలు రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగిందని, మేడ్చల్ జిల్లాలో ఒక్కసారి కూడా రైతు భరోసా నిధులు జమకాలేదని, కావున రైతుల పక్షాన మేడ్చల్ జిల్లాలోని పిఎసిఎస్ చైర్మన్లు, ఎఫ్ఎసిఎస్ చైర్మన్లు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్, డిస్టిక్ అగ్రికల్చర్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు. అంతేకాకుండా గతంలో రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం సగం రైతుల రుణమాఫీ చేసి మిగతా సగం రైతుల యొక్క రుణమాఫీ చేయలేదని అన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి రైతులను ప్రజలను మరిచిపోవడం చాలా బాధాకరం కావున ముఖ్యమంత్రి రైతులను గుర్తుపెట్టుకుని ప్రతి ఒక్క రైతు అకౌంట్లో రైతు భరోసా వెయ్యాలని పార్టీలకు అతీతంగా రైతుల తరపున కోరడం జరుగుతుందని. రెండు మూడు రోజుల్లో రైతుల్లో అకౌంట్లో డబ్బులు వెయ్యనట్లయితే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని, పిఎసిఎస్ చైర్మన్లు బౌరంపేట్ పిఎసిఎస్ చైర్మన్ బాల్ రెడ్డి షామీర్పేట్ చైర్మన్ మధుకర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ డబ్బిల్‌పూర్ సురేష్ రెడ్డి, మేడ్చల్ రందీప్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కీసర ప్రభాకర్ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్, పూడూరు చైర్మన్ సుధాకర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



## అనాథ పిల్లల సేవలు అభినందనీయం

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : నిరుపేద, అనాథ పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడుతూ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు షేర్ ది విజన్ ట్రస్ట్ కొనసాగిస్తున్న సేవలు అభినందనీయమని అమెరికా దేశానికి చెందిన లీన్నే ఓగు కొనియాడారు. ఘట్‌కేసర్ మండలంలోని పోచారంలో స్థాపించిన ఆగపే అనాథ శరణాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న 220మంది విద్యార్థుల పోషణ, విద్యకుగాను షేర్ ది విజన్ ట్రస్ట్‌కు రూ.5లక్షల విలువైన నిత్యావసర వస్తువు లు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, ఆట వస్తువులు, ఫ్యాన్లు, దుస్తులను ఆమె అందించారు. 2023లో ఆరుగురు అనాథ విద్యార్థులతో ప్రారంభించిన అనాథ శరణాలయంలో ప్రస్తుతం 220మంది చేరారన్నారు. దాతలు షేర్ ది విజన్ ట్రస్ట్ అధ్యక్షుడు పొదిలి నారాయణ, కోశాధికారి పాల్ సద్గుణరావు, ఆగా పే ప్రతినిధి మోసెస్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పలు కాలనీలు సందర్శించిన సిడిఎంఎ అసిస్టెంట్ డైరెక్టర్

ప్రజాపక్షం/నాగారంః మున్సిపాలిటీలు 100 రోజుల ప్రణాళికతో అభివృద్ధి చెందుతాయని సిడిఎంఏ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులోని పార్కులో బ్లాక్ ప్లాంటేషన్ మొక్కలను నాటారు. వీధి కుక్కల ఏబిసి కెన్నెల్‌ను సందర్శించి సంతానోత్పత్తి కల్గకుండా అపరేషన్ చేయాలని, కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని సందర్శించి అందులో నుండి వేస్ట్ వాటర్ పోవడానికి కాలువలు చేయాలని సూచించారు. మహిళ సమైక్య సంఘాలతో ఇంటరాక్షన్ సమావేశం వారు తయారు చేస్తున్న వస్తువులను పరిశీలించి వాటిపై సంఘాల పేర్లు, ఫోన్ నంబర్ పెట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి న్యూరల్ పెయింటింగ్‌ను చూసి ఆమె సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి,మేనేజర్ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లో రూ.3.18కోట్లు జమ

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : రైతు భరోసా పథకం ద్వారా అన్నదాతకు అండగా ఉండే లక్ష్యంగా ప్రభుత్వం ఆర్థికంగా చేయూతను అందిస్తోందని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద జిల్లాలో 4624 మందికి రైతుల ఖాతాల్లో రూ.3.18 కోట్లు జమ చేయటం జరిగిందని, విడతల వారీగా వారికి నేరుగా బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తుంటామన్నారు. వ్యవసాయానికి పెట్టుబడి భారాన్ని తగ్గించి వ్యవసాయోత్పత్తులు పెంపొందించుకొనేందుకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

# మండలానికొక డిగ్రీ కాలేజీ

### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ ఃభారత కమ్యూనిస్టు పార్టీ నిబంధన వారి ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఓసారి మహాసభలు నిర్వహించుకుంటామని ఆ మహాసభల్లో ఈ మూడు సంవత్సరాల కాలంలో సిపిఐ నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకొని రాబోవు రోజుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసం పోరాట రూపాలను నిర్మించుకుంటామని అదే విధంగా పార్టీ బలోపేతం కోసం నాయకత్వం తీసుకోవాల్సిన సూచనలను, కార్యక్రమాలను చర్చించుకొని నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటామని అందులో భాగంగానే మేడ్చల్ జిల్లా సిపిఐ మహాసభలు గత నెల 25న ఈసిఐఎల్‌లో నిర్వహించుకొని 15 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నుకొని నూతన జిల్లా కార్యదర్శిగా కామ్రేడ్ ఉమా మహేష్ ని ఎన్నుకోవడం జరిగిందని నేడు మేడ్చల్ జిల్లా విలేకరుల సమావేశంలో తెలపడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మేడ్చల్ జిల్లాలో 15 మండలాలు ఉండగా కేవలం నాలుగు డిగ్రీ కాలేజీలు ఉండడం ఈ జిల్లా ప్రజలు చేసుకున్న పాపమని ఈ జిల్లా సుమారు 15 లక్షల మంది డిగ్రీ విద్యను అభ్యసిస్తున్నారని కొన్ని లక్షల మంది ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల ఉన్నత విద్యకు దూరమైన పరిస్థితులు కూడా ఉన్నాయని కావున మేడ్చల్ జిల్లాలో మండలానికి ఒక డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయడానికి పోరాటం నిర్వహిస్తామని అన్నారు.

అదేవిధంగా ప్రజలు వారి సంపాదనలు ఎక్కువ శాతం విద్యకోసం, వైద్యం కోసం ఖర్చు పెడతారని అలాంటి విద్య, వైద్యం నేడు పేద మధ్యతరగతి ప్రజలకు భారంగా మారిందని, ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు మంత్రులు ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల ఆసుపత్రుల ప్రారంభోత్సవాలకు వెళ్లడం ప్రత్యక్షంగా ప్రజలు డబ్బులు పెట్టి విద్యను వైద్యాన్ని కొనాలని ప్రచారం చేస్తున్నట్టు కనిపిస్తుందని ఇది సిగ్గుచేటుకరమని వెంటనే అలాంటి ప్రారంభోత్సవాలను మానుకొని ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థను బలోపేతం చేయడానికి పూనుకోవాలని ఆ విధంగా చేయడానికి సిపిఐ పార్టీ తరపున రానున్న రోజుల్లో పోరాటం నిర్వహిస్తామని అన్నారు. జిల్లా మొత్తం 80 శాతం పరిశ్రమలతో, కార్మికులతో నిండి ఉందని కానీ పరిశ్రమల యాజమాన్యాలు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినటువంటి కార్మికులకు తక్కువ వేతనాలు ఇచ్చి వారిని బానిసలుగా తయారుచేసి ఈ జిల్లా వాసులకు ఉద్యోగాలను కల్పించట్లేదని కావున సిపిఐ తరపున స్థానిక నిరుద్యోగులకు 75 రిజర్వేషన్ కల్పించడం కోసం పోరాటం నిర్వహిస్తామని అన్నారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో బిఆర్ఎస్ హయాంలో వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక ఆ కబ్జాలను తొలగిస్తారని అనుకుంటే నేడు అవే కబ్జాలు మరింతగా పెరిగిపోయాయని దీనికి బదులు ప్రభుత్వమే ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు ఉచితంగా కల్పిస్తే ఈ ప్రభుత్వానికి మంచి పేరు కలుగుతుందని ఆ విధంగా చేయని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో భూపోరాటం కూడా నిర్వహించి పేదలకు గతంలో ఇచ్చినట్టే మరోసారి భూములు పంచుతామని చెప్పారు.

అదే విధంగా భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాల్గవ మహాసభలు కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలో నిర్వహిస్తున్నామని ఈ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి 1000 మంది ప్రతినిధులు పాల్గొంటారని భవిష్యత్తు కార్యక్రమాలను చర్చిస్తారని ఈ మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా ప్రతి ఒక్కరిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, సత్య ప్రసాద్, వి. శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు సల్మాన్ బిగ్, రాములు గౌడ్, రాకేష్‌లు పాల్గొన్నారు.




## నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన సిపిఐ

### ఆగస్టు 19నుండి 22 వరకు గాజులరామారంలో సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు : యూసుఫ్

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ః కుత్బుల్లాపూర్ మండల కౌన్సిల్ సమావేశం సిపిఐ మాజీ కౌన్సిలర్ పి.నర్సయ్య అధ్యక్షతన పొట్లూరి నాగేశ్వరరావు భవన్ ఎఐటియుసి కార్యాలయం షాపూర్‌నగర్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ సమితి సభ్యులు ఎండి.యూసుఫ్ పాల్గొని మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు కుత్బుల్లాపూర్ మండలంలోని గాజులరామారంలోని మహారాజా గార్డెన్‌లో ఆగస్టు 19నుండి 22 వరకు నిర్వహించుకుంటున్నామని, ముఖ్యంగా భూపోరాటం చేసి గురుమూర్తినగర్ నుండి రావినారాయణరెడ్డి నగర్ వరకు వందల ఎకరాల ఇండ్ల స్థలాలు పంచిన చరిత్ర భారత కమునిస్టు పార్టీది అని నిత్యం ప్రజా సమస్యలపై అధికారులను నిలదీసి మంచినీటి సమస్య, వీధి లైట్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వంటి మౌలిక సమస్యలపై పోరాటాలు చేసిన నాయకులున్న ప్రాంతం రాష్ట్ర మహాసభలను అందరం ఒక ఛాలెంజ్‌గా తీసుకొని విజయవంతం చేయగలరని అందుకు ప్రతి శాఖా సభ్యుడు ముందుండి నడవాలని ఇంటింటికి ప్రచార కరపత్రం చేరవేసి మహాసభల ప్రాధాన్యత తెలపాలని పిలుపునివ్వడం జరిగింది. సిపిఐ మండల కార్యదర్శి కె.స్వామి మాట్లాడుతూ ప్రతి శాఖ కమిటీలు వేసుకొని దళములు ఏర్పరచుకొని కళాకారులతో వ్యాపార సముదాయాలు, ప్రతి ఇంటికి పోయి విరాళాలు సేకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేసుకుందామని అన్నారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి హరినాథరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, సి.వెంకటేష్, మండల కోశాధికారి సదానంద్, శాఖా కార్యదర్శులు వెంకటేష్, మధుసూదన్ రెడ్డి, వీరస్వామి, నర్సయ్య, ప్రజానాట్య మండలి నాయకులు ప్రవీణ్, సంతోష్ రెడ్డి, కె.శ్రీను పాల్గొనడం జరిగింది.

## భవిష్యత్ భారతానికి నాయకుడు రాహుల్ గాంధీ

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : గురువారం రోజు బాలాజీనగర్ డివిజన్ వివేక్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ గారి జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా టిపిసిసి అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హాజరై కేక్ కట్ చేసి, విదార్థులకు పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు అందచేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ, నిగర్వం, దేశ సేవ పట్ల నిబద్ధత, సామాజిక న్యాయం కోసం మీ నిరంతర కృషి మాకందరికీ ఆదర్శం. ఆయురారోగ్యాలతో, సంతోషంతో, మరెన్నో ఉన్నత లక్ష్యాలను సాధిస్తూ దేశ సేవలో నిరంతరం ముందుకు సాగాలని మనసారా కోరుకుంటున్నాను అని అన్నారు. రాహుల్ గాంధీ గారు దేశానికి విశ్వసనీయత కలిగిన, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసే నిజమైన ప్రజానాయకులు. ప్రజాస్వామ్యం సవాళ్లను ఎదుర్కొంటున్న సమయాల్లో, మీ ధైర్యం మరియు స్పష్టత మెరుగైన, మరింత సమగ్రమైన భారతదేశం కోసం ఆశను అందిస్తాయి.



సత్యం మరియు న్యాయం కోసం మీ పోరాటంలో ఈ సంవత్సరం మీకు బలం, ఆరోగ్యం మరియు నిరంతర సంకల్పాన్ని తీసుకురావాలి. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యం బలపడుతున్నాయి. రాహుల్ గాంధీ జన్మదినాన్ని మనం ఈ రోజు ఒక్క వేడుకగా కాదు, భావి తరాలకు ఆశాజ్యోతి చూపించే ఉద్యమంగా జరుపుకుంటున్నాం.

ఈ పుణ్య దినాన్ని పురస్కరించుకొని ప్రతి కార్యకర్తలో ఆత్మవిశ్వాసం,సేవాభావం పెరగాలి. రాహుల్ గాంధీ గారి ఆశయాలు సాకారం కావాలని మనమంతా కలసి కృషి చేయాలి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేరి సతీష్ రెడ్డి, సాధు ప్రతాప్ రెడ్డి, సంజీవ్, దేశాల్, ఏఎంసి వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, డైరెక్టర్లు ఫణికుమార్, అరుణ్ గౌడ్, సుధాకర్ రెడ్డి, కొండల్ రెడ్డి, భాస్కర్ సప్పిడి, యూత్ కాంగ్రెస్ నాయకులు జహింగిర్, కూకట్ పల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి. సలీం, మైనారిటీ సీనియర్ నాయకులు ముగ్ధుమ్, మైఖేల్, బాలయ్య, డివిజన్ మహిళా అధ్యక్షురాళ్లు మారుతీ, సీనియర్ మహిళా నాయకురాళ్లు రేష్మా, స్వరూప గౌడ్, బండి సుధ, శ్రీకాంత్, సుల్తాన్, అక్బర్, శ్రవణ్, జిబిన్, పాఠశాల అధ్యాపకులు సృజన, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## రైతుభరోసా నిధులు విడుదల

### డిసిఎంఎస్ వైస్ చైర్మన్ కలెక్టర్‌కు వినతిపత్రం

ప్రజాపక్షం/శామీర్‌పేటః రైతుభరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరెట్ కార్యాలయంలో రైతుభరోసా నిధులు విడుదల చేయాలని కలెక్టర్‌కు రైతులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 6 గ్రామీణ మండలాలు, 5 పట్టణ మండలాలు మొత్తం 11 మండలాల్లో సుమారు గా 49,727 ఎకరాల విస్తీర్ణంలో 45,067 మంది రైతులు వివిధ పంటలు సాగుచేస్తున్నారని అన్నారు. రైతుభరోసా పథకం ద్వారా 27.40 కోట్ల నిధులు విడుదల చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. జిల్లాలోని మేడ్చల్, కీసర, శామీర్‌పేట, ఘట్‌కెసర్, దుండిగల్, కుత్బుల్లాపూర్, అల్వాల్, మండలాల్లోని రైతుల కు ఇప్పటివరకు రైతుభరోసా కింద డబ్బులు జమకాలేదన్నారు. ఈ ప్రాంత రైతులను రైతులుగా అధికారులు గుర్తించడం లేదని డబ్బులు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. మూడుచింతలపల్లి మండలంలోని కొంత మంది రైతుల కు రైతుభరోసా కింద డబ్బులు వచ్చాయని మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటని ఆవేదన చెందారు. రైతులందరికి వెంటనే రైతుభరోసా డబ్బులు జమచేయాలని కలెక్టర్‌ను కోరారు. లేకుంటే ధర్నా, నిరసనలు చేస్తామని ప్రభుత్వాన్ని ఎండగడతామని హెచ్చరించారు.



## జూలై 7,8 తేదీల్లో డిహెచ్‌పిఎస్ రెండవ రాష్ట్ర మహాసభలు : ఏసురత్నం

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనీల్ కుమార్ డిమాండ్ చేసారు. దళిత హక్కుల పోరాట సమితి మేడ్చల్ జిల్లా 2వ మహాసభల సందర్భంగా ఏసురత్నం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టాక దళితులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేసారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు పెరిగి పోతున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాదిన్నర కాలం అవుతున్నా ఇప్పటి వరకు చేవెళ్ల డిక్లరేషన్ ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు అర్హులందరికి వివక్షలేకుండా లబ్ది పొందేలా చూడాలన్నారు. దళిత రెండవ రాష్ట్ర మహాసభలు జూలై 7,8 తేదీల్లో వరంగల్‌లోని పిరార్‌ఆర్‌ఎసి కన్వెన్షన్ హాలులో జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కె.సహదేవ్,ఉషాశ్రీ, నర్సింగరావు,సాయిలు, బొట్టు రమేష్, సదానందం, రజని, కోమలి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింతగా కృషి

### పార్టీ సీనియర్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/ నిజాంపేట్ : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు మరింతగా పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డిలు కేక్‌ని కట్ చేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పార్టీ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు అర్హులైన వారందరికి అందేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జీవన్ రెడ్డి, హరియానాయక్, రాంచంద్ర నాయక్, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే మా పిల్లలను చేర్పిస్తాం : మహిళా సంఘాల తీర్మానం



ప్రజాపక్షం /కొడంగల్ : ప్రభుత్వ బడులలలోనే మా పిల్లలను చేర్పించడంతో పాటు గ్రామంలోని ప్రతి ఒక్కరి పిల్లలను ప్రభుత్వ బడులలోనే చేర్పించాలని గ్రామ కమిటి మహిళ సంఘాల మహిళలు తీర్మానం చేసి దీనికి కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేయడం పలువురుని ఎంతగానో ఆకట్టుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే తెలంగాణ రాష్ట్రంలోనే మారుమ్రోగుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం అయిన కొడంగల్ నియోజకవర్గంలోని బోంరాస్‌పేట మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామ మహిళలు ప్రభుత్వ పాఠశాలలకు అండగా నిలుస్తూ బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తు పిల్లల తల్లిదండ్రులను మోటివేషన్ చేయడంలో బిజిబిజీగా మారారు. ఒక పక్క ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో సకల సౌకర్యాలు కల్పిస్తూ హరే రామ ఫౌండేషన్ ద్వారా ఉదయమే అల్పాహారం అందిస్తూ మధ్యాహ్నం భోజనం అందించడం జరుగుతుందన్నారు. మరో పక్క ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పర్నిచర్‌లు, ఎల్ఈడి స్క్రీన్ టీవి లు, బోర్డులు, ఫ్యాన్‌లతో పాటు యూనిఫామ్, నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు ఇలా విద్యార్థిని విద్యార్థుల కు అవసరం అయ్యే ప్రతి ఒక్కటి ఉచితంగా అందించడం విద్యార్థులకు సరిపడ విద్యాభోదనలు చేసే ఉపాధ్యాయులను అందించడం ఎంతో శుభపరిణామన్నారు. ఈ నేపథ్యంలో పిల్లలను ప్రైవేట్ బడులకు ఎందుకు పంపించాలని ప్రశ్నించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దాదాపు 22 మహిళా సంఘాల మహిళలు ఒకచోటుకు చేరుకుని దీనిపై చర్చించి ఒక నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. మా ఊరిలో ఉండే పిల్లలను మా ఊరిలోని ప్రభుత్వ బడిలోనే చదివిస్తామని ఇది ఎవ్వరి ప్రమేయం లేదంటే స్వచ్ఛందంగా మనస్ఫూర్తిగా ప్రతిజ్ఞ చేస్తున్నామని ఇట్టి నిర్ణయాలను ఉల్లంఘించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలుంటాయని కూడా పేర్కొన్నారు. ఎన్కెపల్లి గ్రామంలో 8వ తరగతి వరకు ఉండగా గత సంవత్సరం ఆ పాఠశాలలో 67మంది విద్యార్థులు ఉండగా ఈ 2025–26 విద్యా సంవత్సరం 150 మందికి చేరుకున్నట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు జ్యోతిపరమేశ్వరి తెలిపారు. గ్రామ మహిళ సంఘాల ప్రోత్సహం, గ్రామ కమిటి యువకులు, ప్రజల సహకారంతోనే విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడం జరిగిందని తెలిపారు.


## రెవెన్యూ సదస్సులోనే భూ సమస్యలు పరిష్కారం



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:భూ సమస్యలను సాధ్యమైనంత వరకు రెవెన్యూ సదస్సులోనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన తెలిపారు. గురువారం వికారాబాద్ మండల మండల పరిధిలోని అత్వెల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్జీలతో మాట్లాడి, సమస్యలను స్వయంగా వివరాలఅడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ లో నమోదు చేస్తున్నారా, డిఎస్ పెండింగ్ ఉందా ,మీ సేవలో దరఖాస్తు చేశారా, వెరిఫై చేశారా , మీకు ఏ సమస్యలు ఉన్నా రైతు సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రశీదులు అందించాలని సంబంధిత రిజిస్టర్లు తప్పనిసరిగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తు, పక్కాగా రికార్డులను పొందుపర్చాలని అన్నారు. తహశీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. వారి సమస్యలను పూర్తిగా విన్న తర్వాత దరఖాస్తులను స్వీకరించాలని అన్నారు. పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , ఆర్‌డిఓ వాసుచంద్ర, తహశీల్దార్ లక్ష్మి నారాయణ,ఆర్ఐ నరేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# రీల్

## ఆగస్టు 14న 'వార్ 2'



బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ ప్రస్తుతం 'వార్ 2'తో బిజీగా ఉన్నారు. యాక్షన్, డ్యాన్స్ లతో ప్రేక్షకులకు కనువిందు చేసే హృతిక్ సూపర్ గూఢచారి అయిన కబీర్ పాత్రను మళ్లీ కనిపించనున్నారు. 'వార్' చిత్రంలో కబీర్ పాత్రలో హృతిక్ కనిపించిన తీరు, ఆయన స్టైలింగ్, లుక్స్, క్యాస్ట్యూమ్స్ ఇండియన్ బాక్సాఫీస్ షేక్ అయిన సంగతి తెలిసిందే. ఇక 'వార్ 2'లోనూ హృతిక్ మళ్లీ కబీర్ పాత్రలో అలరించ చేసున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన 'వార్ 2' టీజర్ అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.హృతిక్ క్యాస్ట్యూమ్స్, స్టైలింగ్ గురించి వచ్చిన ప్రశంసలతో కాస్ట్యూమ్ డిజైనర్ అనైతా ష్రాఫ్ అడజానియా ఉబ్బితబ్బిబ్బైపోయారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ 'ఈ చిత్రం హృతిక్ పాత్రను, ఆయన స్టైలింగ్‌ను మరింత స్పెషల్‌గా డిజైన్ చేశాం. ధూమ్ 2, బ్యాంగ్ బ్యాంగ్, వాణిజ్య ప్రకటనల్లో హృతిక్‌తో కలిసి పనిచేయడం నా అదృష్టం. పైగా కబీర్ పాత్రలోని ఒంటరితనం, ఆ పాత్రలోని దేశ భక్తి ఇలా అన్నీ వ్యక్తం అవ్వాలనే ఉద్దేశంతో క్యాస్ట్యూమ్స్ డిజైన్ చేశాను. సాధారణ దుస్తుల్లోనూ ఓ సూపర్ హీరోలా కనిపించాలని నేను అనుకున్నాను. ఈ సారి వార్ కంటే భిన్నంగా, మరింత అద్భుతంగా ఉండాలని కబీర్ పాత్ర కోసం శ్రమించాము. హెయిర్‌కట్ దగ్గర్నుంచి ప్రతీ విషయంపై ఎంతో శ్రద్ధ పెట్టాము. హృతిక్‌లో ఉండే ఆ అట్రాక్టివ్ పవర్‌ను మరింతగా మెరుగుపర్చేలా స్టైలింగ్ చేశాను' అని ఆమె అన్నారు.ఆదిత్య చోప్రా నిర్మాణంలో అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ 'వార్ 2'లో ఎన్టీఆర్, హృతిక్ రోషన్ మధ్య ఢీ అంటే ఢీ అనే రీతిలో పోటీ పడనున్నారు. కియారా అద్వానీ మరో ప్రధాన పాత్రను పోషించారు. ఈ చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది.



## 'రాజా సాబ్'తో మాళవిక మోహనన్ ఎంట్రీ

బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ మాళవిక మోహనన్ రెబల్ స్టార్ ప్రభాస్ 'రాజా సాబ్'తో టాలీవుడ్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. రీసెంట్ గా రిలీజైన ఈ సినిమా టీజర్ లో మాళవిక స్టన్నింగ్ లుక్స్, బ్యూటిఫుల్ అప్పీయరెన్స్ ఆడియెన్స్ ను ఆకట్టుకుంది. 'రాజా సాబ్' టీజర్ కు మాళవిక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. టీజర్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంటున్న నేపథ్యంలో మాళవిక మోహనన్ సోషల్ మీడియా ద్వారా స్పందించింది. 'రాజా సాబ్' టీజర్ కు వస్తున్న రెస్పాన్స్ తో హ్యాపీగా ఫీలవుతున్నట్లు ఆమె తెలిపింది. ప్రభాస్ ను ఫస్ట్ టైమ్ సెట్స్ లో కలిసిన సందర్భాన్ని స్పెషల్ మూవ్ మెంట్ గా తాను ఫీలైనట్లు మాళవిక తెలిపింది. ప్రభాస్ ఎంతో గౌరవంగా, స్నేహంగా ఉంటారని, బాగా మాట్లాడతారని ఆమె పేర్కొంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'రాజా సాబ్' డైరెక్టర్ మారుతి రూపొందిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 5న హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది.



## భూమిక 'యుఫోరియా'నుండి రామ రామ సాంగ్

తెలుగు తెరపై స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన భూమిక చాలా రోజుల తరువాత మళ్లీ తెరపై కనిపిస్తోంది. గుణ శేఖర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యుఫోరియా సినిమాలో భూమిక నటించింది. గతంలో గుణ శేఖర్, మహేష్ బాబు కాంబినేషన్ లో వచ్చిన ఒక్కడు సినిమాలో భూమిక నటించింది. యుఫోరియా సినిమాలో భూమిక పై తీసిన రామ రామ అంటూ సాగే పాటను ఈనెల 21న విడుదల చేయనున్నారు. తల్లి,కొడుకు మధ్య సాగే సెంటిమెంట్ కథతో ఈ చిత్రాన్ని గుణ శేఖర్ తెరకెక్కించారు. గుణ టీమ్ వరక్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి నీలిమ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా పాటలు ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేస్తున్నారు.





## బిలీనియర్ వర్సెస్ బెగ్గర్ కథ

### శేఖర్ కమ్ములతో చిట్ చాట్

**ధనుష్, నాగార్జున, రష్మిక మందాన హీరో హీరోయిన్లుగా నటించిన కుబేర సినిమా విడుదల అవుతున్న సందర్భంగా దర్శకుడు శేఖర్ కమ్ముల మీడియాతో 'చిట్ చాట్' చేశారు.**

**★ కుబేర తీయడానికి మోటివేషన్ ఏమిటి?**

మోటివేషన్ అంటూ ఏం లేదు కానీ ఇది ఒక ఇంట్రెస్టింగ్ లైన్ అనిపించింది. ఒక సూపర్ రిచ్ ప్రపంచం, ఇంకొకటి అట్టడుగున ఉండే ప్రపంచం. బిలినియర్ వర్సెస్ బెగ్గర్. అది ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. నిజానికి ఇది కథగా చెప్పడం చాలా కష్టం. చాలా పెద్ద పాయింట్. ఒక ఎమోషనల్ థ్రిల్లర్ గా తయారయింది. అక్కడ నుంచి డెవలప్ చేయడం జరిగింది. తనకి ఏమీ వద్దు అనుకునే ఒక బెగ్గర్.. తనకి ప్రపంచంలో అన్నీ కావాలనుకునే ఒక బిలినియర్.. వారి మధ్య కాన్ ఫ్లిక్ట్ ఉంటే ఎలా ఉంటుందనేది చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. ఈమధ్యకాలంలో చాలా సినిమాలు కథలు వస్తున్నాయి కానీ ఇలాంటి ఒక కథ నేను చెప్పినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి కథ డెఫినెట్ గా చెప్పబడాలి. ఈ కథ అవేర్నెస్ ని తీసుకొస్తుంది. సినిమాని తెలుగు తమిళ్ రెండు భాషల్లో షూట్ చేశాం. కథపరంగా ఎలాంటి మార్పు ఉండదు కానీ లెంత్ లో ఒక నిమిషం తేడా వుంటుంది. లిప్ సింక్ పరంగా ప్రతిది విడివిడిగా తీశాం. టెక్నికల్ గా రెండు సినిమాలు తీసినట్లే. అందుకే కొంచెం టైం పట్టింది.

**★ ఈ కథకు నాగర్జున మాత్రమే కావాలని పట్టుపట్టారని తెలిసింది?**

కొన్ని షేడ్స్ ఉన్న క్యారెక్టర్స్ నాగార్జున చేస్తే బాగుంటుంది. ఈ క్యారెక్టర్ కి ఆయన పర్ఫెక్ట్ యాప్ట్. ఆయనని స్క్రీన్ మీద చూసినప్పుడు ఒక వావ్ ఫ్యాక్టర్ ఉంటుంది. అయితే ఇందులో ఆయన్ని ఒక వేరే విధమైన యాక్టింగ్, మేనేజర్స్ తో క్యారెక్టర్ కి తగ్గట్టుగా చూపించడం జరిగింది. నాగార్జున గారు మనం, ఊపిరి ఇలా చాలా చిత్రాల్లో డిఫరెంట్ వేరియేషన్ ఉన్న క్యారెక్టర్స్ చేస్తున్నారు. ఈ సినిమాలో కూడా ఆయన చాలా కొత్తగా కనిపిస్తారు. ఈ క్యారెక్టర్ లోకి ఆయన అద్భుతంగా ఇమిడిపోయారు.రష్మిక కూడా అందర్నీ సర్ ప్రైజ్ చేస్తుంది. ఈ క్యారెక్టర్ లో అద్భుతంగా నటించింది.

**★ కుబేర పాత్ర కోసం ధనుష్ ను ఎంపిక చేయడానికి కారణం?**

ఈ క్యారెక్టర్ ని ఆయన తప్పితే ఎవరూ చేయలేరు. సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ కూడా ఇదే మాట చెబుతారు. అంతా అద్భుతంగా చేశారు. అవుట్ స్టాండింగ్ పర్ఫామెన్స్ అనేది చిన్న మాట. ఆ క్యారెక్టర్ లో ఇంకా ఎవరిని ఊహించలేరు. ఆయన సినిమా పూర్తి అయ్యేవరకూ ఆ క్యారెక్టర్ లోనే ఉంటారు. ఏదైనా సింగిల్ లో చేసేస్తారు.

**★ కుబేర కూడా మీ మార్క్ లోనే ఉంటుందా?**

నిజానికి నా మీద ఒక మార్క్ పడింది కానీ నేను ఒక మార్కు కోసం ఎప్పుడూ సినిమాలు చేయలేదు. కథకు ఏం కావాలో అదే చేశాను. అయితే ఎక్కువగా బ్లాక్ బస్టర్ ఆయన సినిమాలు మ్యూజికల్ హిట్స్, లవ్ స్టోరీలు ఉంటాయి కాబట్టి అలా ఒక ముద్ర వచ్చింది. లీడర్ సినిమా చాలా హానెస్ట్ గా చెప్పిన కథ. అందులో లవ్ స్టోరీ పెట్టాలి మంచి పాటలు పెట్టాలని అనుకోలేదు. హ్యాపీ డేస్ లో కూడా అంతే. కాలేజ్ స్టోరీ అంటే కాలేజ్ స్టోరీ లాగే ట్రీట్ చేయడం జరిగింది. అందుకే మీకు నచ్చింది. కుబేర కూడా అంతే. ఈ కథకు కావలసింది చేశాను. మార్క్ అనేది కథ ప్రకారం ఉంటుంది. అయితే ఇలాంటి కథని ఇలా చేశారా అనే ప్రేక్షకులు ఆశ్చర్యానికి గురవుతారు. అందుకే ఈ కంటెంట్ ఏంటనేది ట్రైలర్ టీజర్ లో క్లియర్ గా చెప్పాము. రిచ్, పూర్ మధ్య జరిగే కథని ముందుగానే ఎస్టాబ్లిష్ చేశాం.

**★ ఈ కథ ఐడియాలజీ ఎవరినైనా నొప్పించేలా ఉంటుందా?**

లేదండి. ఇది ఐడియాలాజికల్ బాటిల్ ఉండే సినిమా కాదు. అయితే సినిమా చూస్తున్నప్పుడు ఇలాంటి ఒక రెండు ప్రపంచాలు ఉన్నాయనే అవేర్నెస్ వస్తుంది. ఇది నా కెరీర్ లో భారీ బడ్జెట్ సినిమా. .నిర్మాతలు పుష్కర్ రామ్మోహన్ రావు, సునీల్ నారంగ్ సపోర్టు మర్చిపోలేనిది. ఇంత పెద్ద స్టార్ కాస్ట్, పెద్ద బడ్జెట్ నిర్మాతల వల్లే సాధ్యమైంది.

**★ సినిమాలో నాగార్జున ధనుష్ గారి క్యారెక్టర్స్ ఎలా ట్రావెల్ చేస్తాయి?**

అది మీరు సినిమాలోనే చూడాలి.చాలా బ్యూటిఫుల్ గా వుంటుంది.

ఈ సినిమా ప్రాసెస్ లో ఛాలెంజింగ్ అనిపించింది ఏమిటి ?

ముంబై షూట్ చాలా డిఫికల్ట్., అక్కడ పర్మిషన్స్ రావు. చాలా కండిషన్స్ ఉంటాయి. ముంబై వాళ్లే వేరే చోట షూట్ చేసుకుంటున్నారు. అలాంటి పరిస్థితుల్లో అక్కడ షూట్ చేయడం అనేది చాలా చాలెంజింగ్ గా అనిపించింది.

**★ ముంబై బ్యాక్ డ్రాప్ తీసుకోవడానికి కారణం ఏమిటి?**

ఈ కథే ముంబై బ్యాక్ డ్రాప్ కోరుకున్నది. కథపరంగా ముంబై తప్పనిసరి.

**★ 25 ఇయర్స్ మీ జర్నీ చూసుకున్నప్పుడు ఎలా అనిపిస్తుంది?**

ఎక్కడో ఒక చిన్న ఇంట్లో ఫస్ట్ సినిమా తీశాను. ఇప్పుడు ఇంత పెద్ద సినిమా చేశాను. ఈ జర్నీ అంత చూసుకున్నప్పుడు ఎమోషనల్ గా అనిపిస్తుంది. ప్రేక్షకులు చాలా ప్రేమని ఇచ్చారు. ఎప్పుడు నాపై ఒక నమ్మకాన్ని ఉంచారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను. అది చాలా ఆనందాన్ని ఇచ్చే విషయం. నా సినిమాల్ని అప్రిషియేట్ చేసి ఆడియన్స్ నాకు ఒక స్థాయిని ఇచ్చారు. అంతకంటే నేను ఏం కోరుకోను.

**కుబేర కి పార్ట్ 2 ఉంటుందా?**

లేదండి. ఇక్కడితో అయిపోతుంది. నేను ఒక్కటి తీసినప్పటికే సరిపోతుంది.

**లీడర్ కి సీక్వల్ ఉంటుందా?**

అది నేను ఆలోచిస్తూ ఉంటాను. కథ నాకు క్లారిటీ ఉంది. కానీ లీడర్ తీసినప్పటికీ ఇప్పటికీ పరిస్థితులన్నీ చాలా మారిపోయాయి. దేశంలో, ప్రజల్లో చాలా మార్పులు వచ్చేసాయి. థింకింగ్ మారిపోయింది. దాన్ని సరిగ్గా పట్టుకోవాలి.

**నానితో ఒక సినిమా అనుకున్నారని విన్నాం ?**

షాలిడ్ గా అనుకోలేదు. దానికి కొంచెం టైం పడుతుంది. ఇంకా వర్క్ చేయాలి.



## స్మశానంలో స్థలం కోసం సాగే కథ ఉప్పు కప్పురంబు

మరణించినవారి సంఖ్య పెరిగిపోయిన కారణంగా స్మశానంలో చోటు తక్కువ అయిన ఒక పల్లెటూరి హాస్యభరిత చిత్రము ఉప్పు కప్పురంబు. సుహాస్ , కీర్తి సురేష్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా ట్రెయిలర్ ను విడుదల చేశారు. ఎల్లనార్ ఫిలమ్స్ ప్రై లి. బ్యానర్ పై రాధిక లావూ నిర్మించగా, ఐ.వి. శశి దర్శకత్వం వహించారు. వసంత్ మరింగంటి రచించిన ఈ చిత్రం లోని ఇతర పాత్రల్లో బాబు మోహన్, తాళ్ళూరి రామేశ్వరి కీలక పాత్రలలో నటించారు. ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా 240 దేశాలలో జులై 4న ప్రైమ్ వీడియో పై ప్రీమియర్ లో ప్రసారం కానుంది. తెలుగు తోపాటు హింది, తమిళం, మళయాళం మరియు కన్నడ భాషలలో డబ్బింగ్ మరియు ఇంగ్లీష్ తో కలిపి 12 భాషలలో సబ్‌టైటిల్స్ తో ప్రసారం అవుతుంది. చిన్నా పాత్ర ఇదివరకు నేను చేసిన పాత్రల కంటే పూర్తిగా భిన్నంగా ఉంటుంది, అని సుహాస్ ఈ సందర్భంగా అన్నారు.



## 'సోలో బాయ్' ట్రైలర్ విడుదల

సెవెన్ హిల్స్ బ్యానర్ పై వేణుదార్ బేబీ నేహశ్రీ సమర్పణలో సతీష్ నిర్మాతగా నవీన్ కుమార్ దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సోలో బాయ్. ఈ చిత్రంలో బిగ్ బాస్ ఫేమ్ గౌతం కృష్ణ హీరోగా నటిస్తుండగా పసుపులేటి రమ్య, శ్వేత అవస్తి హీరోయిన్ లుగా నటించారు. పోసాని కృష్ణ మురళి, అనిత చౌదరి, షఫీ, ఆర్కే మామ, భద్రం ఆనంద్ చక్రపాణి, సూర్య, ల్యాబ్ శరత్, అరుణ్ కుమార్, రజిని వర్మ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి త్రిలోక్ సిద్ధు సినిమాటోగ్రాఫర్ గా పని చేయగా జుడా సంధ్య చిత్రానికి సంగీతం అందించారు. జులై 4వ తేదీన వెండిపై ప్రేక్షకులను అలరించబోతోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ లో జరిగింది. ఆపరేషన్ సింధూర్ లో అమరుడైన తెలుగు జవాన్ మురళి నాయక్ తల్లిదండ్రుల చేతుల మీదగా ఈ చిత్ర ట్రైలర్ ఆవిష్కరించారు.

## 'తెలంగాణ రైజింగ్-2047 విజన్' అద్భుతం

### ఇంగ్లాండ్ (యూకె) మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ ప్రశంస, ఢిల్లీలో టోనీ బ్లెయిర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం



**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి కోసం 'తెలంగాణ రైజింగ్2047 విజన్' అద్భుతంగా ఉందని ఇంగ్లాండ్ (యూకె) మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. 1997–2007 మధ్య పదేళ్ల పాటు యూకేకు ప్రధానమంత్రిగా, సుదీర్ఘకా లం ఇంగ్లాడ్ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించిన టోనీ బ్లెయిర్ రాజకీయాల నుంచి తప్పుకున్న తర్వాత ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని నాయకులకు విజన్, వ్యూహరచన, వాటి అమలుకు సహకరించాలనే ఉద్దేశంతో టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టిబిఐజిసి) ను స్థాపించారు. భారత్ పర్యటనలో ఉన్న టోనీ బ్లెయిర్‌తో ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. ఇద్దరు నేతలు గంటకుపైగా సమావేశమైన అనంతరం తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, అమలులో భాగస్వామ్యానికి తెలంగాణ ప్రభుత్వం, టిబిఐజిసి ప్రతినిధులు ఉద్దేశ పత్రాన్ని (లెటర్ ఆఫ్ ఇంటెంట్) పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో రైతులు, యువత, మహిళలు తదితర విభిన్న వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి టోనీబ్లెయిర్‌కు తెలియజేశారు. తెలంగాణ రైజింగ్–2047 ముఖ్య అంశాలను తెలియజేస్తూ, ఈ విజన్‌ను 2025, డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవం సందర్భంగా ప్రజలకు వెల్లడించనున్నట్లు సిఎం తెలిపారు. మానవ అభివృద్ధి సూచికల్లో అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పట్టణ, పట్టణ శివారు, గ్రామీణ ప్రాంతాల వారీగా తాము అమలు చేయనున్న సూక్ష్మ ప్రణాళికను యూకె మాజీ ప్రధానమంత్రికి సిఎం తెలియజేశారు. సుస్థిరాభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళిక ఉందని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులపై టోనీబ్లెయిర్ ఆసక్తి చూపారు. సమావేశంలో తెలంగాణ నీటి పారుదల మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎంపిలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎ.పి.జితేందర్‌రెడ్డి, రాష్ట్ర పారిశ్రామిక, పెట్టుబడుల విభాగం సిఈఓ జయేశ్ రంజన్, పారిశ్రామిక, వాణిజ్య విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, టిబిఐజిసి ప్రతినిధులు పాల్గొన్నారు.

## నా ప్రమేయం లేదు (మొదటి పేజీ తరువాయి)

అన్నారు. విందు తర్వాత మునీర్‌తో కలిసి మాట్లాడుతూ, యుద్ధాన్ని విరమింపజేయడంలో తన ప్రమేయం లేదని ఒప్పుకున్నారు. కెనడాలోని కననిస్కిన్‌లో జరిగిన జి–7 సదస్సులో మోదీ–ట్రంప్ ముఖాముఖీ కలుసుకోలేకపోయారు. దీంతో మోదీ ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు. భారత్–పాకిస్థాన్ వ్యవహారాలలో మూడో పక్షం జోక్యాన్ని ఎన్నటికీ తాము అంగీకరించబోదని చెప్పారు. పాకిస్థాన్ స్వయంగా చొరవచేసి భారత్‌కు విజ్ఞప్తి చేయడంవల్లనే మే 10వ తేదీన కాల్పుల విరమణ అవగాహన కుదిరిందని చెప్పారు. ఈ ఫోన్ కాల్ తర్వాత కూడా ట్రంప్ పాతపాటే అందుకున్నప్పటికీ, మునీర్‌తో కలిసి పత్రికాగోష్ఠిలో మాత్రం, చాలా తెలివైన రెండు దేశాల నాయకులు యుద్ధం కొనసాగించకూడదని గ్రహించి కాల్పుల విరమణ అవగాహనకు వచ్చారని అన్నారు. సైనికచర్య అణుయుద్ధానికి దారితియ్యకుండా విజ్ఞతతో వ్యవహరించారన్నారు. యుద్ధాన్ని ఆపడంలో పాకిస్థాన్ వైపు నుండీ ఈ వ్యక్తి ప్రధాన పాత్ర పోషించారని ట్రంప్ తన పక్కనే ఉన్న మునీర్‌ను ప్రశంసించారు. "యుద్ధాన్ని కొనసాగించకుండా ముగించినందుకు ఆయనకు నా కృతజ్ఞతలు, మీకు తెలుసు కదా, ప్రధానమంత్రి మోదీకి కూడా నా కృతజ్ఞతలు, భారతదేశంతో ఒక వాణిజ్యం ఒప్పందం చేసుకుంటున్నాం, అలాగే పాకిస్థాన్‌తో కూడా వాణిజ్య ఒప్పందం చేసుకుంటున్నాం" అని ట్రంప్ చెప్పారు. ఫిబ్రవరిలో వైట్‌హౌస్‌ను సందర్శించిన మోదీతో జరిపిన సమావేశాన్ని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. మునీర్‌ను కలుసుకోవడం తనకు ఎంతో గర్వంగా ఉందని ట్రంప్ అన్నారు. మధ్యప్రాచ్యంలో యుద్ధ పరిస్థితుల గురించి తామిద్దరం చర్చించామని చెప్పారు. ట్రంప్‌తోపాటు మధ్యప్రాచ్య అమెరికా ప్రత్యేక ప్రతినిధి విట్ కాఫ్ విందులో పాల్గొన్నారు. మునీర్ వెంట పాకిస్థాన్ జాతీయ భద్రతాసలహాదారు, పాకిస్థాన్ గూఢచారిసంస్థ ఐఎస్ఐ ప్రధానాధిపతి, లెఫ్టినెంట్ జనరల్ ఆసిమ్ మాలిక్ ఉన్నారు. ట్రంప్‌తో విందు తర్వాత పాకిస్థాన్‌లో మునీ ర్ సెలబ్రిటీగా మారారు. దౌత్యరంగంలో ఇ దెంతో ఘనవిజయంగా పాకిస్థాన్ భావిస్తున్నది. పాకిస్థాన్ ఆర్మీ ఇస్లామాబాద్‌లో ఒక ప్రకటన చేస్తూ, పాకిస్థాన్‌తో పరస్పర ప్రయోజనాలతో కూడిన వాణిజ్య సంబంధాలు కొనసాగించేందుకు ట్రంప్ ఎంతో ఆసక్తి చూపించారని, దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రయోజన నిబంధనలే పునాదిగా ఈ సంబంధాలుంటాయని పేర్కొంది.

## సొంతింటికల నెరవేర్చడం ప్రభుత్వ ఆశయం
(మొదటి పేజీ తరువాయి)

పత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు తో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి అర్హులకు ఇండ్ల పత్రాలు పంపిణీ చేశారు. వాసాలమర్రి గ్రామంలో మొదటి లబ్ధిదారు ఆగవ్వకు ఇందిరమ్మ ఇంటి పత్రం, ఒక లక్ష రూపాయల చెక్కును మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వాసాలమర్రి గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండదండగా ఉంటుందని, దానికి అనుగుణంగా ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలనే ఆశయంతో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆనాటి కేసీఆర్ పాలనలో వాసాలమర్రిని అభివృద్ధి చేస్తామని చెప్పి చేయలేక పోయిన, అభివృద్ధి పనులను ఇందిరమ్మ హయాంలో వాసాలమర్రి గ్రామంలో ఉన్న అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. పేదవారికి ఏ ఆపద వచ్చిన ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం చేయడం జరుగుతుందని భరోసా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ పేదవారి సొంతింటి కల నెరవేర్చాలని ఆకాంక్షతో ప్రభుత్వం వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకొని అర్హులందరికీ ఇండ్లు కట్టించాలని గొప్ప ఆలోచన చేసి వాసాలమర్రి గ్రామంలో అర్హులకు ఇండ్ల పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు.ఇచ్చిన ప్రతి హామీలను అమలు చేసుకుంటూ ప్రభుత్వం అన్ని విధాలుగా సంక్షేమంలో ముందుకు పోతుందన్నారు. ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం మహిళలకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చి ప్రతి మహిళ కోటీశ్వరులు కావాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం మహిళల కొరకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వాసాలమర్రి గ్రామంలో అర్హులైన పేదవారికి ఇండ్ల పత్రాలు పంపిణీ చేయడం ప్రజా పాలనకు ఒక నిదర్శనం అని అన్నారు. ధనిక, పేద కుటుంబానికి అర్హులైన ప్రతి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు పారదర్శకంగా ఇవ్వడం జరుగుతుందన్నారు.ప్రతి పేద వారు కడుపునిండా అన్నం తినాలని కోరికతో ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వానాకాలం పంట సాగు కింద రైతు భరోసా కింద రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంత రావు, రాష్ట్ర మహిళా కమిషన్ బందు శోభారాణి, మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, రేఖ బాబురావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, స్థానిక ఎమ్మార్వో దేశ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు,ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్షిపణులు చూశాం...
(మొదటి పేజీ తరువాయి)

మోతను విన్నాం. మేం భయపడ్డాం' అని గురువారం తెల్లవారుజామున మొదటి తరలింపు విమానంలో ఇరాన్ నుంచి భయంతో వణుకుతోన్న గొంతుకతో ఢిల్లీకి చేరుకున్న ఎంబిబిఎస్ విద్యార్థి మీర్ ఖలీఫ్ విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడారు. భారతదేశం పంపించిన విమానంలో ఊర్మియా యూనివర్సిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన 90మంది విద్యార్థులు సహా 110మంది ఢిల్లీ చేరుకున్నారు. అందులో మీర్ ఖలీఫ్ ఒకరు. తొలుత టెహ్రాన్ నుంచి పొరుగుదేశమైనర ఆర్మేనియాకు వెళ్లి, అక్కడ నుంచి స్వదేశానికి చేరుకున్నారు. వారందరినీ 'ఆపరేషన్ సింధు'లో భాగంగా ఇండియన్ ఎంబసీ సురక్షితంగా ఢిల్లీకి చేర్చింది. కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి కీర్తి వర్ధన్‌సింగ్ ఇరాన్ నుంచి భారత్ చేరుకున్న బాధిత వైద్యవిద్యార్థులకు ఢిల్లీ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. ఎంబిబిఎస్ విద్యార్థి మీర్ ఖలీఫ్ మాట్లాడుతూ ఇరాన్‌లో తమ అనుభవాన్ని ఒక పీడకలగా వర్ణించారు. 'టెహ్రాన్ నుంచి ఆర్మేనియాకు తీసుకెళ్లి అక్కడ నుంచి మమ్ములను స్వదేశానికి తీసుకొచ్చిన భారత ప్రభుత్వానికి మేం కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం' అని ఆయన జీరబోయిన స్వరంతో పేర్కొన్నారు. మేం క్షిపణులను చూశాం. బాంబుల మోతలు విన్నాం. ఇరాన్ ఒక వార్ జోన్‌గా మారింది. దాడుల సమయంలో మా భవనం ప్రకంపించింది. 'మేం ఎదుర్కొన్న భయానక పరిస్థితిని ఏ విద్యార్థి కూడా ఎదుర్కోకూడదు' అని నేను ఆశిస్తున్నానన్నారు. 'ఇరాన్‌లో ఇంకా కొందరు విద్యార్థులు చిక్కుకుని ఉన్నారు. వారందరినీ సురక్షిత ప్రాంతాలకు చేర్చాలి. వారిని కూడా భారత ప్రభుత్వం విమానాల ద్వారా త్వరలోనే భారతదేశానికి చేరుస్తుందని నేను ఆశిస్తున్నాను' అని ఖలీఫ్ అన్నారు. కశ్మీర్‌కు చెందిన మరొక విద్యార్థి హుజైఫ్ మాలిక్ మాట్లాడుతూ 'కశ్మీర్ నుంచి 90 మంది విద్యార్థులం ఇరాన్‌లో ఉంటున్నాం. ఈరోజు ఉదయం మేం భారతదేశానికి చేరుకున్నాం. మేం ఇప్పుడు కశ్మీర్‌కు స్లీపర్ బస్సులలో వెళుతున్నాం. కొంతమంది విద్యార్థులు విమానాలలో వారి స్వస్థలాలకు పయనమయ్యారు' అని వివరించారు.

## యుద్ధోన్మాదం నశించాలి
(మొదటి పేజీ తరువాయి)

నిరసన చేపట్టేందుకు వెళ్ళిన వామపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. నార్సింగి, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లకు తరలించారు. సిపిఐ, సిపిఐ (ఎం), సిపిఐ(ఎంఎల్ )న్యూ డెమొక్రసీ, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్, ఎంసిపిఐ(సి) ఆర్ఎస్పి, ఫార్వర్డ్ బ్లాక్, సిపిఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో అమెరికా కాన్సులేట్ కార్యక్రమం వద్ద నిరసనకు పిలుపునిచ్చాయి. పాలస్తీనా గాజానగరం పై ఇజ్రాయిల్ అమానుష దాడి సరైనది కాదని, తక్షణమే ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ డిమాండ్ చేశారు.గురువారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గౌలిదొడ్డి ఏరియాలోని అమెరికన్ కౌన్సిలేట్ కార్యాలయం ముందు పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడి నిరసిస్తూ గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ,సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.టి.నరసింహ,సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు కె రామస్వామి,జిల్లా కార్యవర్గ సభ్యులు టి రామకృష్ణ,ఎం ప్రభు లింగం,జిల్లా సమితి సభ్యులు కె చందు యాదవ్,ఆనంద్ గౌడ్, విజయనంద్ గౌడ్,న్యూ డెమోక్రసీ నాయకులు వెంకటరామయ్య, గోవర్ధన్, సిపిఐ ఎమ్మెల్యే లిబరేషన్ నాయకులు రమేష్ రాజు,ఎస్ యుఐ(సి) నాయకులు మురహరి,ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మల్లేష్, సీనియర్ నాయకులు శంకరయ్య, తదితరులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.గండిపేట మండలం నార్సింగి పోలీస్ స్టేషన్ కు పద్మ తో పాటు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, తదితరులను తరలించారు.ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ మాట్లాడుతూ పాలస్తీనాలోని గాజానగరంపై ఇజ్రాయిల్ పలు దఫాలుగా బాంబులను ప్రయోగించి అమాయక ప్రజలను అమానుషంగా చంపడం దుర్మార్గమని, యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ దేశానికి వివిధ దేశాల నుండి వెళ్లే ఆహార ఇతర వస్తువులను దిగుమతి చేయకుండా కఠినమైన చర్యలు తీసుకుని, తక్షణమే యుద్ధాన్ని ఆపాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో నరేంద్ర మోదీ బిజెపి ప్రభుత్వం తమ వైఖరి స్పష్టం చేయాలని,ఇలాంటి యుద్ధాలకు అనుకూలమా, వ్యతిరేకమా చెప్పాలని డిమాండ్ చేశారు. యుద్ధం వల్ల ప్రపంచ శాంతి ఉండదని, ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నం అవుతాయని, ఇజ్రాయిల్ దేశానికి ఆయుధా,ఆర్థిక సరఫరా చేస్తూ అండగా నిలిచిన అమెరికా ఆధిపత్యం ప్రపంచానికి కనబడుతున్న.. భారత ప్రధాని నరేంద్ర మోదీ నిస్సిగ్గుగా అమెరికా దేశానికి ట్రంప్ కు సపోర్టుగా ఉండడం బాధాకరమని వారు తీవ్రంగా మండిపడ్డారు. వామపక్ష పార్టీల నాయకులు పశ్య పద్మ, ఈ టి నరసింహ, పాలమాకుల జంగయ్య,జాన్ వెస్లీ,హన్మేష్, వేములపల్లి వెంకట్రామయ్య, గోవర్ధన్, సంధ్య, అనురాధ,మురహరి, ప్రసాద్, సుహాస్, ఎస్ వెంకటేశ్వరరావు, కె ఎస్ ప్రదీప్, నేదునూరి జ్యోతి, కే కాంతయ్య, ఛాయాదేవి, స్టాలిన్ , ప్రభు లింగం, డీజే నరేంద్ర ప్రసాద్ , వజ్రాల అరుణ,బాస్ పల్లి, భార్గవి తదితరులు నిరసన కార్యక్రమం లో పాల్గొన్నారు. పశ్యపద్మ, పాలమాకుల జంగయ్య, జాన్ వెస్లీ, హన్మే ష్, వేముల పల్లి వెంకట్రామయ్య గోవర్ధన్ సంధ్య దాదా పు వంద మంది అరెస్ట్ అయ్యారు.






**అమెరికా సామ్రాజ్య వాద కక్షలో భాగమే పాలస్తీనా యుద్ధం : కూనంనేని సాంబశివరావు**

భద్రాద్రి కొత్తగూడెం : ఆయుధ వ్యాపారాన్ని విస్తరింపజేసుకునేందుకు దేశాల మధ్య చిచ్చు పెడుతూ అమెరికా ఆయుధాలను ప్రేరేపిస్తోందని, ఇది ట్రప్ సామ్రాజ్యవాద కక్షకు ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధం పరాకాష్టని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు విమర్శించారు. కొత్తగూడెంలో సిపిఐ,సిపిఎం, న్యూడెమోక్రసీ కార్యాలయాల నుండి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ ప్రపంచ దేశాలను తన చెప్పుచేతల్లో పెట్టుకుని క్రూరపెత్తనం చేస్తోందని మండిపడ్డారు. రెండు దశాబ్ధాలుగా పాలస్తీన ప్రజలపై ఇజ్రాయేల్ నిరంతరం బాంబు, వైమానికి దాడులకు పాల్పడుతూ లక్షలాది మందిని పొట్టనపెట్టుకుంటూ మారణహోమాన్ని సృష్టిస్తుంటే అంతర్జాతీయ చట్టాలు, మానవహక్కులు హరించుకుపోతున్న పరిస్థితుల్లో పాలస్తీన ప్రజలకు యూావత్ ప్రపంచం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా ప్రోత్సాహంతో ఇజ్రాయేల్ జరుపుతున్న భీబత్సవాన్ని నిలిపిచేయాలని, శాంతి ఖాముఖులు రోడ్డెక్కి ఇతర దేశాలకు స్ఫూర్తినివ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్ద బిక్షం ఎన్‌డి నాయకులు కె సురేందర్ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com